www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

డిసెంబరు 21
ప్రపంచ ధ్యాన దినోత్సవం

తీర్మానానికి ఐక్యరాజ్య సమితి ఏకగ్రీవ ఆమోదం 2


జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడంలోనూ భారతదేశం కీలక పాత్ర

ఆదివారం | 8-12-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 233 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 9.45 తదుపరి అష్టమి; నక్షత్రం: శతభిషం సా. 4.03 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 10.09-11.40; దుర్ముహూర్తం: సా. 4.08-4.52; అమృతఘడియలు: ఉ. 9.05-10.37; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిలియనీర్ల భారత్

అత్యధిక బిలియనీర్లున్న దేశాల్లో మూడో స్థానం



- ప్రస్తుతం దేశవ్యాప్తంగా 185 మంది కుబేరులు
- గత ఏడాదితో పోలిస్తే 21% పెరిగిన సంఖ్య
- 2015తో పోలిస్తే 123% అధికం
- యూబీఎస్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. స్విస్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ ఈ ఏడాదికి గాను విడుదల చేసిన బిలియనీర్స్ యాంబిషన్స్ నివేదిక ప్రకారం.. భారత్‌లో 185 మంది బిలియనీర్లు ఉన్నారు. 835 మంది బిలియనీర్లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా.. 427 మందితో చైనా రెండో స్థానంలో ఉంది. కనీసం 100 కోట్ల డాలర్ల (రూ.8,465 కోట్లు) వ్యక్తిగత సంపద కలిగిన వారిని బిలియనీర్‌గా పిలుస్తారు.

భారత బిలియనీర్ల మొత్తం సంపద రూ.76.66 లక్షల కోట్లు

ఈ ఏడాది భారత్‌లో మరో 32 మంది బిలియనీర్లుగా అవతరించారు. గత ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 21 శాతం పెరగగా.. 2015తో పోలిస్తే 123 శాతం వృద్ధి నమోదైంది. దేశంలోని ప్రస్తుత బిలియనీర్ల మొత్తం సంపద గడిచిన ఏడాది కాలంలో 42.1 శాతం ఎగబాకి 90,560 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.76.66 లక్షల కోట్లు) చేరుకుందని యూబీఎస్ వెల్లడించింది. వచ్చే దశాబ్దకాలంలో భారత్‌లో బిలియనీర్ అంత్రప్రెన్యూర్ల సంఖ్య గణనీయంగా పెరగనుందని నివేదిక పేర్కొంది. భారత ఆర్థిక పరివర్తనంలో కుటుంబ వ్యాపారాలు కీలక పాత్ర పోషించాయని వెల్లడించింది. దేశంలో 108 కుటుంబ వ్యాపారాలు స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాయని, లిస్టెడ్ కుటుంబ వ్యాపారాలు అత్యధిక సంఖ్యలో ఉన్న దేశాల్లో భారత్ ఒకటని యూబీఎస్ తెలిపింది.

మరిన్ని ముఖ్యాంశాలు

- ప్రపంచవ్యాప్త బిలియనీర్లు 2015లో 1,757 మంది ఉండగా.. 2024లో సంఖ్య 2,682కు చేరుకుంది. బిలియనీర్ల మొత్తం సంపద విలువ గడిచిన పదేళ్లలో 6.3 లక్షల కోట్ల డాలర్ల నుంచి 14 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంది. అంటే ఏటేటా వీరి సంఖ్య 10 శాతం చొప్పున పెరిగింది.
- గడిచిన ఏడాది కాలంలో అమెరికాలో కొత్తగా 84 మంది బిలియనీర్లుగా అవతరించగా.. చైనాలో వీరి సంఖ్య 93 తగ్గింది. అమెరికన్ కుబేరుల మొత్తం సంపద 4.6 లక్షల కోట్ల డాలర్ల నుంచి 5.8 లక్షల కోట్ల డాలర్లకు పెరగగా.. చైనా బిలియనీర్ల వెల్త్ 1.8 లక్షల కోట్ల డాలర్ల నుంచి 1.4 లక్షల కోట్ల డాలర్లకు పడిపోయింది.
- ప్రపంచ ప్రస్తుత కుబేరుల్లో 1,877 మంది స్వయం కృషితో ఎదిగినవారు కాగా..805 మందికి ఆస్తి వారసత్వంగా సంక్రమించింది.
- గడిచిన దశాబ్దకాలంలో టెక్ బిలియనీర్ల సంపద శరవేగంగా పెరుగుతూ వచ్చింది. 2015లో వీరి మొత్తం సంపద 78,890 కోట్ల డాలర్లుగా ఉండగా.. 2024 నాటికి మూడింతలై 2.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది.
- పారిశ్రామిక బిలియనీర్ల మొత్తం సంపద 48,040 కోట్ల డాలర్ల నుంచి 1.3 లక్షల కోట్ల డాలర్లకు పెరగగా.. మెటీరియల్స్ రంగ బిలియనీర్ల వెల్త్ 71,810 కోట్ల డాలర్ల నుంచి 1.8 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది.
- రియల్టీ రంగ బిలియనీర్ల సంపద వృద్ధి మాత్రం 53,400 కోట్ల డాలర్ల నుంచి 69,230 కోట్ల డాలర్లకు పరిమితమైంది. చైనాలో రియల్టీ సంక్షోభం, కమర్షియల్ రియల్టీపై కొవిడ్ సంక్షోభ ప్రభావం, అమెరికా, యూరప్‌లో గృహ రుణ వడ్డీ రేట్ల పెరుగుదల వంటి అంశాలు స్థిరాస్తి కుబేరుల సంపద వృద్ధిపై ప్రభావం చూపాయి.

న్యూ ఫండ్స్

సామ్కో మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్

సామ్కో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్ (ఎంఏఏఎఫ్) ప్రారంభించింది. కంపెనీ సొంతంగా రూపొందించిన 'రొటేట్' వ్యూహంతో దీన్ని తీసుకువచ్చింది. ఈక్విటీలు, బంగారం, డెట్/ఆర్బిట్రేజ్ వంటి వాటిల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 18. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000.

యాక్సిస్ క్రిసిల్ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ బాండ్ ఎన్‌బీఎఫ్‌సీ-హెచ్‌ఎఫ్‌సీ-జూన్ 2027 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 10. కనీస పెట్టుబడి రూ.5,000.

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ కాంగ్లోమిరేట్ ఫండ్

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ లిమిటెడ్.. కాంగ్లోమిరేట్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఓపెన్ ఎండెడ్ డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్ ఇది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్‌లో 33 శాతం వాటా కలిగిన 22 రంగాల్లోని 169 కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 19.

బజాజ్ ఫిన్‌సర్వ్ హెల్త్‌కేర్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. హెల్త్‌కేర్ ఫండ్‌ను ప్రారంభించింది. హెల్త్, వెల్‌నెస్ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ పథకం ఇది. బీఎస్ఈ హెల్త్‌కేర్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 20.

కృత్రిమ మేధ స్టార్టప్‌ల హవా!

ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 110 స్టార్టప్‌లకు యూనికార్న్ హోదా

అందులో 40 శాతం ఏఐ కంపెనీలే..

చెన్నై: కృత్రిమ మేధ (ఏఐ).. టెక్నాలజీ ప్రపంచంలో ప్రస్తుతం అందరి నోటా ఇదే మాట. స్టార్టప్‌ల రంగానికి 2024 'ఏఐ నామ సంవత్సరమే'నని చెప్పాలి. ఎందుకంటే, ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 110 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను సాధించగా.. అందులో 40 శాతం ఏఐ కంపెనీలే. స్టార్టప్‌ల రంగం నిధుల కొరతతో సతమతం అవుతున్న నేపథ్యంలోనూ కొత్త పెట్టుబడుల ఆకర్షణ విషయంలో ఏఐ అంకురాలు హవా కనబరిచాయి. కనీసం బిలియన్ డాలర్ల (100 కోట్ల డాలర్లు=రూ.8,475 కోట్లు) విలువ కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. పిచ్‌బుక్ యూనికార్న్ ట్రాకర్ డేటా ప్రకారం.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 103 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను సాధించగా.. 2024లో సంఖ్య 110కు చేరుకుంది. అందులో అమెరికాకు చెందిన ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లైమెట్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, క్రిప్టో స్టార్టప్‌లే అధికం. మొత్తం 63 యూఎస్ స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా మారాయి. చైనాలో 16, ఇజ్రాయెల్ నుంచి 3, ఒక సింగపూర్ సంస్థ, 4 యూకే కంపెనీలూ ఈ హోదా దక్కించుకున్నాయి.

భారత్ నుంచి 5: ఓలా వ్యవస్థాపకుడు భవిశ్ అగర్వాల్‌కు చెందిన ఏఐ స్టార్టప్ కృత్రిమ్ సహా 5 భారత కంపెనీలు ఈ ఏడాది యూనికార్న్‌లుగా అవతరించాయి. బైక్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో, ఎస్ఏఏఎస్ కంపెనీ పెర్ఫియోస్, ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ ఏథర్, ఫిన్‌టెక్ సంస్థ మనీవ్యూ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో కలిపి దేశంలో యూనికార్న్‌ల సంఖ్య 118కి చేరుకుంది. అందులో 60 శాతం స్టార్టప్‌లు కొవిడ్ సంక్షోభం తర్వాతే (2021, 2022) ఈ హోదా సాధించాయి.

ఎన్‌జే బయోలో సువెన్ ఫార్మాకు 51% వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఎన్‌జే బయో ఇంక్‌లో 56 శాతం వాటాలను కొనుగోలు చేయనున్నట్లు సువెన్ ఫార్మాస్యూటికల్స్ ప్రకటించింది. సుమారు రూ.545 కోట్ల (6.44 కోట్ల డాలర్లు) ఈ వాటాను దక్కించుకున్నట్లు తెలిపింది. ఈ నెలాఖరుకల్లా ఈ డీల్‌ను ముగించే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది. అమెరికాలోని ప్రిన్స్‌టన్ కేంద్రంగా ఎన్‌జే బయో కార్యకలాపాలు సాగిస్తోంది. టెక్నాలజీ ఆధారిత సీడీఎంఓ, ఏడీసీ వంటి ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్‌ను అందించే లక్ష్యానికి అనుగుణంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు సువెన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వివేక్ శర్మ తెలిపారు. అంతేకాకుండా ఏడీసీ/ఎక్స్‌డీసీ విభాగంలో సువెన్ అంతర్జాతీయ కంపెనీగా ఎదిగేందుకు ఎన్‌జే బయో సామర్థ్యాలు తోడ్పడతాయని పేర్కొన్నారు.

జీఎస్‌టీ రికార్డులు, పద్దుల నిర్వహణ ఎలా..?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ అమల్లోకి వచ్చి చాలా కాలమైనప్పటికీ జీఎస్‌టీలో నమోదైన చాలా మంది వ్యాపారులకు ఎలాంటి రికార్డులు నిర్వహించాలి, వీటిని ఎంతకాలం జాగ్రత్తగా ఉంచాలన్న విషయాల మీద ఇప్పటికీ అవగాహన లేదు. దీనివల్ల ఆడిట్ లేదా ఇతర తనిఖీలు జరిగేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూచించిన విధంగా రికార్డులు లేకపోయినా లేదా సరైన వివరాలు నమోదు చేయకపోయినా, తేడా ఉన్న మేరకు ఉల్లంఘన జరిగినట్లు భావించి చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉంటుంది. కాబట్టి జీఎస్‌టీలో నమోదైన అందరికీ ఈ రికార్డుల నిర్వహణ మీద అవగాహన కలిగి ఉండాలి.

ఇందులో మొదటిగా స్టాక్ రిజిస్టర్ గురించి చెప్పుకోవాలి. కాంపోజిషన్ స్కీమ్‌లో నమోదైన వారు తప్ప మిగతా వారందరూ స్టాక్ రిజిస్టర్ విధిగా నిర్వహించాలి. దీనిలో స్టాక్స్‌కు సంబంధించిన అన్ని వివరాలు అంటే ఓపెనింగ్ బ్యాలెన్స్, కొనుగోలు, అమ్మకం వివరాలు, క్లోజింగ్ బ్యాలెన్స్ వీటితో పాటు ఏదైనా సరుకు పనికి రాకుండా పోయినా, బహుమతుల రూపంలో ఉచితంగా ఇచ్చినా.. అలాంటి వివరాలన్నీ కచ్చితంగా చూపాలి.

అలాగే రిజిస్ట్రేషన్ తీసుకున్న ప్రతి ఒక్కరు అడ్వాన్సుల వివరాలు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో ఆయా వ్యక్తులు ఇచ్చిన అడ్వాన్సులు, తీసుకున్న అడ్వాన్సులు, వీటికి సంబంధించి చేసిన సర్దుబాట్లు విధిగా చూపాలి. అలాగే పన్ను చెల్లింపునకు సంబంధించిన వివరాలు అంటే చెల్లించాల్సిన పన్ను, వసూలు చేసిన, చెల్లించిన పన్ను వివరాలతో పాటు ఇన్‌పుట్ ట్యాక్స్‌కు సంబంధించిన వివరాలు, అలాగే రివర్స్ చార్జ్‌లో పన్ను చెల్లించాల్సి వస్తే వాటి వివరాలు తప్పనిసరిగా వెల్లడించాలి. రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తి ఎగుమతులు, దిగుమతులు చేస్తే వాటికి సంబంధించిన వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను నిర్వహించాలి. తయారీ రంగంలో ఉన్న వ్యక్తి అయితే తాను ఉత్పత్తి చేసిన వస్తువుల తాలూకు రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది.

వర్క్స్ కాంట్రాక్ట్ సర్వీస్ రంగంలో ఉన్న వారు ప్రతి కాంట్రాక్టుకు సంబంధించి అన్ని వివరాలు అంటే చేసే పనికి సంబంధించిన వివరాలు, అందులో వాడే వస్తువులు, సేవల వివరాలు, కాంట్రాక్ట్ విలువ, కాంట్రాక్ట్ ఇచ్చిన వ్యక్తి వివరాలతో పాటు తాను వేరే వ్యక్తుల నుంచి ఏదైనా వస్తువులు లేదా సేవలు పొంది ఉంటే ఆయా వ్యక్తుల వివరాలు కూడా కాంట్రాక్ట్ వారీగా నమోదు చేయాలి.

పైన తెలిపిన రికార్డులు అన్నీ కూడా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో ఉన్న 'ప్రిన్సిపల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్'లో అందుబాటులో ఉంచడంతో పాటుగా అదనపు వ్యాపార స్థలాల్లో (అడిషినల్ ప్లేస్ ఆఫ్ బిజినెస్) సంబంధిత వివరాలు లభ్యమయ్యేలా ఉంచాలి. అయితే రికార్డులు అన్నీ భౌతిక రూపంలో కాకుండా ఎలక్ట్రానిక్ రూపంలో కూడా నిర్వహించవచ్చు.

అన్నిటి కంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ రికార్డులు 6 సంవత్సరాల పాటు కచ్చితంగా ఉంచాలి. మరి ఈ ఆరు సంవత్సరాల గడువు ఎప్పటి నుంచి లెక్కించాలి అంటే ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక (యాన్యువల్) రిటర్న్ నమోదు చేయటానికి ఇచ్చిన గడువు తేదీ నుంచి లెక్కించాలి. ఉదాహరణకు, ప్రస్తుత నిబంధన ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రిటర్న్ దాఖలు చేయటానికి గడువు తేదీ 2024 డిసెంబరు 31. అంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రికార్డులు కనీసం 2030 డిసెంబరు 31 వరకు కచ్చితంగా ఉంచాలి. అంతేకాకుండా, ఏదేనీ విచారణ ఎదుర్కొంటున్నా లేదా అప్పీల్ లేదా కోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉన్నా, విచారణ పూర్తయిన అనంతరం లేదా కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కనీసం ఒక సంవత్సరం పాటు ఉంచాలి. ఒకవేళ విచారణ ఆరేళ్ల కంటే ముందే అయిపోయినా.. పైన చెప్పినట్లు కనీసం ఆరు సంవత్సరాల పాటు ఆయా రికార్డులు ఉంచాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,600 ▼	71,100 ▼	1,00,000 ▼
ముంబై	76,187 ▼	69,787 ▼	90,820 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	82
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	93	అనంతపురం	82
గోదావరి	99		


స్పోర్ట్స్

అప్పగించినట్టేనా?

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 337 | **భారత్ రెండో ఇన్నింగ్స్ 128/5**

ట్రావిస్ హెడ్ రికార్డు శతకం

పింక్ బాల్ టెస్టు



అడిలైడ్: గులాబీ టెస్టులో భారత్‌కు భంగపాటు తప్పేలా లేదు. రెండో రోజు కూడా బ్యాటింగ్‌లో తడ'బ్యాటు' కొనసాగింది. ట్రావిస్ హెడ్ (141 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్సర్లతో 140) మెరుపు సెంచరీతో కదం తొక్కిన చోట.. భారత బ్యాటర్లలో ఒక్కరు కూడా కనీసం 40 బంతులైనా ఎదుర్కోలేకపోయారు. దీంతో ఫ్లడ్ లైట్ల వెలుతురులో బౌలింగే కాదు.. బ్యాటింగ్ కూడా తమకు చేతకాదని నిరూపించారు. అండగా నిలవాల్సిన సీనియర్లు కెప్టెన్ రోహిత్ (6), విరాట్ (11) ఈసారీ స్వల్ప స్కోర్లకే వెనుదిరగడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. గిల్ (28), జైస్వాల్ (24) ఓ మాదిరి స్కోరుకే పరిమితమయ్యారు. ఫలితంగా శనివారం ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 128 పరుగులు చేసింది. ఆసీస్ 151 పరుగుల ఆధిక్యానికి ఇంకా 29 పరుగులు వెనుకబడి ఉంది. రిషభ్ పంత్ (28 బ్యాటింగ్), నితీశ్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కమిన్స్, బోలాండ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 337 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (64) అర్ధసెంచరీ సాధించాడు. పేసర్లు బుమ్రా, సిరాజ్ నాలుగేసి వికెట్లతో చెలరేగడంతో చివరి వికెట్లు వేగంగా నేలకూలాయి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు మూడో రోజు పంత్, నితీశ్ ఎంతసేపు ఆసీస్ బౌలర్లను ఎదుర్కొంటారనేది చూడాలి. ఏదేమైనా పింక్ బాల్ టెస్టులో ఆసీస్ తిరుగులేని ఆధిక్యంలో కొనసాగుతోంది. భారత్ ఈ టెస్టులో గెలవాలంటే అద్భుతాలు జరగాల్సిందే.



హెడ్ (140)

హెడ్ విధ్వంసం: క్రీజులో కుదురుకుంటే ట్రావిస్ హెడ్ ఎంతటి ప్రమాదకర బ్యాటరో క్రికెట్ అభిమానులకు తెలియంది కాదు. గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌తో పాటు ఐపీఎల్‌లో అతడు విధ్వంసకర ఆటతీరుతో విరుచుకుపడ్డాడు. ఈసారి కూడా అతను ఎదురుదాడికి దిగి ఆసీస్‌కు కీలక ఆధిక్యాన్ని అందించాడు. రెండో రోజు ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య క్రీజులోకి వచ్చిన లోకల్ బాయ్ హెడ్ వారినేమాత్రం నిరాశపర్చలేదు. భారత బౌలర్లను అలవోకగా ఆడేస్తూ పరుగులు రాబట్టాడు. అయితే షార్ట్ బంతులను ఆడడంలో ఇబ్బంది ఎదుర్కొనే హెడ్‌కు ఆ తరహా బంతులు వేయడంలో మాత్రం భారత బౌలర్లు విఫలమయ్యారు. ఇక శనివారం తొలి సెషన్ ఆరంభంలోనే ఓపెనర్ మెక్‌స్వీనే (39), స్మిత్ (2) వికెట్లను బుమ్రా తీశాడు. అటు ఫామ్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న లబుషేన్ మాత్రం తన స్థాయికి తగ్గ ఆటను కనబర్చాడు. ఓపికను కనబరుస్తూనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత హర్షిత్ ఓవర్‌లో మూడు ఫోర్లతో చెలరేగాడు. అయితే హెడ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 65 పరుగులు జత చేశాక నితీశ్ ఓవర్‌లో లబుషేన్ వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో హెడ్ ఆటతీరులో వేగం పెరిగింది. మార్ష్ (9) అవుటయ్యాక బ్యాట్ ఝుళిపించాడు. హెడ్ 76 రన్స్ వద్ద ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ వదిలేశాడు. దీంతో హర్షిత్‌ను లక్ష్యంగా చేసుకుని వరుస బౌండరీలతో రన్స్ రాబట్టిన హెడ్.. 111 బంతుల్లోనే శతకం అందుకున్నాడు. క్యారీ (15)తో కలిసి ఆరో వికెట్‌కు 74 రన్స్ జోడించాడు. అయితే తన ఓవర్‌లో 4,6తో ఊపు కనబర్చిన హెడ్‌ను సిరాజ్ సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. ఆఖరి సెషన్ ఆరంభమైన 2.3 ఓవర్లలోనే మిగతా 2 వికెట్లను సిరాజ్ తీయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

2 గులాబీ టెస్టుల్లో అత్యధిక సెంచరీలు (3) నమోదు చేసిన రెండో బ్యాటర్‌గా హెడ్. లబుషేన్ (4) టాప్‌లో ఉన్నాడు.

పేలవంగా..: రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్లు నిరాశపరుస్తున్నారు. ఆసీస్ పేసర్ల కట్టుదిట్టమైన బంతులకు పరుగుల సంగతేమో కానీ వికెట్లు కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఓపెనర్లు ఈసారీ శుభారంభం అందించలేదు. తొలి టెస్టులో ఆకట్టుకున్న రాహుల్ (7), జైస్వాల్‌తో పాటు మిగతా బ్యాటర్లు కూడా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో విఫలమయ్యారు. కమిన్స్ ధాటికి ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లోనే రాహుల్ వెనుదిరగగా, జైస్వాల్‌ను తొమ్మిదో ఓవర్‌లో బోలాండ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత బోలాండ్ లెంగ్త్ బాల్‌ను డిఫెన్స్ ఆడాలని చూసిన విరాట్ (11) కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీనికి తోడు స్టార్క్ ఇన్‌స్వింగర్‌కు గిల్ క్లీన్‌బౌల్డ్ కావడంతో జట్టు 86/4 స్కోరుతో కష్టాల్లో పడింది. అలాగే రోహిత్‌ను సైతం కమిన్స్ అద్భుత బంతితో బౌల్డ్ చేసి పెవిలియన్‌కు చేర్చాడు. పంత్ మాత్రం తన సహజశైలిలో బౌండరీలు సాధిస్తూ.. నితీశ్‌తో కలిసి రోజును ముగించాడు.

1 డే/నైట్ టెస్టుల్లో వేగవంతమైన (111 బంతుల్లో) సెంచరీ సాధించిన బ్యాటర్‌గా హెడ్. తర్వాతి రెండు స్థానాలు (112, 125 బంతుల్లో) కూడా అతడివే కావడం విశేషం.



రోహిత్ (6)

2 డే/నైట్ టెస్టుల్లో ఒకే రోజు ఎక్కువ పరుగులు (379) నమోదు కావడం ఇది రెండోసారి. 2019లో ఇదే వేదికపై ఆసీస్-పాక్ మ్యాచ్‌లో 383 పరుగులు వచ్చాయి.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 180

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) రోహిత్ (బి) బుమ్రా 13; మెక్‌స్వీనే (సి) పంత్ (బి) బుమ్రా 39; లబుషేన్ (సి) జైస్వాల్ (బి) నితీశ్ 64; స్మిత్ (సి) పంత్ (బి) బుమ్రా 2; హెడ్ (బి) సిరాజ్ 140; మార్ష్ (సి) పంత్ (బి) అశ్విన్ 9; క్యారీ (సి) పంత్ (బి) సిరాజ్ 15; కమిన్స్ (బి) బుమ్రా 12; స్టార్క్ (సి) హర్షిత్ (బి) సిరాజ్ 18; లియాన్ (నాటౌట్) 4; బోలాండ్ (బి) సిరాజ్ 0; **ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 87.3 ఓవర్లలో 337 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-24, 2-91, 3-103, 4-168, 5-208, 6-282, 7-310, 8-332, 9-332, 10-337. **బౌలింగ్:** బుమ్రా 23-5-61-4; సిరాజ్ 24.3-5-98-4; హర్షిత్ రాణా 16-2-86-0; నితీశ్ 6-2-25-1; అశ్విన్ 18-4-53-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) బోలాండ్ 24; రాహుల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; గిల్ (బి) స్టార్క్ 28; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 11; పంత్ (బ్యాటింగ్) 28; రోహిత్ (బి) కమిన్స్ 6; నితీశ్ (బ్యాటింగ్) 15; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 24 ఓవర్లలో 128/5. వికెట్ల పతనం:** 1-12, 2-42, 3-66, 4-86, 5-105. **బౌలింగ్:** స్టార్క్ 9-0-49-1; కమిన్స్ 8-0-33-2; బోలాండ్ 7-0-39-2.

సిరాజ్ × హెడ్



రెండోరోజు ఆటలో హెడ్, సిరాజ్ మధ్య మాటల యుద్ధంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. భారత బౌలర్లను చెడుగుడు ఆడేస్తూ హెడ్ సెంచరీతో పాటు ఆసీస్ ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందించాడు. అత్యంత ప్రమాదకరంగా మారిన అతడిని చివరకు సిరాజ్ సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. అంతకుముందు హెడ్ మొదటి, మూడో బంతులను 4,6 బాదడంతో సిరాజ్ తీవ్ర అసహనంతో ఉన్నాడు. తర్వాతి బంతికే హెడ్ వికెట్ దక్కడంతో అతడివైపు సిరాజ్ ఉరిమి చూస్తూ 'వెళ్లిపో' అన్నట్టు సైగ చేశాడు. అటు హెడ్ బదులిస్తూ నోటికి పనిచెప్పాడు. అయినా తగ్గకుండా సిరాజ్ ఎహె.. పో అన్నట్టుగా మరోసారి పెవిలియన్‌వైపు చేయి చూపించాడు. కానీ హెడ్ స్థానిక క్రికెటర్ కావడంతో భారీస్థాయిలో హాజరైన అడిలైడ్ ప్రేక్షకులు మాత్రం సిరాజ్‌ను పదేపదే గేలి చేయడం కనిపించింది. మ్యాచ్ ముగిశాక హెడ్ ఈ ఘటనపై స్పందించాడు. సిరాజ్‌ను చక్కగా బౌలింగ్ చేశావని కొనియాడినా, అతడే తప్పుగా అర్థం చేసుకున్నాడని చెప్పుకొచ్చాడు.

మహిళల రెండో వన్డే నేడు

ఆస్ట్రేలియా × భారత్

ఉ. 5.15 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

అండర్-19 ఆసియా కప్ ఫైనల్ నేడు — **భారత్ × బంగ్లాదేశ్** ఉ.10.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఇంగ్లండ్ ఆధిక్యం 533

- రెండో ఇన్నింగ్స్ 378/5
- కివీస్ తొలి ఇన్నింగ్స్ 125

వెల్లింగ్టన్: ఆతిథ్య న్యూజిలాండ్‌తో రెండో టెస్టుపై ఇంగ్లండ్ పూర్తిగా పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్‌ను 125 పరుగులకే కుప్పకూల్చిన పర్యాటక జట్టు.. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజైన శనివారం ఆట ముగిసేసరికి 5 వికెట్లకు 378 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా దూసుకెళుతోంది. ఓపెనర్ డకెట్ (92), జాకబ్ బెతెల్ (96) కొద్దిలో సెంచరీలు చేజార్చుకోగా.. జో రూట్ (73 నాటౌట్), బ్రూక్ (55) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. ఓవరాల్‌గా ఇంగ్లండ్ 533 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 280 స్కోరు చేసిన సంగతి తెలిసిందే. రూట్‌కు జతగా స్టోక్స్ (35 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. సౌతీ, హెన్రీ చెరో 2 వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 86/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్.. హ్యాట్రిక్ హీరో అట్కిన్సన్ (4/31), బ్రైడన్ కార్స్ (4/46) ధాటికి మరో 39 పరుగులు జోడించి ఆలౌటైంది. ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన 15వ బౌలర్‌గా అట్కిన్సన్ నిలిచాడు. ఇక, టెస్టుల్లో ఆ దేశం నుంచి హ్యాట్రిక్ నమోదవడం 2017 (మొయిన్ అలీ) తర్వాత ఇదే తొలిసారి. కాగా, ఓవరాల్‌గా 1082వ టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఇంగ్లండ్.. టెస్టు క్రికెట్ చరిత్రలో 5 లక్షలకు పైగా పరుగులు చేసిన తొలి జట్టుగా అరుదైన ఘనత సాధించింది.

బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శిగా దేవజిత్



న్యూఢిల్లీ: బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శిగా 55 ఏళ్ల దేవజిత్ సైకియా నియమితులయ్యాడు. అసోంకు చెందిన ఈ మాజీ ఫస్ట్ క్లాస్ క్రికెటర్ ప్రస్తుతం బీసీసీఐలో సంయుక్త కార్యదర్శిగా ఉన్నాడు. ఈ మేరకు అతని నియామకాన్ని ఖరారు చేస్తున్నట్టు బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రకటించాడు. ఇప్పటిదాకా బోర్డు కార్యదర్శిగా ఉన్న జై షా ఇటీవలే ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. కాగా, వచ్చే ఏడాది సెప్టెంబరులో బీసీసీఐ కార్యవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి.

మళ్లీ అదే ఫలితం

- లిరెన్‌తో గుకేష్ పదోగేమ్ డ్రా



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డ్రాల పర్వం కొనసాగుతోంది. వరుసగా ఏడో గేమ్‌లోనూ ఫలితం తేలలేదు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, భారత స్టార్ గుకేష్ మధ్య శనివారం జరిగిన పదో రౌండ్ డ్రాగా ముగిసింది. నల్లపావులతో ఆడిన గుకేష్ 36వ ఎత్తు వద్ద డ్రాకు అంగీకరించాడు. టోర్నీలో ఇది ఎనిమిదో డ్రా. లిరెన్ ఆరంభ రౌండ్లో గెలవగా.. మూడో రౌండ్‌ను గుకేష్ నెగ్గాడు. మరో 4 గేమ్‌లు మిగిలున్న టోర్నీలో ప్రస్తుతం ఇద్దరు చెరో 5 పాయింట్లతో సమంగా నిలిచారు. ముందుగా 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలవనున్నాడు. మొత్తం రౌండ్లు ముగిసేసరికి ఇద్దరూ 7 పాయింట్లతో సమంగా నిలిస్తే.. టైబ్రేకర్ ద్వారా చాంపియన్‌ను నిర్ణయిస్తారు.

దక్షిణాఫ్రికాదే పైచేయి

గెబెహా: శ్రీలంకతో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 221 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. మూడో రోజు శనివారం ఆట ముగిసేసరికి ఈ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 191/3 స్కోరు చేసింది. అంతకుముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో 328 రన్స్‌కు ఆలౌటైంది. పేసర్ జాన్సెన్ ఐదు వికెట్లతో చెలరేగాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 358 రన్స్ చేసింది.

15న డబ్ల్యూపీఎల్ వేలం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలం ఈనెల 15న బెంగళూరులో జరగనుంది. 19 స్థానాల కోసం జరిగే ఈ లీగ్ వేలంలో మొత్తం 120 మంది క్రికెటర్లు పాల్గొనున్నారు. వీరిలో 91 మంది భారతీయులు కాగా, 29 మంది విదేశీ క్రికెటర్లు. ఇక, తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు క్రికెటర్లు వేలం బరిలో నిలిచారు.

టైటాన్స్ గెలుపు బాట

పుణె: ప్రో కబడ్డీ లీగ్‌లో రెండు వరుస ఓటముల తర్వాత తెలుగు టైటాన్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో టైటాన్స్ 34-32తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. రైడర్లు విజయ్ (11 పాయింట్లు), ఆశీష్ (9) టైటాన్స్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 36-33తో పుణెరి పల్టన్‌పై నెగ్గింది.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 8-12-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

బ్యాంకుకూ బురిడీ!


విక్రాంత్ రెడ్డి

కాకినాడ పోర్టులో బలవంతపు దందా

- ఎన్‌వోసీ ఇచ్చేందుకు యాక్సిస్ బ్యాంకు 'నో'
- బాకీ కట్టకుండా వాటాల బదిలీ కుదరదని స్పష్టం చేసిన బ్యాంకు
- అయినా పట్టించుకోని విక్రాంత్ రెడ్డి
- బలవంతంగా కేవీ రావుతో సంతకాలు
- దీనిపై అప్పట్లోనే బ్యాంకు తీవ్ర స్పందన
- నిబంధనలు ఉల్లంఘించారని ఆగ్రహం
- 2021 ఏప్రిల్ 25న కేవీరావుకు ఘాటు లేఖ
- బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేందుకు నిరాకరణ
- పోర్టులో సీఐడీ బృందం విస్తృత తనిఖీలు
- పెన్ డ్రైవ్‌లో కీలక సమాచారం
- పదుల సంఖ్యలో కీలక ఫైళ్లు స్వాధీనం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

వాటాల కోసం అసలు యజమానిని బెదిరించి, భయపెట్టడమే కాదు... బ్యాంకునూ బురిడీ కొట్టించారు. నిబంధనలను అతిక్రమించి మరీ కాకినాడ సీపోర్టులో 41 శాతం వాటాను కొట్టేశారు. 'మాఫియా మోడల్'లో బయటపడిన కొత్త కోణమిది! విజిలెన్స్, మారిటైం బోర్డులను ఉసిగొల్పి... సంతానం ఆడిట్ కంపెనీతో తప్పుడు నివేదిక ఇప్పించి... ప్రభుత్వానికి రూ.994కోట్లు ఎగవేశారంటూ కాకినాడ సీపోర్టు యజమాని కేవీరావును బెదిరించి 41శాతం వాటాను కారుచౌకగా కొట్టేసిన వైనంపై ఇప్పటికే సీఐడీ కేసు నమోదు చేసింది. అప్పట్లో కేవీరావును అమెరికా నుంచి రప్పించి మరీ సంతకాలు చేయించుకున్నారు. ఈ క్రమంలో... వారికి యాక్సిస్ బ్యాంకు నుంచి కొన్ని చిక్కులు ఎదురయ్యాయి. వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఆ బ్యాంకును సైతం బురిడీ కొట్టించి... 'డీల్' ముగించినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... కాకినాడ సీపోర్టు వర్కింగ్ క్యాపిటల్ కోసం హైదరాబాద్‌లోని యాక్సిస్ బ్యాంకు నుంచి రుణం

మిగతా 2వ పేజీలో...

'రేషన్'లో భారీ కుంభకోణం



- కాకినాడ పోర్టు నుంచి మూడేళ్లలో 13.10 లక్షల క్వింటాళ్ల బియ్యం అక్రమ రవాణా
- పీడీఎస్ బియ్యం తరలింపు నిందితులపై పీడీ చట్టం
- నౌకను సీజ్ చేయడంలో సాంకేతిక సమస్యలు లేవు
- రాష్ట్రవ్యాప్తంగా 11.42 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- రూ.2,800 కోట్ల బిల్లుల చెల్లింపు: మంత్రి మనోహర్

12


బాపట్ల మునిసిపల్ స్కూల్‌లోని తరగతి గదిలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి లోకేశ్, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, విద్యా శాఖ అధికారులు


కడప మునిసిపల్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

చక్కదిద్దుతున్నాం

చిక్కీల డబ్బులూ గత ప్రభుత్వం ఎగ్గొట్టింది

- వారసత్వంగా అప్పులు, సమస్యలు వచ్చాయి
- అన్నింటినీ సరిచేసే పనిలోనే ఉన్నా
- పీటీఎం వంటి కార్యక్రమాలు చరిత్రాత్మకం
- విద్యావ్యవస్థలో పెనుమార్పులకు అవకాశం
- పాపులేషన్ మేనేజ్‌మెంట్ జరగాలి
- వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు
- బాపట్లలో మెగా 'పేరెంట్, టీచర్స్ మీట్'లో సీఎం చంద్రబాబు
- ఒకే రోజు 44,303 స్కూళ్లలో 1.20 కోట్ల మందితో నిర్వహణ

"గతంలోకి వెళ్లాలని లేదు. కానీ వారసత్వంగా గుంతల రోడ్లు, చెత్తతో నిండిన పట్టణాలు, 10 లక్షల కోట్ల అప్పు కూటమి ప్రభుత్వానికి వచ్చాయి. అన్నింటినీ సరిచేసే పనిలోనే ఉన్నా. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, విద్యార్థులకు యూనిఫాం కుట్టిన డబ్బులు, చివరికి చిక్కీల డబ్బులు కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టి వెళ్లింది. స్కూళ్ల విలీనం పేరుతో తీసుకున్న అడ్డగోలు నిర్ణయాల వల్ల దాదాపు నాలుగు లక్షల మంది పిల్లలు డ్రాపౌట్లుగా మిగిలారు."
- సీఎం చంద్రబాబు


బాపట్ల మునిసిపల్ స్కూల్‌లో టగ్ ఆఫ్ వార్ పోటీలో తాడు లాగుతున్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, తదితరులు

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'మెగా పేరెంట్-టీచర్స్ మీట్ (పీటీఎం) చరిత్రాత్మక కార్యక్రమం. ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమం ఇచ్చే ఊతంతో రాబోయే రోజుల్లో విద్యావ్యవస్థలో పెనుమార్పులు రాబోతున్నాయని

మిగతా 11వ పేజీలో...

ఈ శతాబ్దం విద్యార్థులదే

- విలువలతో కూడిన విద్యను అభ్యసించండి
- తల్లిదండ్రులు, టీచర్లు, సైనికులే నిజమైన హీరోలు
- రాష్ట్రంలో ఈ స్థాయిలో డ్రగ్స్ ఉండటం దారుణం
- ప్రతి స్కూల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- కడప పీటీఎంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

11

విద్యావ్యవస్థ ప్రక్షాళన

- ప్రభుత్వ బడుల్లో స్టాన్‌ఫర్డ్ ప్రమాణాలు
- బలమైన బంధం వేసిన పీటీఎం: లోకేశ్

'రీసర్వే' లోపాల పుట్ట!

పైలట్ గ్రామం తక్కెళ్లపాడులోనే ఎన్నో తప్పులు

- దేవదాయ శాఖ జాబితాలోకి ప్రైవేటు భూములు
- సర్వే నంబర్లలో భూములన్నీ నిషేధ జాబితాలోకి
- ఫిర్యాదులు బుట్టదాఖలు చేసిన నాటి అధికారులు
- అంతా అద్భుతమంటూ రూ.5 కోట్లతో జగన్ సభ
- నేడు అదే గ్రామంలో భూ సమస్యలపై అలజడి
- రెవెన్యూ సదస్సులో వెల్లువెత్తిన ఫిర్యాదులు


తక్కెళ్లపాడులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో సిసోడియాకు వినతిపత్రం అందిస్తున్న ఇనాం భూ బాధితులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన భూముల రీసర్వే లోపాల పుట్టని తేలిపోయింది. ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఉమ్మడి కృష్ణా జిల్లా తక్కెళ్లపాడులోనే లెక్కలేనన్ని తప్పులు దొర్లాయి. నిండా 1,600 ఎకరాల భూములు కూడా లేని ఈ గ్రామంలో రీసర్వే పేరిట అనుభవం లేని సర్వేయర్లు నేలవిడిచి సాము చేశారు. సర్వే మొత్తం తప్పులతడకని రైతులు గగ్గోలుపెట్టినా బయటికు రాకుండా నాటి అధికారులు తొక్కిపెట్టారు. తర్వాత రూ.5కోట్ల వ్యయంతో గ్రామంలో

మిగతా 12వ పేజీలో...

తగ్గిన భూమి

బ్రిటిషర్ల పాలనలో 1932లో సర్వే చేసినప్పుడు తక్కెళ్లపాడులో భూముల విస్తీర్ణం 1,539 ఎకరాలు. పైలట్‌లో రీసర్వే చేసినప్పుడు తేలిన విస్తీర్ణం 1,533.56 ఎకరాలు. ఇక్కడ మొత్తం 150 సర్వే నంబర్లు ఉంటే, రీసర్వే తర్వాత వాటిని 631కి పెంచారు. అంతకుముందు గ్రామంలో ప్రభుత్వ భూమి 272.52 ఎకరాలు ఉండగా, సర్వే తర్వాత 272.23 ఎకరాలుగా తేల్చారు. అంటే, ఉన్నదాని కంటే కొంత తగ్గింది.

ఇండియా కూటమి సారథ్యానికి సై



- బెంగాల్ నుంచే నడిపిస్తా
- ప్రతిపక్షాల కూటమిని పెట్టింది నేనే: మమత
- మమతకు జైకొట్టిన ఎస్పీ, ఉద్ధవ్ శివసేన
- కాంగ్రెస్ ప్రదర్శనకు టీఎంసీ, ఎస్పీ దుమ్మా
- కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి: సీపీఐ
- మమత సమర్థతను ప్రశ్నించిన కాంగ్రెస్

2





బీజేపీ చీఫ్‌గా ఖట్టర్ లేదా చౌహాన్!

2

- రేసులో రాంమాధవ్ కూడా..
- తెలుగు రాష్ట్రాల్లోనూ నాయకత్వ మార్పులు!

అత్యవసరమైతే ట్యాపింగ్!

- ఐజీ లేదా ఆపై స్థాయి అధికారి మాత్రమే ఆదేశాలు జారీ చేయాలి
- ఉన్నతస్థాయి కమిటీ సమీక్షించాలి.. తాజా నిబంధనలతో కేంద్ర టెలి కమ్యూనికేషన్ల శాఖ నోటిఫికేషన్ విడుదల

2

భారత్‌ను అస్థిరపరిచే కుట్ర

2

- జర్నలిస్టులు, రాహుల్‌తో కలిసి అమెరికా విదేశాంగశాఖ కుతంత్రం
- అగ్రరాజ్యంపై బీజేపీ విమర్శలు
- ఈ వ్యాఖ్యలు సరికాదు: అమెరికా



భారత్‌పై కుట్ర

న్యూఢిల్లీ, డిసెంబరు 7: అమెరికా విదేశాంగ శాఖపై బీజేపీ నిప్పులు చెరిగింది. భారతదేశాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని విమర్శలు గుప్పించింది. పరిశోధనాత్మక జర్నలిస్టులు సహా భారత విపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ఈ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించింది. ఈ విమర్శలు రాజకీయంగా పెను సంచలనానికి దారి తీశాయి. అమెరికా-భారత్‌ల మధ్య రెండు దశాబ్దాలుగా సుహృద్భావ సంబంధాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతం అదానీ కేంద్రంగా అమెరికా దర్యాప్తు సంస్థ చేసిన ఆరోపణలు.. ప్రస్తుతం బీజేపీ చేసిన వ్యాఖ్యలు అందరినీ విస్మయానికి గురి చేశాయి. ఆర్గనైజ్డ్ క్రైం, కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) కథనాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ అదానీ గ్రూపుపై ఏకపక్షంగా విమర్శలు చేస్తోందని బీజేపీ దుయ్యబట్టింది. మోదీ ప్రభుత్వాన్ని అణిచివేయాలని భావిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేసింది. అదానీ గ్రూపుపై ఎఫ్‌బీఐ చేసిన లంచాల ఆరోపణలను బీజేపీ నిరాధారమైనవని కొట్టిపారేసింది. అదేవిధంగా ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్ ద్వారా భారత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారిని.. ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లు దుయ్యబడుతున్నారన్న ఓసీసీఆర్‌పీ కథనాలను కూడా ఖండించింది. తాజాగా ఓసీసీఆర్‌పీ, 92ఏళ్ల జార్జ్ సొరోస్‌లపై స్పందిస్తూ.. వీరికి అమెరికానే నేరుగా 50 శాతం నిధులు సమకూరుస్తోందని, ఈ విషయాన్ని ఫ్రెంచ్ మీడియా పేర్కొందని బీజేపీ తెలిపింది. 'ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని భారత్‌ను అస్థిరపరిచేందుకు 'డీప్ స్టేట్' లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. "ఈ మొత్తం వ్యవహారం వెనుక.. అమెరికా విదేశాంగ శాఖ అజెండా స్పష్టంగా కనిపిస్తోంది" అని బీజేపీ ఎక్స్‌లో పేర్కొంది. కాగా, బీజేపీ వ్యాఖ్యలపై అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పందించారు. వృత్తిపరమైన అభివృద్ధి కోసం జర్నలిస్టులకు అమెరికా ప్రభుత్వం మద్దతిస్తుందని పేర్కొన్నారు. దీనర్థం.. ఆయా పత్రికల ఎడిటోరియల్ నిర్ణయాలను ప్రభావితం చేయడం కాదని తెలిపారు "భారత అధికార పార్టీ(బీజేపీ) ఇలాంటి ఆరోపణలు చేయడం మమ్మల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది" అని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛకు పెద్దపీట వేస్తున్న దేశం తమదేనని తెలిపారు.

పొట్టలో తూటా దిగినా.. 15 మందిని కాపాడాలనే తపనతో..

జీప్‌ను బైక్‌పై వెంబడించి ప్రయాణికులపై కాల్పులు

» బిహార్‌లో ఘటన.. శస్త్రచికిత్స చేసి తూటా తొలగింపు.. తప్పిన ప్రాణాపాయం

పట్నా, డిసెంబరు 7: ఆ డ్రైవర్ ప్రదర్శించిన గొప్ప సాహసం, ధైర్యం.. 15 మంది ప్రాణాలను కాపాడాలనే తపనతో చూపిన పరిణతిని ఎంత పొగిడినా తక్కువే! ఇద్దరు దుండగులు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడంతో ఓ తూటా డ్రైవర్ పొట్టలోకి దూసుకెళ్లింది. రక్తం కారుతున్నా.. బాధను పంటిబిగువున భరిస్తూ.. వాహనం స్పీడును మరింత పెంచాడు! దుండగుల బారి నుంచి ప్రయాణికులను కాపాడాడు. బిహార్‌లోని భోజ్‌పూర్‌లో జిల్లాలో బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన జరిగింది. 'తిలకం' వేడుకలో పాల్గొన్న 15మందిని తన జీప్‌లో ఎక్కించుకొని బయలుదేరాడు డ్రైవర్ సంతోష్‌సింగ్. ఆ జీప్‌ను గుర్తు తెలియని ఇద్దరు సాయుధులు బైక్‌పై వెంబడించి కాల్పులు జరిపారు. డ్రైవర్ సింగ్, జీప్ స్పీడును పెంచాడు. ఈ క్రమంలో ఓ తూటా సింగ్ పొట్టలోకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాన్ని లెక్కచేయకుండా జీప్‌ను కొన్ని కిలోమీటర్ల మేర ముందుకు దూకించి సురక్షిత ప్రదేశంలో ఆపాడు. తీవ్ర గాయాలతో డ్రైవింగ్ సీట్లోనే ఒరిగిపోయిన సింగ్‌ను ఆస్పత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేసిన వైద్యులు బాధితుడి కడుపులోంచి తూటాను బయటకు తీశారు. అతడికి ప్రాణాపాయం లేదని, పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.

లోకం తీరు



ఎమర్జెన్సీలో ఫోన్ ట్యాపింగ్!

» ఐజీ లేదా ఆపై స్థాయి అధికారి మాత్రమే అధికారం: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 7: అత్యవసర పరిస్థితుల్లో ఐజీ లేదా ఆ పైస్థాయి పోలీసు అధికారి ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీ చేయవచ్చని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఫోన్ ట్యాపింగ్ తాజా నిబంధనలను జారీ చేస్తూ కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ శుక్రవారం ఓ నోటిఫికేషన్‌ను వెలువరించింది. ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీ చేసిన అధికారి ఏడు పని దినాల్లో సదరు ఆదేశాలు నిజమైనవేనని నిర్ధారించకపోతే.. ట్యాపింగ్ ద్వారా సేకరించిన వివరాలను దేనికీ ఉపయోగించవద్దని ఈ నిబంధనల్లో పేర్కొన్నారు. రెండు పనిదినాల్లో ఆ వివరాల తాలూకు పత్రాలను ధ్వంసం చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా మారుమూల ప్రాంతంలో ఫోన్ ట్యాపింగ్ కోసం ఆదేశాలు జారీ చేయటానికి సంబంధిత అధికారికి సాధ్యం కాకపోతే, ఆ అధికారి తర్వాత స్థానంలో ఉన్న అధికారి (ఐజీ ర్యాంకుకు తగ్గని వారు) ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపారు. సదరు అధికారి కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవారై ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ట్యాపింగ్ ఆదేశాలను కేంద్రస్థాయిలోనైతే క్యాబినెట్ కార్యదర్శి, న్యాయ శాఖ, టెలికాం శాఖల కార్యదర్శులతో కూడిన కమిటీ సమీక్షించాల్సి ఉంటుందని.. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ కార్యదర్శి, న్యాయ, హోంశాఖల కార్యదర్శులతో కూడిన కమిటీ సమీక్షించాలని కేంద్రం స్పష్టం చేసింది.

ప్రధాని మోదీని చంపేస్తామని బెదిరింపులు

ముంబై, డిసెంబరు 7: ప్రధాని మోదీని హత్య చేస్తానంటూ గుర్తుతెలియని దుండగుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. బాంబు పేలుడు ద్వారా మోదీని చంపేందుకు ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాడు. ఈ మేరకు శనివారం ముంబై ట్రాఫిక్ పోలీసులకు బెదిరింపు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వాట్సాప్ నంబరు ఆధారంగా రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి బెదిరింపులు వచ్చినట్లు గుర్తించామని, ఓ ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపామని తెలిపారు. అయితే నిందితుడి మానసిక పరిస్థితి నిలకడగా లేకపోవడమో లేదా మద్యం తాగిన మత్తులో ఈ పని చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.50లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామంటూ కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్‌ను అజ్ఞాత వ్యక్తి ఫోన్‌లో బెదిరింపు సందేశం పంపించాడు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ నేత ప్రేమ్‌శంకర్‌కు, ఆయన తండ్రి గోపీనాథ్‌కు ఇలాగే రూ.50 లక్షలు డిమాండ్ చేస్తూ బెదిరింపు సందేశం పంపిన కేసులో రాజ్‌కుమార్ సింగ్ అనే వ్యక్తిపై గతనెలలో యూపీ పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరియాకు వెళ్లొద్దని ప్రజలకు కేంద్ర సూచన

న్యూఢిల్లీ, డిసెంబరు 7: సిరియాలో ఇస్లామిక్ రెబెల్స్ దాడులు కొనసాగుతున్నందున ఆ దేశానికి వెళ్లొద్దని విదేశీ వ్యవహారాల శాఖ ప్రజలకు సూచన జారీ చేసింది. అలాగే ఆ దేశంలో ఉంటున్న భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సాధ్యమైనంత త్వరగా ఆ దేశం నుంచి బయటపడాలని సలహా ఇచ్చింది. డమాస్కస్‌లోని భారత ఎంబసీతో సంప్రదింపులు జరపాలని సూచించింది. సిరియాలోని అలెప్పొ నగరాన్ని చాలావరకు స్వాధీనం చేసుకున్న రెబెల్స్ గురువారం సిరియా మధ్యలో ఉన్న హోమ్స్ నగరాన్ని కూడా చేజిక్కించుకున్నారు. దీంతో వేలాదిమంది ప్రజలు ఆ నగరాన్ని వీడి పరారవుతున్నారు. కాగా, రెబల్స్ ఆ దేశంలోని దక్షిణ ప్రాంత నగరం దారాపైనా పట్టు సాధించారు. దీంతో వారంలో 4 నగరాలపై అధికార పక్షం పట్టు కోల్పోయినట్లయ్యింది.

శబరిమలలో వర్షం హెచ్చరికలు

శబరిమల, డిసెంబరు 7: శబరిమలలో మరోమారు భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం నుంచి మూడ్రోజులపాటు ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి ఓ మాదిరి వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ.. 11వ తేదీ నుంచి శబరిమల ఉన్న పథనంతిట్ట జిల్లాతోపాటు.. ఇడుక్కి జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. కాగా.. మండలపూజ సీజన్(అక్టోబరు 16 నుంచి) గురువారం వరకు అవరణ పాయస విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అరవణ ప్రసాద విక్రయాలతో రూ.60.54 కోట్ల మేర ఆదాయం సమకూరిందని, గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.18.34 కోట్ల మేర అధికంగా ఉందని వివరించింది.

భూములు స్వాధీన పరచాలని లాతూర్ రైతులకు వక్ఫ్ బోర్డు నోటీసులు

లాతూర్, డిసెంబరు 7: తాము తరతరాలుగా సాగు చేసుకుంటున్న సుమారు 300 ఎకరాల భూములను స్వాధీనం చేయాలని వక్ఫ్ బోర్డు ట్రైబ్యునల్ నోటీసులు పంపించినట్టు మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా రైతులు తెలిపారు. వాటిని వక్ఫ్ ఆస్తులుగా పేర్కొంటూ ఛత్రపతి శంభాజీ నగర్‌లోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రైబ్యునల్ నుంచి 103 మంది రైతులకు నోటీసులు అందాయి. అవి వక్ఫ్ ఆస్తులు కావని, తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్నవని రైతులు చెప్పారు. దీనిపై ఇప్పటికే ట్రైబ్యునల్‌లో రెండుసార్లు విచారణ జరిగిందని, ఈ నెల 20న మరోసారి విచారణ జరగనుందని తెలిపారు.

డిసెంబరు 21

ప్రపంచ ధ్యాన దినోత్సవం



తీర్మానానికి ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవ ఆమోదం

ఐక్యరాజ్యసమితి, డిసెంబరు 7: ప్రతి ఏటా డిసెంబరు 21వ తేదీని 'ప్రపంచ ధ్యాన దినోత్సవం'గా జరపాలని భారత్ సహా పలు దేశాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యూఎన్‌జీఏ) ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ విషయాన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "సమగ్ర శ్రేయస్సు, అంతర్గత పరివర్తన కోసం ఒక రోజు! డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరపాలని భారత్ సహా పలు ఇతర దేశాలు తీసుకొచ్చిన తీర్మానాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ ఈ రోజు(శుక్రవారం) ఆమోదించింది" అని పేర్కొన్నారు. వసుధైక కుటుంబం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే సూత్రాన్ని బలంగా విశ్వసించే భారత్.. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం కృషి చేస్తోందని అన్నారు. డిసెంబరు 21వ తేదీకి ఒక ప్రత్యేకత ఉందని, భారత సంప్రదాయం ప్రకారం శీతాకాలం అయనం అంటే ఉత్తరాయనంలోకి అడుగుపెట్టే రోజని, ఇది చాలా పవిత్రమైన రోజని తెలిపారు. ఇది సరిగ్గా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించే జూన్ 21వ తేదీ (వేసవి అయనం)కి ఆరు నెలల తర్వాత వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా యోగాపై గతంలో భారత్ చేసిన ప్రతిపాదనను హరీశ్ గుర్తుచేసుకున్నారు. 2014లోనూ ప్రతి ఏటా జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించే విషయంలో భారత్ నాయకత్వం తీసుకుందని పేర్కొన్నారు. ఈ దశాబ్ద కాలంలో యోగా విశ్వవ్యాప్తం అయిందని, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది యోగాను పాటిస్తూ, తమ జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారని అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవంపై లిచ్‌టెన్‌స్టీన్ అనే దేశం యూఎన్‌జీఏలో తీర్మానం తీసుకొచ్చింది. 193 దేశాలు గల యూఎన్‌జీఏలో ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందేందుకు కృషి చేసిన దేశాల గ్రూపులో భారత్ సహా శ్రీలంక, నేపాల్, మెక్సికో, అండోర్రా ఉన్నాయి. తీర్మానానికి ఇంకా బంగ్లాదేశ్, బల్గేరియా, బురుండి, ది డొమినికన్ రిపబ్లిక్, ఐస్‌లాండ్, లక్సెంబర్గ్, మారిషష్, మొనాకో, మంగోలియా, పోర్చుగల్, స్లోవేనియా కో-స్పాన్సర్ చేశాయి. కాగా, అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంపై ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. తీర్మానాన్ని ఆమోదింపచేయడంలో భారతదేశం కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. ప్రపంచంలోని పలు ప్రాంతాలు ఘర్షణలు, ఉద్రిక్తతలతో మండుతున్న వేళ ఈ నిర్ణయం రావడంపై ఆనందం వ్యక్తం చేసింది. ధ్యానం అనేది పురాతన పద్ధతుల నుంచే ఉందని, ఇది అంతర్గత పరివర్తన, నేటి ఆధునిక కాలంలో శాంతి స్థాపనకు సమర్థవంతంగా పనిచేస్తుందని అభిప్రాయపడింది. ధ్యానం మానసిక, భావోద్వేగ, శారీరక, ఆధ్యాత్మిక అంశాలతో సహా ప్రపంచ మానవాళి శ్రేయస్సుకు ఉద్దేశించిందని పేర్కొంది. ఇది నేటి ఉరుకుల పరుగుల, ఒత్తిడితో కూడిన జీవితంలో ఉపశమనం కలిగిస్తుందని తెలిపింది. దీనితో చాలా లాభాలు ఉన్నాయని, మన జీవితాలపై ప్రభావం చూపుతుందనే దాన్ని ఆధునిక శాస్త్రం కూడా ధ్రువీకరిస్తోందని పేర్కొంది. ప్రతి రోజూ ధ్యానం చేస్తే ఒత్తిడి తగ్గుతుందని, మానసిక, శారీరక సంబంధిత కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైందని భారత విషన్ పేర్కొంది.

న్యాయాన్ని అవహేళన చేసిన రామజన్మభూమి తీర్పు

» అయినా అందులోని 5 పేజీలు కీలకం

» సుప్రీం మాజీ జడ్జి నారిమన్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, డిసెంబరు 7: రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 'న్యాయానికి జరిగిన పెద్ద అవహేళన'లాంటిదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్ అభిప్రాయపడ్డారు. అది లౌకికవాదం అన్న సూత్రాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. అయితే ఈ తీర్పులోనూ కాంతిరేఖలాంటి ఓ మంచి అంశం ఉందని, అది ప్రార్థనా స్థలాల చట్టం-1991ని ఆమోదించడమని స్పష్టం చేశారు. జస్టిస్ ఏ.ఎం.అహ్మది స్మారక ప్రథమ ఉపన్యాసంలో 'లౌకికవాదం-భారత రాజ్యాంగం' అన్న అంశంపై ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. వేయి తలల జలసర్పం (హైడ్రా) మాదిరిగా దేశమంతటా తలలు ఎగరవేస్తున్న ప్రార్థనా మందిరాల వివాదాలకు ముగింపు పలకాలంటే ప్రార్థనా స్థలాల చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేయడమే మార్గమని చెప్పారు. "మసీదులపై, దర్గాలపై ఒక కేసు తరువాత మరో కేసు నమోదవుతూనే ఉంది. ఇది మత విద్వేషాలకు దారి తీస్తుంది. దీన్ని అడ్డుకోవాలంటే రామజన్మభూమి-బాబ్రీ మసీదు తీర్పులోని అయిదు పేజీలే కీలకం. అది ప్రార్థనా మందిరాల ప్రత్యేక నిబంధనల చట్టాన్ని ఆమోదించింది. దాన్ని ప్రతి జిల్లా కోర్టులోను, హైకోర్టులోనూ చదివి వినిపించాలి. ఎందుకంటే అవి సుప్రీంకోర్టు ఆదేశాలు. అందరూ కట్టుబడి ఉండాలి" అని పేర్కొన్నారు. మరోవైపు, ప్రార్థనా స్థలాల చట్టం రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ఆరు ప్రయోజన వ్యాజ్యాలపై ఈ నెల 12న సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ జరపనుంది. 1947 ఆగస్టు 15 నాటికి ఉన్న ప్రార్థనా మందిరాల స్వరూపాన్ని మార్చకూడదని ఈ చట్టం చెబుతోంది.

బంగ్లాలో మరో ఇస్కాన్ ఆలయం ధ్వంసం

» దేవతామూర్తుల విగ్రహాలకు నిప్పుపెట్టిన దుండగులు

ఢాకా/లఖ్‌నవూ, డిసెంబరు 7: బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇస్కాన్‌కు చెందిన మరో ఆలయాన్ని దుండగులు ధ్వంసం చేసి, నిప్పుపెట్టారు. ఈ ఘటనలో మందిరంలోని దేవతామూర్తుల విగ్రహాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ మేరకు కోల్‌కతా ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఢాకా జిల్లా ధౌర్ గ్రామంలో హరేకృష్ణ నామ్‌హట్టా సంఘానికి చెందిన రాధాకృష్ణ ఆలయం, మహా భాగ్య లక్ష్మీనారాయణ ఆలయాలకు తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య దుండగులు నిప్పు పెట్టారని పేర్కొన్నారు. భైరబ్ ప్రాంతంలోని ఇస్కాన్ ఆలయాన్ని ధ్వంసం చేసిన వారం రోజుల తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువుల దుస్థితిపై కాంగ్రెస్ పార్టీ మౌనంగా ఉందని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆరోపించారు. బాధితుల్లో ఎక్కువమంది దళితులు, బలహీన వర్గాలకు చెందినవారేనని తెలిపారు. శనివారం లఖ్‌నవూలో ఆమె విలేకరులతో మాట్లాడారు. విభజన సమయంలో కాంగ్రెస్ చేసిన తప్పిదం కారణంగా పొరుగు దేశంలో దళితులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని భారత్‌కు రప్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దాడుల అంశాన్ని ప్రధాన ప్రతిపక్షం పార్లమెంట్‌లో లేవనెత్తకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. సంభాల్ హింస సాకుతో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, వాటి మిత్ర పక్షాలు ముస్లిం ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

బీజేపీ చీఫ్‌గా ఖట్టర్ లేదా చౌహాన్!

» రేసులో రాంమాధవ్ కూడా..

» తెలుగు రాష్ట్రాల్లోనూ నాయకత్వ మార్పులు!

న్యూఢిల్లీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం సంస్థాగత మార్పులకు రంగం సిద్ధం చేసిందా? జేపీ నడ్డా స్థానంలో.. బీజేపీ చీఫ్‌గా మనోహర్‌ఖట్టర్ లేదా శివరాజ్ చౌహాన్ అధ్యక్ష పదవిని అధిరోహించనున్నారా? రేసులో రాంమాధవ్ కూడా ఉన్నారా? ఈ ప్రశ్నలకు పార్టీ వర్గాలు అవుననే చెబుతున్నాయి. వచ్చే నెలాఖరులోగా పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక, ఆఫీస్ బేరర్ల పునర్వ్యవస్థీకరణ పూర్తవనున్నట్లు వెల్లడిస్తున్నాయి. అంతేకాదు.. వచ్చేనెల మొదటి వారానికి రాష్ట్రాల వారీగా అధ్యక్షుల నియామకాలు పూర్తవుతాయని వివరిస్తున్నాయి. వచ్చే నెలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఖట్టర్ లేదా శివరాజ్‌ను నియమించే అవకాశాలున్నట్లు చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాంమాధవ్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. ఒకవేళ ఆయనకు చాన్స్ రాకుంటే.. బీఎల్ సంతోష్ స్థానంలో ఆయనను సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా అవకాశాలున్నట్లు చెబుతున్నారు. బీఎల్ సంతోష్ 2019 నుంచి ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఇక రాష్ట్రాల్లో నాయకత్వ మార్పుల్లో భాగంగా తెలుగు రాష్ట్రాలతోపాటు.. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర మధ్యప్రదేశ్, కేరళల్లో అధ్యక్షులు మారే అవకాశాలున్నాయి.

ముస్లింలతో మాట్లాడండి

» ఉద్రిక్తతలను నివారించండి..మోదీకి ఢిల్లీ జామా మసీదు ఇమామ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 7: 'దేశంలోని ముస్లింలతో మాట్లాడండి.. 1947లో కంటే అధ్వాన్న పరిస్థితుల్లో ఇప్పుడు మేమున్నాం. చొరవ తీసుకొని ఉద్రిక్తతలు తలెత్తకుండా చూడండి' అంటూ ప్రధాని మోదీని ఢిల్లీలోని జామా మసీదు షాహీ ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారీ కోరారు. శుక్రవారం ప్రార్థనల సమయంలో ముస్లిం యువత ఓపికగా ఉండాలని సూచించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని మసీదుల్లో సర్వేలపై మతపర ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో శనివారం జామా మసీదు వద్ద ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. '1947లో కంటే అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాం. దేశంలో ఎప్పుడేం జరుగుతుందో తెలియడం లేదు' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'మీరు కూర్చున్న కుర్చీకి న్యాయం చేయండి..ఉద్రిక్తతలు సృష్టించి దేశ వాతావరణాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్న దుర్మార్గులను ఆపండి' అని ఆయన మోదీని కోరారు.

కూటమి సారథ్యానికి సిద్ధమే..

» 'ఇండియా'ను బెంగాల్ నుంచే నడిపిస్తా

» ప్రతిపక్ష కూటమిని పెట్టింది నేనే: మమత



కోల్‌కతా, డిసెంబరు 7: అవకాశం ఇస్తే ఇండియా కూటమికి నేతృత్వం వహించడానికి తాను సిద్ధమేనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమత అన్నారు. హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి వరుస పరాజయాల నేపథ్యంలో మమత వ్యాఖ్య ఆ కూటమిలో అలజడి రేపుతోంది. బంగ్లాదేశ్‌కు చెందిన ఓ న్యూస్ చానల్‌కు శనివారం మమత ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇండియా కూటమి పనితీరు పట్ల ఆమె పెదవి విరిచారు. అటు ముఖ్యమంత్రి పదవినీ, ఇటు 'ఇండియా' పగ్గాలనూ సమన్వయం చేయగలనని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. "ఇండియా' కూటమిని నేనే ఏర్పాటుచేశాను. ఆ కూటమి బాగోగులు ఇప్పుడు దానిని నడిపిస్తున్నవారిని బట్టే ఉంటాయి" అంటూ కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా చురకలు వేశారు. 'కూటమి పగ్గాలను మీరు చేపడతారా' అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అవకాశం వస్తే తప్పకుండా ఆ బాధ్యతను తీసుకుంటానని ఆమె తెలిపారు. బెంగాల్ నుంచే కూటమిని నడిపిస్తానన్నారు.

కాంగ్రెస్ ప్రదర్శనకు టీఎంసీ, ఎస్పీ డుమ్మా

ఇండియా కూటమి, కాంగ్రెస్ తమ అహం పక్కనబెట్టి మమతాబెనర్జీ నాయకత్వాన్ని అంగీకరించాలని తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శుక్రవారం వ్యాఖ్యానించారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో మెరుగ్గా కనిపించిన కాంగ్రెస్ పార్టీ.. ఆ తర్వాత నుంచి మాత్రం తన రాజకీయ పట్టును కోల్పోతూ వస్తోంది. మరోవైపు.. బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీని తృణమూల్ మట్టి కరిపించింది. దీంతో 'ఇండియా'కు కాంగ్రెస్ సారథ్యంపై కూటమిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇండియా కూటమి సారథ్యం విషయంలో మమత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్టు సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ ప్రకటించారు. మమత 'ఇండియా' కూటమిలో ప్రధాన నాయకురాలిగా ఉండాలని కోరుకుంటున్నామని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) అగ్రనేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కోల్‌కతా వెళ్లి దీనిపై ఆమెతో చర్చిస్తామని ఆయన తెలిపారు. కాగా, మమత ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. జాతీయ నేతగా మమత సమర్థతను ప్రశ్నించింది. ఇదిలాఉండగా, అదానీ అవినీతిపై కాంగ్రెస్ నిర్వహించిన నిరసన ప్రదర్శనకు తృణమూల్, ఎస్పీ దూరంగా ఉన్నాయి.

మహా వికాస్ అఘాడీకి ఎస్పీ గుడ్‌బై!

ముంబై, డిసెంబరు 7: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటమిపాలైన షాక్ నుంచి ఇంకా తేరుకోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమికి ఊహించని పరిణామం ఎదురైంది. ఈ విపక్ష కూటమి నుంచి తమ పార్టీ తప్పుకోవాలని నిర్ణయించినట్టు శనివారం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మహారాష్ట్ర చీఫ్, ఎమ్మెల్యే అబు అజ్మీ ప్రకటించారు. మహారాష్ట్రలో ఇటీవలి ఓటమి అనంతరం ఎంవీఏ కూటమిలోని శివసేన(యూబీటీ) హిందూ అజెండాను ఎత్తుకున్నట్టు ఆయన ఆరోపించారు. శివసేన(యూబీటీ) ఎమ్మెల్సీ మిలింద్ నర్వేకర్ బాబ్రీ మసీదు కూల్చివేతను ఇటీవల ప్రశంసించారు. ఇదే ఎస్పీ ఆగ్రహానికి దారితీసినట్టు తెలుస్తోంది.

మా పోస్టులు రెవెన్యూ వాళ్లకా..?

> ఆరోగ్యశాఖలో గ్రూప్-1 కేడర్ అధికారుల తీవ్ర ఆవేదన
>
> వైసీపీ ప్రభుత్వ జీవో.. కూటమి హయాంలో అమలు
>
> ఆస్పత్రుల్లో పోస్టుల పెంపు కోసం జీవో 178
>
> అడ్మినిస్ట్రేటర్ పోస్టుల్లో రెవెన్యూ అధికారులకు ప్రాధాన్యం
>
> అసలే పదోన్నతులు లేక ఆరోగ్యశాఖలో నైరాశ్యం
>
> ఇప్పుడు రెవెన్యూ అధికారుల రాకతో రేగిన చిచ్చు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఓ జీవో ఆరోగ్య శాఖలో చిచ్చుపెడుతోంది. ఆ శాఖలో కొత్త పోస్టులు సృష్టించడానికి 2023 అక్టోబరు 17న జగన్ సర్కార్ తీసుకొచ్చిన జీవో 178 అమలుతో ఆరోగ్యశాఖ అధికారులు వర్సెస్ రెవెన్యూ శాఖ అధికారులు అన్నట్లు పరిస్థితి మారింది. అప్పటి జీవోను ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు అమలు చేయడం దీనికి కారణం. ఆరోగ్యశాఖ పరిధిలో 11 బోధనా సుపత్రులు ఉన్నాయి. వీటి కోసం వైసీపీ హయాంలో 11 అడ్మినిస్ట్రేటర్స్ పోస్టులు సృష్టించారు. వారి అర్హతలను జీవో 178లో పొందుపరిచారు. అడ్మినిస్ట్రేటర్ పోస్టులో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి లేదా జాయింట్ డైరెక్టర్ కేడర్ అధికారులను నియమించవచ్చని, వారికి 50 ఏళ్లలోపు ఉండాలనే నిబంధన పెట్టారు. వైసీపీ హయాంలో తీసుకున్న ఈ నిర్ణయం అప్పట్లో సంచలనం అయింది. బోధనాసుపత్రుల్లో అడ్మినిస్ట్రేటర్ పోస్టుల్లో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు ఎందుకని ప్రశ్నలు ఉదయించాయి. గ్రూప్-1 ద్వారా మెరిట్‌లో ఉద్యోగం సంపాదించి అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ కేడర్‌లోనే ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అధికారులు ఆరోగ్యశాఖలో చాలా మంది ఉన్నారు. శాఖలో కొత్తగా అడ్మినిస్ట్రేటర్ పోస్టులు అనగానే అవి తమకే వస్తాయని వారంతా ఆనందపడ్డారు. కానీ నిబంధనలు చూశాక వారి ఆశలు అడియాశలు అయ్యాయి. దీంతో ఆ జీవో వచ్చినప్పటి నుంచి దానిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు.

మేమూ అడ్మినిస్ట్రేటర్లమే..

వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ దానిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. 11 పోస్టుల్లో కేవలం నాలుగింటిని మాత్రమే భర్తీ చేశారు. అందులో ఒక రెవెన్యూ అధికారి విధుల్లో చేరక ముందే పోస్టు తనకు వద్దని వెళ్లిపోయారు. అయితే ఆ జీవోను కూటమి ప్రభుత్వంలో నిక్కచ్చిగా అమలు చేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ శాఖ బదిలీల్లో భాగంగా ఆర్డీవో స్థాయి అధికారులు ఏడుగురిని ఆరోగ్య శాఖకు పంపారు. దీనిపై ఆరోగ్యశాఖలోని గ్రూప్-1 కేడర్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు లేక ఏళ్ల తరబడి ఒకే కేడర్‌లో పనిచేస్తున్న తమను కాదని రెవెన్యూ అధికారులకు పోస్టింగ్స్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబుకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదు. దీంతో తమ ఆవేదనను తెలియజేస్తూ ఆరోగ్య శాఖలోని గ్రూప్-1 అధికారులంతా ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. తాము అడ్మినిస్ట్రేటర్లమే అని, తమ శాఖలోని అడ్మినిస్ట్రేటర్ పోస్టులు తమకే కేటాయించాలని లేఖలో పేర్కొన్నారు.

గ్రూప్ 1 పోస్టుల్లో గ్రూప్ 2 అధికారులా?

ప్రస్తుతం ఆరోగ్యశాఖలో పదోన్నతులు లేక అధికారుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. ఆ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లంతా గ్రూప్-1లో మెరిట్ ఆధారంగా ఎంపికైన వారు. డిప్యూటీ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్ పోస్టులు తక్కువ ఉండడం వల్లనే పదోన్నతుల్లో కదలిక లేదు. డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు 11 ఉన్నప్పటికి నేషనల్ హెల్త్ మిషన్‌లో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్ కేడర్‌లో 18 మంది డిడిలుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్‌హెచ్‌ఎం పోస్టులను జాయింట్ డైరెక్టర్ కేడర్ పోస్టులుగా మార్చాలనే డిమాండ్ ఉంది. అలానే బోధనాసుపత్రుల్లో కొత్తగా సృష్టించిన అడ్మినిస్ట్రేటర్ల పోస్టులను కూడా జాయింట్ డైరెక్టర్ కేడర్ పోస్టులుగా మారిస్తే ఆరోగ్యశాఖలో చాలా మంది డిడిలకు పదోన్నతులు లభిస్తాయి. డిడిలు పదోన్నతులు పొందితే అసిస్టెంట్ డైరెక్టర్లకు కూడా పదోన్నతులు లభిస్తాయి. ఆరోగ్య శాఖ వెంటనే దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఇక అడ్మినిస్ట్రేటర్ పోస్టుల్లో ప్రభుత్వం నియమించిన ఆర్డీవోల్లో చాలా మంది గ్రూప్-2 అధికారులే. ఆరోగ్యశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నవారిలో చాలా మంది గ్రూప్-1 కేడర్ వారు. దీంతో గ్రూప్-2 అధికారి కింద గ్రూప్-1 అధికారి పని చేయాల్సి వస్తోంది. ఆరోగ్యశాఖలో అధికారులు రెవెన్యూ అధికారులను వ్యతిరేకించడానికి ఇది కూడా ప్రధాన కారణం.

జీవోకు తూట్లు..

ఆరోగ్యశాఖ ఇచ్చిన జీవో 178కు అధికారులే తూట్లు పొడిచారు. ఆ జీవో ప్రకారం అడ్మినిస్ట్రేటర్ పోస్టుల్లో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమించాలి. కానీ ఆర్డీవోలతో భర్తీ చేశారు. పైగా 50 ఏళ్లలోపు వయసు ఉండాలన్న నిబంధనను ఉల్లంఘించారు. అడ్మినిస్ట్రేటర్ పోస్టుల్లో నియమించిన ఆర్డీవోల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా 50 ఏళ్లు పైబడిన వారే. కేవలం ఆరోగ్య శాఖలో గ్రూప్-1 అధికారుల పదోన్నతులకు దెబ్బకొట్టాలనే ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకువచ్చారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బ్యాంకుకూ బురిడీ!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. పోర్టులో వాటాలు బదిలీ చేయాలంటే యాక్సిస్ బ్యాంకు నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తీసుకోవాలి. ఈ నేపథ్యంలో బ్యాంకును ఎన్‌వోసీ కోరుతూ 2020 డిసెంబరు 28న కేవీరావుతో లేఖ రాయించారు. 41.12శాతం వాటాను అరబిందోకు రాసిచ్చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కానీ... అరబిందోతో డీల్‌ను పరిశీలించిన బ్యాంకు ఎన్‌వోసీ ఇవ్వడానికి అంగీకరించలేదు. తమకు సీపోర్టు బాకీ ఉన్న నేపథ్యంలో ఎన్‌వోసీ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కానీ... విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డి బ్యాంకుపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే.. బకాయిలు చెల్లించందే ఎన్‌వోసీ ఇచ్చేదిలేదని బ్యాంకు తేల్చి చెప్పింది. దీంతో... 'బ్యాంకు ఎన్‌వోసీ ఇవ్వకున్నా పర్లేదు. వాటాలు బదిలీ చేయండి' అంటూ కేవీరావుపై ఒత్తిడి తెచ్చారు. ఇలా చేస్తే తర్వాత న్యాయపరంగా తాను చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపినా వినిపించుకోలేదు. బ్యాంకు ప్రమేయం, అనుమతి లేకుండానే వాటాలు రాయించేసుకున్నారు. దీనిపై అప్పట్లో యాక్సిస్ బ్యాంకు తీవ్రంగా స్పందించింది. తమ బ్యాంకు అనుమతి లేకుండా వాటాలు బదిలీ చేయడం తీవ్ర ఉల్లంఘనగా పేర్కొంది. తమ ఆర్థిక కార్యకలాపాలకు ఇబ్బంది కలిగించడమేనని హెచ్చరించింది. సీపోర్టుకు ఇకపై ఎలాంటి బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేది లేదని 2021 ఏప్రిల్ 22న స్పష్టం చేసింది. కొత్తగా రూ.131కోట్ల బ్యాంకు గ్యారెంటీ కోసం పెట్టుకున్న దరఖాస్తును తోసిపుచ్చింది.

పెన్‌డ్రైవ్‌ల్లో మొత్తం సేకరణ..

కాకినాడ సీపోర్టులో రెండు రోజుల కిందట 12 మందితో కూడిన సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. వాటాల బదిలీ ప్రక్రియలో విక్రాంత్‌రెడ్డి ప్రమేయంపై ఆరా తీశారు. ఐదేళ్ల కార్గో లావాదేవీలు, పోర్టుకు వచ్చిన ఆదాయం.. అరబిందో చేతిలోకి వాటా వెళ్లిన తర్వాత జరిగిన పరిణామాలు, ఆ కంపెనీ తరఫున పని చేస్తున్న డైరెక్టర్లకు సంబంధించిన వివరాలు సేకరించారు. కీలక సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లలో తీసుకున్నారు. 51 కీలక ఫైళ్లను గుర్తించి వాటన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు.



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న నల్సార్ లా వర్సిటీ వీసీ ఆచార్య శ్రీకృష్ణదేవరావ్

యువత జ్ఞానం, నైపుణ్యాలు సమాజానికి ఉపయోగపడాలి

» నల్సార్ లా వర్సిటీ ఉప కులపతి ఆచార్య శ్రీకృష్ణదేవరావ్

» విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని మార్చే శక్తిమంతమైన ఆయుధం విద్య ఒక్కటేనని హైదరాబాదులోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ఆచార్య శ్రీకృష్ణదేవరావ్ అన్నారు. శనివారం గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వితీయ స్నాతకోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి నైపుణ్యం, ప్రతిభ ఉన్న విద్యార్థులను విజ్ఞాన్ వర్సిటీ అందించడం హర్షణీయమని అన్నారు. విద్య అనేది చిన్న జిజ్ఞాస, లక్ష్యంతో మొదలై జ్ఞానం, సామర్థ్యాలు అనే పెద్ద వృక్షంగా పెరుగుతుందన్నారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ చెప్పినట్టుగా జ్ఞానం సృజనకు దారితీస్తుందని, సృజన ఆలోచనకు, ఆలోచన జ్ఞానానికి, జ్ఞానం వ్యక్తిని గొప్పగా మారుస్తుందన్నారు. యువత జ్ఞానం, నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం సందర్భంగా 860 మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు మేనేజ్‌మెంట్ సభ్యులు, డీన్లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్డింగ్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్‌గా రఘురామ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన రఘురామరాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే బొండా ఉమను సత్కరిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

విజయవాడ(గవర్నర్‌పేట), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దుష్టపాలనలో ఇబ్బందులు పడుతున్న కార్మికుల పక్షాన పోరాటాలు చేసిన గొట్టుముక్కల రఘురామరాజుకు కార్మికుల సంక్షేమ బాధ్యతలు అప్పగించడం స్వాగతించ పరిణామమని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన గొట్టుముక్కల రఘురామరాజు విజయవాడలో శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ నేతగా రాష్ట్రంలో ఏ కార్మికునికి అన్యాయం జరిగినా రఘు ముందుఉండేవారని ప్రశంసించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో పనిచేసేవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. అందుకు పట్టాభి, రఘురామరాజు వంటి వారే ఉదాహరణ అని తెలిపారు. చంద్రబాబు స్ఫూర్తితో తామంతా ప్రజలకు అండగా ఉంటూ వారి కష్టాలు తీర్చేందుకే పనిచేస్తామన్నారు. రఘురామరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఆశీస్సులతో తనకు ఛైర్మన్‌గా బాధ్యత అప్పగించినందుకు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీ, పుట్టగుంట విజయకుమార్, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, జనసేన విజయవాడ కన్వీనర్ అమ్మిశెట్టి వాసు, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ అత్యుత్సాహం

1200 మంది హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు

» తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వానికి వదిలేసిన హైకోర్టు.. దానికీ 3 నెలల గడువు

» మూడు రోజుల్లోనే అమలు చేసిన వైనం

» తీర్పు కాపీ రాకుండానే చర్యలపై విమర్శలు

» ప్రభుత్వం న్యాయం చేయాలంటున్న బాధితులు

అమరావతి/గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరోగ్యశాఖలో రెండు దశాబ్దాలకుపైగా పనిచేసిన సుమారు 1200 మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను రాత్రికిరాత్రి తొలగించడం వివాదానికి దారితీసింది. హైకోర్టు తీర్పు ఒరిజినల్ కాపీ రాకముందే వారిని ఇంటికి పంపడం విమర్శలకు తావిస్తోంది. 2002లో ఉమ్మడి ఏపీలో పురుష హెల్త్ అసిస్టెంట్ల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ అయింది. పదో తరగతి అర్హతతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శిక్షణ పొందిన వారు ఈ ఉద్యోగానికి అర్హులుగా పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష రాసి మెరిట్ లిస్టు జారీ చేసిన తర్వాత.. ఇంటర్ చదివిన వారికి మాత్రమే ఈ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఇంటర్ చదివిన అభ్యర్థులతో ఉద్యోగాలు భర్తీ చేయాలని 2002 హైకోర్టు చెప్పడంతో కొందరు సర్వీసులో చేరారు. ఇదే కేసులో 2006లో తుదితీర్పు వెలువరించిన హైకోర్టు.. పదో తరగతి చదివిన అభ్యర్థులు కూడా ఉద్యోగాలు పొందేందుకు అర్హులేనని చెప్పడంతో మళ్లీ మెరిట్ జాబితా రూపొందించి మరి కొందరికి ఉద్యోగాలిచ్చారు. కొందరు నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులకు మించి ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపిస్తూ కోర్టుకు వెళ్లడంతో మళ్లీ వివాదం తలెత్తింది. 2012లో ఇంటర్, పదో తరగతి అర్హతతో శానిటరీ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులతో అధికారులు మరొక మెరిట్ లిస్టు తయారుచేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాళీలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి, మిగిలిన వారిని విధుల నుంచి తొలగించారు. ఈ ప్రక్రియలో అప్పటికే పదేళ్లు ఉద్యోగం చేసిన చాలామంది రోడ్డున పడ్డారు. ఉద్యోగంలో నుంచి తొలగించిన వారు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనతో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి మంత్రి వర్గ ఉపసంఘం నియమించింది. సమస్యపై అధ్యయనం చేసిన ఉపసంఘం పదేళ్ల పాటు పనిచేసిన వారిని మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించింది. 2002 నుంచి విధుల్లో ఉన్నవారిని 273 జీవో ఆధారంగా, 2013 తిరిగి విధుల్లోకి తీసుకున్న వారిని 1207 జీవో ఆధారంగా ఉద్యోగాల్లో కొనసాగించారు. అయితే 1207 జీవోపై మళ్లీ కొందరు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. సుమారు పదేళ్లు ఈ కేసులో వాదనలు జరిగాయి. గత వారం ఈ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. అయితే, మూడు నెలల కాలంలో తొలగింపు ప్రక్రియ చేపట్టాలని, తిరిగి మెరిట్ జాబితా రూపొందించాలని హైకోర్టు పేర్కొన్నట్లు బాధితులు చెబుతున్నారు. తీర్పు అమలు పరిచే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తాము ప్రభుత్వ పెద్దలను కలిసి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్‌లు భావిస్తున్నారు. కానీ, గురువారం హడావుడిగా తమను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు. కోర్టు తీర్పునకు సంబంధించిన ఒరిజినల్ కాపీ కూడా అందకముందే తమకు ఉద్వాసన పలికారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం ఆయా జిల్లాలలోని హెల్త్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు. శుక్రవారం పలువురు ఉద్యోగులు ఆ విషయం తెలియక విధులకు హాజరై ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్ వేసేందుకు ప్రయత్నించగా అప్పటికే పాస్‌వర్డ్ మారినట్లు చూపించింది. తమలో చాలామంది 50 ఏళ్ల వయసు పైబడిన వారేనని ఇప్పుడు ఏ ఉద్యోగం వెతుక్కోగలమని వారు ప్రశ్నిస్తున్నారు. తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిసి ఉన్నతాధికారులు హైకోర్టు ఆదేశాలను రాత్రికిరాత్రి అమలు చేశారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించిన తమకు న్యాయం చేయాలని కోరారు.

కుటుంబాలు ఎలా పోషించుకోవాలి

మాకు 50 ఏళ్లు వచ్చాయి. కాంట్రాక్టు ఉద్యోగంలో వచ్చిన తక్కువ జీతంతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. హఠాత్తుగా ఉద్యోగం తీసి ఇంటికి పంపారు. వచ్చే నెల నుంచి జీతం రాదు. మా కుటుంబం పస్తులతో పడుకోవాల్సిందే. సీఎం, డిప్యూటీ సీఎం మా విషయంలో జోక్యం చేసుకుని ఉద్యోగాలు ఇప్పించాలి.

-ఎస్ రవి, కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్, పల్నాడు

ఆత్మహత్యలే శరణ్యం

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశాం. ఎన్నో అత్యవసర పరిస్థితుల్లో డ్యూటీలు చేశాం. అవేవీ పట్టించుకోకుండా ఇప్పుడు మమ్మల్ని రోడ్డున పడేయం దారుణం. ఈ పరిస్థితి ఊహించుకుంటేనే గుండె పగిలి పోతోంది. రేపు అనే మాట గుర్తుకు వస్తేనే భయమేస్తోంది. ఏంచేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించక పోతే ఆత్మహత్యలే శరణ్యం!.

-పి.వెంకటేశ్వరరావు, కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్, బాపట్ల

22 ఏళ్లుగా పనిచేస్తున్నాం..

నేను 22ఏళ్లు హెల్త్ అసిస్టెంట్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాను. అప్పుడు మంచి మార్కులు వచ్చాయని ఉద్యోగమిచ్చారు. ఇప్పుడు ఉన్నపళంగా తీసేశారు. ఈ వయసులో ఇప్పుడు నాకు ఎవరు ఉద్యోగం ఇస్తారు. నేను కొత్తగా ఏ పని చేయగలను. ప్రభుత్వం మా విషయంలో మానవతాదృక్పథంతో ఆలోచించి న్యాయం చేయాలి.

-ఎన్.శ్రీనివాసరావు, కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్, గుంటూరు

క్షయ రహిత దేశానికి పూర్తి సహకారం

» కేంద్ర మంత్రి నడ్డాతో రాష్ట్ర మంత్రి సత్యకుమార్

» దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో టీబీ నివారణ ప్రోగ్రాం

» ఏపీలో విజయనగరంను ఎంపిక చేసిన కేంద్రం

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్‌ను క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యాన్ని చేరేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఏపీ పూర్తిగా సహకరిస్తుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం కింద "ని-క్షయ్ శివిర్:100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్"ను కేంద్రం శనివారం దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో ప్రారంభించింది. మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి నడ్డాతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం నుంచి సత్యకుమార్ పాల్గొని మాట్లాడారు. టీబీ నివారణ ప్రచార కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని క్షయ రహితంగా మార్చేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏపీలో 76,590 మంది టీబీ బాధితులు ఉన్నారని చెప్పారు. ఆరోగ్యశాఖ విజయనగరం జిల్లాలో పెద్ద సంఖ్యలో వైద్య శిబిరాలు, విస్తృతంగా అవగాహన ప్రచారాలు నిర్వహిస్తుందన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

» నేటికి బలపడే అవకాశం.. దక్షిణ కోస్తా, సీమలో వర్షాలు

» 11 నుంచి మరింత పెరిగే చాన్స్

విశాఖపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం దానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఆదివారానికి బలపడనుంది. ఆ తర్వాత అదే దిశలో పయనించి ఈనెల 11వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించి, శ్రీలంక, తమిళనాడు మధ్య తీరం దిశగా రానుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 11వ తేదీ నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు పెరుగుతాయని పేర్కొంది. కాగా, శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. ఉత్తరాంధ్రలో ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో చలి స్వల్పంగా పెరిగింది. కళింగపట్నంలో 20.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

కుంభమేళాకు రండి

» గవర్నర్, చంద్రబాబు, పవన్‌కు యూపీ డిప్యూటీ సీఎం ఆహ్వానం

» ప్రతి హిందువు పాల్గొనాలని పిలుపు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు కుంభ మేళా ఆహ్వాన పత్రికను అందజేస్తున్న యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహాకుంభ మేళా దేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా, సంస్కృతికి చిహ్నం గా నిలుస్తుందని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అతిపెద్ద భారతీయ ఆధ్యాత్మిక కార్యక్రమమైన మహా కుంభమేళాలో ప్రతి హిందువూ పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా 2025 జనవరి 13న గంగ, యమున, త్రివేణి నదుల సంగమ క్షేత్రం ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య, ప్రయాగ్ రాజ్ ఎమ్మెల్యే సిద్ధార్థనాథ్ సింగ్‌తో కలిసి శనివారం విజయవాడకు వచ్చారు. ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబును కలిసి కుంభామేళాకు రావాలని కోరారు. అనంతరం కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మౌర్య విలేకర్లతో మాట్లాడుతూ.. కుంభమేళాకు ఏపీ గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ఇతర ముఖ్యులను ఆహ్వానించామని, కుంభమేళాలో తిరుమల నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు సహకారం కోరామని, ఇచ్చేందుకు సమ్మతి తెలిపారని అన్నారు. ఆయనతో పాటు విజయవాడ పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, పాతూరి నాగభూషణం తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

'ఆత్మార్పణ దినం'గా పొట్టి శ్రీరాములు వర్ధంతి

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు వదిలిన పొట్టి శ్రీరాములు వర్ధంతిని 'ఆత్మార్పణ దినం'గా ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి ఏటా డిసెంబరు 15వ తేదీన ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ సచివాలయం, కమిషనరేట్‌లు, జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వం కార్యాలయాల్లో నిర్వహించాలని పేర్కొన్నారు.

మహిళలపై హింసాత్మక దురాగతాలు, ఇస్లాం వ్యతిరేక ఉన్మాదం, ఎడతెగని యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, నిరంకుశ ప్రభుత్వాలతో సతమతమవుతున్న ప్రస్తుత దశకం 1920లకు ఏ మాత్రం సమజోడీ కాదు. ఆధునిక వివేచన భారతీయులలో వికసించేందుకు 1920ల తరం దోహదం చేసింది. 2020 లనాటి మన తరం కాలం చెల్లిన సంప్రదాయాలపై మక్కువ చూపుతోంది.

వెలుగులు విరజిమ్మిన ఆ ఇరవైలు

గతం అంటే... అనేకమైన విషయాలు. భవిష్యత్తు లేదా సుదూర సంఘటనలను చూపే ఒక దివ్య దర్పణం; అది వర్తమానం యథార్థ స్థితినీ చూపుతుంది. వర్తమానం ఉనికి గతించిన కాలం సమగ్రాకృతి. నాలో నేను, నా భారతదేశం గురించి ఆలోచిస్తూ వర్తమానాన్ని రూపుదిద్దేందుకు ఒకటిగా కలిసిన అనేక గతాల వైపు నా మనో దృక్కులను సారించాను. ఈ అన్వేషణలో మూడు గతించిన దశాబ్దాలు విశిష్టంగా, విలక్షణంగా కనపడ్డాయి. వర్తమాన భారతదేశాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రూపొందించిన ఆ మూడు దశకాలు: 1990లు, 1940లు; 1920లు.

అసాధారణ రాజకీయ, ఆర్థిక సంఘటనలకు 1990లు కాల వేదిక కాగా కొత్త యుగానికి నాంది పలికిన చరిత్రాత్మక నవోదయాలు 1940ల్లో సంభవించాయి. ఈ రెండు దశకాలతో పోల్చినప్పుడు 1920ల్లో అంత నాటకీయత కనిపించదు. అయినప్పటికీ అవి నవ భారతదేశం ఆవిర్భావాన్ని విస్తృతంగా ప్రభావితం చేశాయి. భారతదేశ ఆధునికతను సృజించి, అభివృద్ధిపరిచిన ఒక కొత్త సంవేదనీయత లేదా రసార్ద్రత ప్రభవించేందుకు ఇరవయో శతాబ్ది మూడో దశకం దోహదం చేసింది. ఇప్పుడు 2020ల్లో ఉన్న మనం, ఒక శతాబ్ది దూరంలో, 1920ల్లో భారతదేశం ఎలా ఉంది, ఏమి చేస్తుందో తెలుసుకోవడం సంతోషప్రదంగానే కాకుండా కొంచెం వినోదకరంగా కూడా ఉంటుంది.

1920 దశకాన్ని మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1920లో గుజరాత్ విద్యాపీఠ్‌ను నెలకొల్పడం, 1930లో మహాత్ముడు ప్రపంచ ప్రసిద్ధ దండియాత్ర నిర్వహించడం మధ్య కుండలీకరణం చేయవచ్చు. అలాగే బిఆర్ అంబేడ్కర్ 1920లో మూక్ నాయక్ ను ప్రారంభించడం నుంచీ 1932లో పూనా ఒడంబడికపై సంతకం చేయడం మధ్య కాలాన్ని కూడా 1920 దశకంగా చేయవచ్చు. ఆగస్టు 1919లో విక్రమ్ సారాభాయి జననం, 1930లో సివి రామన్ కు భౌతిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించడం మధ్య కాలాన్ని 1920 వ దశకం గా కుండలీకరణం చేయవచ్చు. ఆధునిక భారదేశ ఆధ్యాత్మిక నాయకుల విషయానికి వస్తే తొట్ట తొలుత రమణ మహర్షి 1922లో నెలకొల్పిన రమణాశ్రమం ను ప్రముఖంగా ప్రస్తావించవలసి ఉంది. 1926లో అరవిందుడు దివ్యజీవన ప్రపక్తగా ప్రభవించారు.

జాతి మేధా, కళా సంవేదనీయతను తీర్చిదిద్దిన అసాధారణ ప్రతిభావంతులు చిన్న పట్టణాల నుంచి ప్రభవించడం 1920ల్లోనే ప్రారంభమయింది. ప్రపంచ ప్రసిద్ధ ఆధునిక భారతదేశ చిత్ర లేఖనకారుల్లో కొంతమంది చిన్న పట్టణాలలోనే జన్మించారు. ఎఫ్ ఎన్ సౌజా 1924లో గోవాలోని శాలిగావ్‌లో జన్మించారు; ఎస్ హెచ్.రాజా 1922లో కక్కాయియాలో పుట్టారు; వి ఎస్ గయిటోండె 1924లో నాగపూర్‌లోను, తైబ్ మెహతా 1925లో కపాడ్‌వాంజ్ లో జన్మించారు. వీరంతా చిత్రకళలో అసాధారణ ప్రతిభావంతులు. వారు సృజించిన వర్ణ శోభిత చిత్రకళా రాజాలు దేశంలోనూ, ప్రపంచమంతటా కళాకృతుల సేకరణ కర్తలను, కళాభిమానులను ఆకట్టుకుంటున్నాయి.



ధార్వాడ్ సమీపంలో రోనా అనే పల్లె జనాభా ప్రస్తుతం 25,000. ఒక శతాబ్దం క్రితం ఆ గ్రామంలో కొన్ని వందల మంది మాత్రమే ఉండేవారు. ఇరవయో శతాబ్ది శాస్త్రీయ సంగీతకారులలో మహోన్నతుడు అయిన భీమ్ సేన్ జోషీ 1922లో రోనాలో జన్మించారు. సప్తస్వరాలను లోకోత్తరంగా మంత్రించి ప్రపంచాన్ని సమ్మగ్ధం చేసి భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఒక విలక్షణ గుర్తింపు సమకూర్చిన సంగీతవేత్తలు 1920 దశకం బిడ్డలే. భారతీయ వెండితెర మాంత్రికులలో విశ్వవిఖ్యాతుడు సత్యజిత్ రే 1921లోను, రిత్విక్ ఘటక్ 1925లోను, గురుదత్ 1925లోను జన్మించారు. భారతీయ సంవేదనలను నిర్వచించడమే కాకుండా ప్రపంచంలో భారత్‌కు కీర్తిప్రతిష్ఠలను విశిష్టంగా నిర్మించిన చలనచిత్ర కళాస్రష్టలు వారు. పండిట్ రవిశంకర్ 1920లో జన్మించారు. మధుర గాయకులు హేమంత్ కుమార్ 1920లోను, తలత్ మహమ్మద్ 1924లోను, కిశోర్ కుమార్ 1929లోను, గంధర్వ గాయని లతా మంగేష్కర్ 1929లోను జన్మించారు. భారతీయ సినిమా, ముఖ్యంగా బాలీవుడ్ 1920ల బిడ్డల భుజస్కంధాలపై నిలిచింది. ఇరవయో శతాబ్దిలో చాలవరకు భారతీయ రసభావ రంజిత దృష్టిని ప్రభావితం చేసిన దిలీప్ కుమార్ 1922లోను, దేవ్ ఆనంద్ 1923లోను, రాజ్ కపూర్ 1924లోను జన్మించారు.

ఇరవయో శతాబ్ది భారతీయ ఆధునికతను పరిపూర్ణంగా ప్రభావితం చేసిన సాహితీ స్రష్టలు 1920ల్లోనే జన్మించారు. శ్రీలాల్ శుక్లా 1925లోను, మహా శ్వేతా దేవి 1926లోను, ఖుర్రాతులైన్ హైదర్ 1927లోను జన్మించారు. ఇరవయో శతాబ్ది భారతీయుల కళా సంవేదనలను, సాహిత్య అభిరుచులను అనితర సాధ్యంగా ప్రభావితం చేసినవారందరూ 1920ల్లో జన్మించిన వారే. ఎంతోమంది గాయనీ గాయకుల, రచయితల, కళాకారుల, వైజ్ఞానికుల తొలి బాల్యం 1920ల్లోనే గడిచిందన్నది ఒక సత్యం. ఆ రోజుల్లో ఏమి మహత్యం ఉందో గానీ ఆనాటి ఆ బాలలు దాన్ని స్వాయత్తం చేసుకుని తదనంతర జీవితంలో తమ సృజనాత్మక ప్రతిభతో దాన్ని సమున్నతం చేశారు. 1924లో బెల్గాంలో భారత జాతీయకాంగ్రెస్ వార్షిక మహాసభకు మహాత్మా గాంధీ అధ్యక్షత వహించారు. ఐదు సంవత్సరాల అనంతరం 1929లో లాహోర్ లో జరిగిన కాంగ్రెస్ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేసింది. 1920ల్లోనే భారత్ విశాల ప్రపంచానికి సన్నిహితమయింది. 'ప్రపంచపు బాధను తన బాధగా స్వాతంత్ర్యసాధనలో నిర్ణయాత్మకంగా ముందంజ వేస్తున్న భారత్ భావించింది. ఇటలీలో బెనిటో ముస్సోలినీ బ్లాక్ షర్ట్స్ దళాల నేర్పాటు చేశాడని, జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ బ్రౌన్ షర్ట్స్ దళాలను జిప్సీలు, యూదులు, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సమీకరించాడన్న విషయాలు నాటి మన సామాజిక నాయకులకు బాగా తెలుసు. 1922లో ఐన్ స్టీన్ తన 'ది మీనింగ్ ఆఫ్ రెలటివిటీ' ప్రచురించిన విషయం ఆనాటి భారతీయ విద్యాధికులకు తెలుసు.

1920ల్లో భారతీయ సాహితీ వేత్తలకు అమెరికన్, యూరోపియన్ సాహిత్య వేత్తల కొత్త పుస్తకాలు వెన్వెంటనే అందుబాటులోకి రావడం ఆరంభమయింది. రవీంద్రుని 'రక్తకరాబీ'ని స్వాగతించిన విధంగానే అగథా క్రిస్టీ 'ది మిస్టీరియస్ ఎఫైర్ ఎట్ స్టైల్స్' (1920)ను, ఎర్నెస్ట్ హెమింగ్వే 'ఎ ఫేర్ వెల్ టు ఆర్మ్స్' (1929)ను అంతే ఉత్కంఠతో చదివారు. ఐరిష్ మహాకవి డబ్ల్యు.బి.యేట్స్‌కు నోబెల్ పురస్కారాన్ని సాధించిన 'మైఖెల్ రాబర్ట్స్ అండ్ ది డాన్సర్ (1921) ను భారతీయ పాఠకులు అర్థం చేసుకోలేకపోయారు. అయితే భారత్‌తో యేట్స్ మహాకవి మేధో సంబంధాల గురించి మోహినీ చటర్జీ, రవీంద్రనాథ్ టాగోర్ ల ద్వారా వారికి తెలుసు. టి ఎస్ ఇలియట్ 'ది వేస్ట్ ల్యాండ్' (1922), వర్జీనియా ఊల్ఫ్ 'మిసెస్ డల్లో వే' (1925) సమకాలీన భారతీయులను వెన్వెంటనే ఆకట్టుకోలేకపోయాయి. అయితే ప్రస్తావిత పాశ్చాత్య రచయితల సాహిత్య సృజనలతో పాశ్చాత్య సాహిత్య జగత్తులో కొత్త పవనాలు వీస్తున్నాయనే విషయం ఆనాటి భారతీయ విద్యావంతులకు తెలుసు. 1920 దశకంలో ప్రభవించిన సామాజిక సంవేదనలు, సాహిత్య అభిరుచులు భారతీయులలో 1980ల వరకు ప్రభావదాయకంగా ఉన్నాయి. 1950ల్లో నెహ్రూ ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థలు, ఉన్నత విద్యా సంస్థలను నిర్మించి వాటిని అభివృద్ధి పరిచారు. ఆ విద్యాసంస్థల్లో పరిఢవిల్లిన సాంస్కృతిక, మేధో సంస్కృతి 1920దశకంలో ప్రభవించిందే. చిత్రమేమిటంటే నెహ్రూ భావజాలాన్ని వ్యతిరేకించే సిద్ధాంతాలు కూడా 1920ల్లోనే ఊపిరి పోసుకున్నాయి. వినాయక్ దామోదర్ సావర్కార్ 'ఎస్సెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ' ఆ దశకంలోనే వెలువడింది.

1920 దశకం చరిత్రను పునరావలోకనం చేస్తే 2020ల్లో ఉన్న మనం వందేళ్ల నాటి ఉజ్వల భావుకులు, ప్రగతిశీల ఆలోచనా శీలురు అయిన మన పూర్వీకులతో ఏ విధంగాను సమరీతిలో లేము. 1920ల తరం ఆధునిక వివేచన భారతీయులలో వికసించేందుకు విశేషంగా దోహదం చేసింది. 2020 లనాటి మన తరం కాలం చెల్లిన సంప్రదాయాలపై మక్కువ చూపుతోంది. మన తాతలు, నానమ్మల తరం వినూత్న, ప్రయోజనకరమైన తాత్త్విక భావనలు, వైజ్ఞానిక పద్ధతులను ప్రవేశ పెట్టి జాతి అభ్యున్నతికి దోహదం చేశారు. అంటురోగాలు, కార్చిచ్చులు, వరదలు, మహిళలపై హింసాత్మక దురాగతాలు, ఇస్లాం వ్యతిరేక ఉన్మాదం, ఎడతెగని యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, నిరంకుశ ప్రభుత్వాలతో సతమతమవుతున్న ప్రస్తుత దశకం 1920లకు ఏమాత్రం సమ జోడీ కాదు. ఈ రెండు దశకాల మధ్య ఒక శతాబ్ది దూరం.. అంతకు మించిన దూరంగా కనిపిస్తుందనడంలో అత్యుక్తి ఏమీ లేదు.

• **గణేష్ నారాయణదాస్ దేవి**
విద్యావేత్త, సాంస్కృతిక కార్యకర్త
(ది టెలిగ్రాఫ్ సౌజన్యం)

ఆ దాడులపై విపక్షాల మౌనం సబబేనా?


ఇటీవల కాలంలో రెండు అంశాలు నన్ను, ఈ దేశంలో లౌకిక తత్వం వర్ధిల్లాలని కోరుకుంటున్న అనేక మందిని విచలితులని చేశాయి. ఒకటి- సంఘ్ పరివారీయులు అజ్మీర్ దర్గాపై కేసు వేయడం, రెండవది- బంగ్లాదేశ్‌లో హిందూ మత మైనారిటీలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఫాసిస్ట్ దాడులపై సంఘ్ పరివారీయులు తప్ప లౌకిక వాదులు గానీ, మత మైనారిటీ హక్కుల తేకేదారులు గాని ఎవరూ స్పందించకపోవడం.

రాజస్థాన్‌లో అజ్మీర్ పట్టణంలో 13 వ శతాబ్దంలో నివసించిన మొయినుద్దీన్ చిస్తి స్మారకార్థం నిర్మించిన దర్గా అన్ని మతాల ప్రజలకు ఒక దర్శనీయ స్థలం. సూఫీ ఋషి మొయినుద్దీన్ ఛిస్తీ అనంతరం ఆయన శిష్యులు సూఫీ యిజాన్ని ప్రచారం చేస్తూ దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. సూఫీయిజం ప్రేమను, సామరస్యాన్ని, సోదర భావాన్ని బోధించే ఒక కల్ట్. అందుకే సూఫీ ఋషుల బోధనలు, సూఫీ సాహిత్యం, సూఫీ భక్తి గీతాలు అన్ని మతాల ప్రజలను ఆకర్షించాయి. వారు మరణించిన తర్వాత ఆయా ప్రాంతాలలో దర్గాలు వెలసి అన్ని మతాల ప్రజలకు దర్శనీయ స్థలాలుగా మారినాయి. జహంగీర్ పీర్ దర్గా, జాన్ పాడ్ దర్గా, పహాడీ షరీఫ్ దర్గా, నిర్మల్ ఘాట్ రోడ్డు మొదట్లో ఉన్న షేక్ సాబ్ దర్గా లాంటివి అనేకంగా తెలంగాణ వ్యాప్తంగా వెలసిన సూఫీ దర్గాలకు హిందువులు, ముస్లింలు, ఇతర మతస్థులు వెళ్ళి మొక్కులు తీర్చుకోవడం చూస్తూనే ఉన్నాము. నిర్మల్ దగ్గర సూఫీ నగర్ పేరుతో దర్గా వద్ద ఒక ఊరు కూడా వెలిసింది. ఈ సహజీవన సంస్కృతే 'గంగా జమునా తేహజీబ్'గా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

అజ్మీర్ దర్గా దేశవ్యాప్తంగా అన్ని మతాల ప్రజలకు మంచి ప్రజాదరణ కలిగిన దర్శనీయ స్థలం. అజ్మీర్ దర్గాను సందర్శించిన వారి కోరికలు తీరుతాయని అపార నమ్మకం ప్రజల్లో ఉన్నది. అజ్మీర్ దర్గాతో నాకు ఉన్న ఒక అనుభవాన్ని గుర్తు చేయాలని అనుకుంటున్నాను. 2010లో తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకులు, మరికొంతమంది సభ్యులం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి నివేదిక సమర్పించడానికి ఢిల్లీ వెళ్ళాము. ఆ కార్యక్రమం అనంతరం అందరం కలిసి అజ్మీర్ దర్గా వెళ్ళాము. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే అజ్మీర్ దర్గా మళ్లీ సందర్శిస్తామని మాలో కొందరు మొక్కుకున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే సంఘం సభ్యులందరూ మళ్ళీ వెళ్ళి తమ మొక్కును చెల్లించుకున్నారు. ఈ దర్గాను సందర్శించి చాదర్ సమర్పించని రాజకీయ నాయకుడు ఈ దేశంలో లేడంటే అతిశయోక్తి కాదు. 13 శతాబ్దంలో అంటే సుమారు 700 ఏండ్ల క్రితం నిర్మించిన అంతటి ప్రజాదరణ కలిగిన ఈ దర్గాను కూడా హిందూ మత ఛాందసులు వదిలిపెట్టలేదు. అజ్మీర్ దర్గా ఒకప్పుడు శివాలయం అని వాదిస్తూ రాజస్థాన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మదన్ రాథోర్ అజ్మీర్ సివిల్ కోర్టులో కేసు వేసినట్టు, కోర్టు సర్వే నిర్వహించమని ఆదేశాలు జారీ చేసినట్టు వార్తలు చదివి మనసు వికలమయింది.

ప్రాచీన భారత ఉప ఖండంలో శైవం, వైష్ణవం మధ్య, వైదిక, బౌద్ధ మతాల మధ్య, మధ్యయుగాలలో హిందు, ఇస్లాం మతాల మధ్య ఘర్షణలు ఉన్నప్పటికీ సమ్మిళిత సహజీవనం ఈ ఉప ఖండంలో శతాబ్దాలుగా కొనసాగుతూ వచ్చింది. ఇస్లాం భారతదేశంలోకి అడుగుపెట్టి సూఫీ ఋషుల ద్వారా దేశంలోని ఇతర ప్రాంతాలకు, తెలంగాణలోకి వ్యాపించింది. తెలంగాణలో ఇది కుతుబ్ షాహిల కాలం కంటే ముందు నుంచి ఉనికిలో ఉన్నది. మిశ్రమ సహజీవన సంస్కృతి హైదరాబాద్ రాజ్యంలో వెల్లివిరిసింది. అందుకు ఉదాహరణ తెలంగాణలో ఘనంగా జరిగే మొహర్రం ఉత్సవాలు. గత యుగాలలో మన దశంలోని వివిధ రాజ్యాల పాలకులు.. హిందువులైనా, ముసల్మాన్‌లైనా.. మతతత్వాన్ని అమలు చేసి ఉండవచ్చు. వైదిక మతాన్ని ఆశ్రయించిన హిందూ రాజులు బౌద్ధ, జైన ఆలయాలను శైవ, వైష్ణవ ఆలయాలుగా మార్చినట్టు చరిత్రకారులు అనేకం గుర్తించారు. తిరుమల బాలాజీ మందిరం ఒకప్పుడు బౌద్ధ ఆరామమని విశ్లేషిస్తూ పుస్తకాలు కూడా ప్రచురితమయినాయి. అట్లాగే ముస్లిం పాలకులు కూడా హిందూ ఆలయాలను కూల్చి, లేదా వాటి పక్కనే మసీదులు కట్టి ఉంటారు. విగ్రహాలను ధ్వంసం చేసి ఉంటారు. కానీ ప్రజలు మాత్రం కలిసి మెలసి జీవించారు. తిరుమల వేంకటేశ్వరుని గుడి తమదేనని బౌద్ధులు కేసు వేస్తే ఎలా ఉంటుంది? తిరుమల గుడిని బౌద్ధులకు అప్పగిస్తారా? ఆదిలాబాద్ జిల్లాలో జైనద్ లో ఉన్న ఒకప్పటి జైన దేవాలయం హిందూ దేవాలయంగా మారింది. ఊరి పేరులోనే జైనం కనిపిస్తున్నది. ఈ దేవాలయంపై జైనులు కేసు వేస్తే జైనులకు అప్పగిస్తారా? రాచరిక వ్యవస్థలో చరిత్రలో జరిగిన అనేక తప్పిదాలను ఈ రోజు తిరగదోడుతూపోతే ఈ దేశంలో మత సామరస్యత చెదిరిపోయి మత వైషమ్యాలు పెచ్చరిల్లిపోవా? అజ్మీర్ దర్గా కేసుపై ఎంఐఎం అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు, మత మైనారిటీల హక్కుల కోసం గొంతు చించుకొని మాట్లాడే అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ 'ఇది దేశాన్ని అస్థిరపరచే చర్య' అన్నాడు. ఇప్పుడు మనం ప్రజాస్వామ్య యుగంలో ఉన్నాము. దేశానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాము. భిన్నత్వంలో ఏకత్వం మన రాజ్యాంగ స్ఫూర్తి. మతాచరణ మన వ్యక్తిగతం, రాజ్యాంగాచరణ సామాజికం చేసుకోవలసిన అత్యవసర పరిస్థితి ఇప్పుడు దేశంలో నెలకొని ఉన్నది.

ఇక రెండవ అంశంలోకి వెళితే.. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో మత మైనారిటీలైన హిందువులపై, హిందూ దేవాలయాలపై కొన్ని నెలలుగా ఇస్లాం మతతత్వవాదుల దాడులు జరుగుతున్న వార్తలు దేశాన్ని కుదిపివేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువుల మీద, హిందూ దేవాలయాల మీద మెజారిటీ ఇస్లాం మతతత్వం పేట్రేగిపోయి దాడులు చేస్తుంటే ఈ దేశంలో ఉన్న లౌకికవాదులు, మైనారిటీ హక్కుల తేకేదారులు ఎందుకు మాట్లాడరు? దాడులను ఎందుకు ఖండించరు? అన్న ప్రశ్నలు నా లాంటి వారిని కలచి వేస్తున్నది. అక్కడి మైనారిటీ హిందువుల మీద దాడులను ఖండించే బాధ్యతను సంఘ్ పరివారానికే వదిలిపెడితే ఈ దేశంలో లౌకిక వాదం ఎట్లా నిలబడుతుంది? మెజారిటీ మతతత్వం ఫాసిజానికి దారి తీస్తున్న వాదనతో ఏకీభావం కలిగిన వాళ్ళు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, ఇజ్రాయిల్, సిరియా, ఆఫ్రికా తదితర దేశాలలో మత మైనారిటీలపై (ఏ మతస్థులైనా) జరిగే ఫాసిస్టు దాడులకు ఇక్కడ లౌకిక వాదులు స్పందించకపోతే లౌకిక వాదం ఎట్లా నిలబడుతుంది? సంఘ్ పరివార్ భావ ప్రచారానికి లోను కాకుండా ఈ దేశ యువతను కాపాడుకోవడం ఎట్లా? ఈ దేశంలో ముస్లిం మత మైనారిటీల హక్కుల గురించి పార్లమెంట్‌లో, పార్లమెంట్ బయట గొంతు చించుకొని అరిచే అసదుద్దీన్ ఒవైసీ బంగ్లాదేశ్‌లో మత మైనారిటీలపై జరిగే దాడులను కూడా అంతే తీవ్రంగా ఖండించాలి కదా! అజ్మీర్ దర్గా కేసు దేశాన్ని అస్థిర పరుస్తుందని సరిగ్గానే ఆవేదన వ్యక్తం చేసిన అసదుద్దీన్ కు బంగ్లాదేశ్‌లో మత మైనారిటీలపై దాడులను ఖండించడానికి మాటలు రావెందుకు? రాహుల్ గాంధీ, ఇతర లౌకిక పార్టీల నాయకులు స్పందించరెందుకు? హక్కుల సంఘాల వారు మౌనం వీడరెందుకు? పాలస్తీనా సంఘీభావ కవిత్వం రాసే కవులు, హిందూ మత తత్వ ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ రచనలు చేసే రచయితలు, కవులు స్పందించరెందుకు? మనం అన్ని రకాల మత తత్వాలను వ్యతిరేకించాలి కదా! దేశంలో మతతత్వ ఫాసిజం ప్రబలకుండా చూడవలసిన బాధ్యత ప్రజాస్వామ్యాన్ని, సమాజ హితాన్ని కోరుకునే ప్రజలదే. ఇవ్వాళ్ళ మనం అన్ని రకాల మతతత్వాలకు వ్యతిరేకంగా నిలబడవలసిన అవసరం ఏర్పడింది. సంఘ్ పరివారం తయారు చేసి వదులుతున్న నేరేటివ్స్ ఈనాటి యువతరాన్ని, మధ్య తరగతి మేధావి వర్గాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వారిని లౌకిక భావనల నుంచి దూరం చేస్తున్నది. అదే సమయంలో సంఘ్ పరివార్ నేరేటివ్స్‌కి కౌంటర్ నేరేటివ్స్ తయారు చేయడంలో దేశంలో లౌకిక వాదులు విఫలమవుతున్నారు. అన్ని రకాల మత తత్వాలను వ్యతిరేకించకుండా కేవలం మెజారిటీ మత తత్వం పేరిట హిందూ మతతత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తే ఈ దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకోలేము. ఇక్కడ లౌకిక వాదుల నుంచి తప్పిదాలు జరుగుతున్నాయని నా భావన. లౌకిక వాదులు తమ పాక్షిక వైఖరిపై పునర్విచారణ చేసుకోవడం అవసరం. లేనట్లైతే దేశంలో లౌకిక తత్వం బలహీనపడుతుంది. మతతత్వ ఫాసిస్టు శక్తులు వేళ్లూనుకుంటాయి. ప్రధాన తెలుగు పత్రికలు బంగ్లాదేశ్ పరిణామాలపై సంపాదకీయాలు రాయడం హర్షించదగినది. అయితే లౌకిక వాదులు ఇంకా మౌనం వహించడం మాత్రం బాధిస్తున్నది.



తిరుమల వేంకటేశ్వరుని గుడి తమదేనని బౌద్ధులు కేసు వేస్తే ఎలా ఉంటుంది? ఆ గుడిని బౌద్ధులకు అప్పగిస్తారా? ఆదిలాబాద్ జిల్లాలో జైనద్‌లో ఉన్న ఒకప్పటి జైన దేవాలయం హిందూ దేవాలయంగా మారింది. జైనులు కేసు వేస్తే ఆ ఆలయాన్ని జైనులకు అప్పగిస్తారా? రాచరిక వ్యవస్థలో జరిగిన అనేక తప్పిదాలను ఈ రోజు తిరగదోడుతూ పోతే ఈ దేశంలో మత సామరస్యత చెదిరిపోయి మత వైషమ్యాలు పెచ్చరిల్లిపోవా?

అన్ని రకాల మతతత్వాలను వ్యతిరేకించకుండా కేవలం మెజారిటీ మతతత్వం పేరిట హిందూ మతతత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తే ఈ దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకోలేము. లౌకిక వాదులు తమ పాక్షిక వైఖరిపై పునర్విచారణ చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో దేశంలో లౌకికతత్వం బలహీనపడుతుంది. మతతత్వ ఫాసిస్టు శక్తులు వేళ్లూనుకుంటాయి.

▪ **శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

చమురు మంటలు రగిల్చిన ఉద్యమాలు

యాభై సంవత్సరాల క్రితం, 1974లో దేశ రాజకీయాలలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు, అజేయురాలుగా వెలుగొందుతున్న ఇందిరాగాంధీకి చిక్కులు తెచ్చిపెట్టాయి. ఇజ్రాయెల్‌పై 1973 యుద్ధంలో అరబ్ దేశాల ఓటమితో అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు పెరిగి, భారత ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లకు గురయింది. నిత్యావసరాల ధరలు మిన్నంటి కోట్లాది కుటుంబాలు అల్లల్లాడిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజ్వరిల్లిన విద్యార్థి, యువ జన ఉద్యమాలు దేశ రాజకీయాలలో పెనుమార్పులకు దారితీశాయి. 1970 దశకం మధ్యనాళ్లో వేల మైళ్ల దూరంలో జరిగిన యుద్ధం మన దేశ రాజకీయాలను ఎలా ప్రభావితం చేసిందన్నది ఆసక్తికరమైన చరిత్ర.

ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య ఎడతెగని యుద్ధాలలో ఒకటైన యోమ్ కిపూర్ యుద్ధం (రమదాన్ యుద్ధంగా కూడా ప్రసిద్ధి) 1970 దశకం మధ్యనాళ్లలో భారత రాజకీయాల్లో పెను మార్పులకు ప్రధాన కారణాలలో ఒకటి. ఆ యుద్ధం 1973 అక్టోబర్ లో ఇజ్రాయెల్‌పై ఈజిప్ట్, సిరియాల దాడితో మొదలై అదే నెలలో ఇజ్రాయెల్ పాక్షిక విజయంతో ముగిసింది. ఆ పోరులో మరొక తొమ్మిది అరబ్ దేశాలే కాక, క్యూబా, ఉత్తర కొరియాల సైనికులు కూడా ఈజిప్ట్, సిరియాల పక్షాన పోరాడాయి. ఈ యుద్ధానంతరం అవమాన భారంతో, తమను సమర్థించని దేశాలకు (అగ్ర దేశాలతో సహా) గుణపాఠం నేర్పాలని ఒపెక్ దేశాలు చమురు ధరను అమాంతం 70 శాతం పెంచగా బ్యారెల్ ధర 5.11 డాలర్ల మేరకు పెరిగింది. మిత్ర దేశాలు గనుక తమ పట్ల అరబ్బులు సానుకూల ధోరణిని కనపరుస్తారని ఆశించిన భారత్‌కు నిరాశ ఎదురయ్యింది. నిర్ణయించిన చమురు ధర ప్రపంచానికంతటికీ వర్తిస్తుందని భారత్‌కు మినహాయింపు ఇవ్వలేమని ఒపెక్ తేల్చి చెప్పింది.



1970 దశకంలో ఇజ్రాయెల్‌పై యోమ్‌కిపూర్ యుద్ధంలో అరబ్ దేశాల ఓటమితో చమురు ధరను ఒపెక్ ఒక్కసారిగా 70 శాతం పెంచింది. ప్రపంచ దేశాల, ముఖ్యంగా భారత్ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోమయింది. ఆ కల్లోల కాలంలోనే గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో లోక్ నాయక్ జెపి నాయకత్వంలో 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమం ప్రజ్వరిల్లాయి. ఈ ఉద్యమాలు దేశ రాజకీయాలను కుదిపివేసి 'అత్యవసర పరిస్థితి'కి దారితీశాయి.

దాంతో భారత్‌కు కష్టాలు మొదలయ్యాయి. అంతవరకు ఐదు వందల మిలియన్ డాలర్లున్న దిగుమతి వ్యయం ఒక్క సారిగా 1.3 బిలియన్ డాలర్లకు చేరింది. అప్పటికే రెండు సంవత్సరాలుగా వర్షాభావాన్ని ఎదుర్కొంటున్న దేశం ఆర్థిక సంక్షోభంలో పడిపోయింది. ధరలు ఆకాశాన్నంటాయి. 1971లో 3.08 శాతం ఉన్న ద్రవ్యోల్బణం రేటు 1974లో 28.60 శాతానికి పెరగగా ప్రభుత్వం ఒక లాంటి 'షాక్' లోనికి జారుకున్నది. పాలనా దక్షుడు, ఆర్థిక శాస్త్ర నిపుణుడు అయిన సిసుబ్రహ్మణ్యం దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలను ఇవ్వలేదు.

ఈ ధరల పెరుగుదలను సహజంగానే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఇందిరా గాంధీపై ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి పాత కాంగ్రెస్ నాయకులు (మొరార్జీ దేశాయ్, అతుల్య ఘోష్, సంజీవ రెడ్డి ప్రభృతులు), భారతీయ జన్ సంఘ్, సోషలిస్టులు (భారతీయ క్రాంతి దళ్)లకు అంది వచ్చిన అవకాశమైంది. ధరల పెరుగుదల, పెరిగిన అవినీతి, ప్రభుత్వ అలసత్వం పై పోరాటానికి సిద్ధమవుతున్న తరుణంలో వారికి మరొక సువర్ణావకాశం లభించింది. 1973 డిసెంబర్ లో అహ్మదాబాద్ లో ఎల్.డీ (లాల్ భాయ్ దల్పత్ భాయ్) ఇంజనీరింగ్ కళాశాలలో ఒక్కసారిగా 20 శాతం పెరిగిన మెస్ బిల్లుకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన అప్పటి ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ అవినీతికి వ్యతిరేకంగా జరగబోయే ఉద్యమానికి నాంది పలికింది. ఈ ఉద్యమం 'నవ్ నిర్మాణ్ ఆందోళన్' గా చరిత్రపుటల్లో స్థానం సంపాదించుకుంది. రెండు నెలల పాటు ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు , విద్యార్థులు, కార్మికులు, మహిళలు గుజరాత్ ను స్తంభింపచేసి చిమన్ భాయ్ పటేల్ బేషరతుగా రాజీనామా చేయాలని ఎలుగెత్తి డిమాండ్ చేశారు. మొరార్జీ దేశాయ్ ఆమరణ నిరాహార దీక్షకు ఉపక్రమించారు. రాష్ట్రమంతటా ఉగ్ర రూపం దాల్చిన నిరసనలో పోలీసు కాల్పులలో దాదాపు వందమంది మరణించారు. ప్రజాభీష్టానికి తలొగ్గిన ఇందిరా గాంధీ ఆదేశం మేరకు చిమన్ భాయ్ 1974 ఫిబ్రవరిలో రాజీనామా చేయగా ఆ తరువాత రెండు నెలల్లో అన్ని పార్టీలకు చెందిన శాసన సభ్యులు పెద్ద ఎత్తున రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో మార్చి నెలలో రాష్ట్రపతి శాసన సభను రద్దు చేశారు.

అదే సమయం లో బిహార్ లో రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పెరిగిన ధరలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయ వాది, సర్వోదయ నాయకుడు జయప్రకాష్ నారాయణ్ నేతృత్వం లో ప్రజలు ఉద్యమించారు. దేశ వ్యాప్తంగా ప్రజ్వరిల్లిన నిరసనలలో మధ్యప్రదేశ్‌లో పోలీసు కాల్పులు ఎనమండుగురిని బలి గొన్నాయి. మార్చి 1974లో బిహార్ లో ప్రముఖ రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలన్నీ భారీ బహిరంగ సభలో తాము లోక్ నాయక్ నేతృత్వంలో సంపూర్ణ విప్లవాన్ని సాధిస్తామని ప్రతిన పూనాయి. బిహార్ ఛాత్ర సంఘర్ష్ సమితి పేరుతో ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ సంఘానికి అధ్యక్షుడిగా పాట్నా విశ్వ విద్యాలయ విద్యార్థి సంఘం అధ్యక్షుడైన లాలూ ప్రసాద్ యాదవ్ ఎన్నికవ్వగా, బిహార్ ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, సుశీల్ కుమార్ మోడీ, వశిష్ఠ నారాయణ్ సింగ్, రామ్ విలాస్ పాశ్వాన్ (ఈయన అప్పటికే శాసన సభ్యుడు) రవి శంకర్ ప్రసాద్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమం లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జూలై నెలలో ఒక భారీ బహిరంగ సభలో జయ ప్రకాష్ నారాయణ్ తాను దేశ వ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని తీవ్ర తరం చేయనున్నట్లుగా ప్రకటించారు. కొన్ని నెలల తరువాత ఆయన పోలీసులకు సైనిక దళాలకు కూడా ప్రభుత్వంపై తిరుగుబాటు చేయమని పిలుపునివ్వడం గమనార్హం. ఈ ప్రకటనను రాజ్యాంగ వ్యతిరేక చర్యగా చాలామంది విమర్శించారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడానికి ఇది కూడా ఒక కారణంగా పలువురు పేర్కొంటారు. బిహార్ లో విద్యార్థుల ఒత్తిడికి 30 మందికి పైగా ప్రతిపక్ష ఎంఎల్ఏలు రాజీనామా చేశారు. కానీ గుజరాత్‌లో వలే ముఖ్యమంత్రి మార్పిడి జరగలేదు. ఈ లోగా జబల్‌పూర్ లోక్ సభ నియోజక వర్గ సభ్యుడైన సీనియర్ కాంగ్రెస్ నేత సేథ్ గోవింద్ దాస్ మరణించగా జరిగిన ఉప ఎన్నికలో విద్యార్థి నాయకుడు ఉద్యమ కారుడు అయిన శరద్ యాదవ్ ను ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థిగా జయప్రకాశ్ నారాయణ్ నిలబెట్టారు. శరద్ యాదవ్ గెలిచాడు. ఆ గెలుపు ప్రతిపక్షాల ఆత్మ స్థైర్యాన్ని ద్విగుణీకృతం చేసింది. లక్ష్యాలలో, కార్యాచరణలో స్పష్టత లోపించినా, ప్రజా బాహుళ్యంలో గల అసంతృప్తికి, కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యం పట్ల వ్యతిరేకతకు అద్దం పట్టిన ఈ ఉద్యమ ప్రకంపనలు దేశమంతటా వినిపించాయి. ఈ రెండు ఉద్యమాలలో రాజకీయ ఓనమాలు దిద్దిన నాటి విద్యార్థి నాయకులైన శరద్ యాదవ్, అరుణ్ జైట్లీ, వెంకయ్య నాయుడు, విజయ్ గోయల్, భూపేంద్ర సింగ్ చుడసామ లాంటి వారు తరువాతి కాలంలో రాష్ట్ర జాతీయ స్థాయిల్లో రాజకీయాలను ప్రభావితం చేయగా, పదుల సంఖ్యలో యువ కళాకారులు, పాత్రికేయులు ఈ ఉద్యమాలలో పాల్గొన్నారు.

ఆ తరువాత చోటు చేసుకున్న గొలుసు కట్టు పరిణామాలైన దేశ వ్యాప్త నిరసనలు, రాయబరేలి లో ఇందిరా గాంధీ ఎన్నికను అలహాబాద్ హై కోర్టు కొట్టివేయడం, సుప్రీమ్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు, ఎమర్జెన్సీ విధింపు అందరికీ తెలిసినవే. నవ నిర్మాణ్ ఉద్యమాన్ని విశ్లేషిస్తూ ది ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ లో వ్రాసిన ఒక సమగ్ర వ్యాసంలో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఘన్ శ్యామ్ షా ఆ ఉద్యమంలో పాల్గొన్న శక్తులన్నీ ప్రగతిశీలకమైనవి కావని స్పష్టం చేశారు. ఆ ఉద్యమం రిజర్వేషన్ వ్యతిరేక ధోరణులను కనపరచిందని కూడా పేర్కొన్నారు. అదే విధంగా బిహార్ ఉద్యమాన్ని అరాచకత్వానికి ప్రతీకగా, జయప్రకాశ్ నారాయణ్‌ను అనార్కిస్టుగా విమర్శించినవారూ లేకపోలేదు. బిహార్ లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిపిఐ సమర్థించగా సిపిఐ(ఎం) వ్యతిరేకించింది. గుజరాత్, బిహార్ ఉద్యమాల వలన భారతీయ జన సంఘ్ గణనీయంగా బలపడిందన్నదీ నిజం. యోమ్ కిపూర్ యుద్ధం భారత రాజకీయాలను కొంత మేరకు ప్రభావితం చేసిందనడానికి చారిత్రక ఆధారాలున్నాయి.

◆ **కొట్టు శేఖర్**
ఆచార్యుడు, మిజోరం యూనివర్సిటీ

అభివృద్ధికి అవినీతి గ్రహణం

స్వాతంత్ర్యానంతరం స్వపరిపాలనలో హక్కుగా పొందే సేవలకు ప్రజలు తెలియక, పనిపూర్తయిన తరువాత అధికారికి ఏదో ఒక కానుకను ఇచ్చేవారు. అది ఒక ఆనవాయితీగా మారింది. మీరు హక్కుగా పొందే సేవలకు మేము ఏమీ ఆశించకుండా పనిచేయాలని, దానికి ప్రభుత్వం నుండి జీతాలు పొందుతున్నామని అధికారులు ప్రజలకు ఎప్పుడూ చెప్పలేదు. రానురాను అధికారులు కానుకలు తీసుకోవడం తమ హక్కుగా భావిస్తూ వచ్చారు. క్రమంగా ప్రతి పనికి ఆ కానుకలనే లంచం రూపంలో తీసుకోవడం వారికి అలవాటైంది. ప్రజాస్వామ్య పాలనలో మన అభివృద్ధికి ఆ అవినీతే ఆటంకమని తెలుసుకోలేక సతమతమవుతున్నాం.

పాలనలో అవినీతిని అరికట్టడం పెద్ద సవాల్. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే గాని అవినీతిని అరికట్టడం సాధ్యం కాదు. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు ఒకనాడు తమ పాలనా వ్యవస్థల్లో అవినీతిపై యుద్ధం చేసినవారే. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సొమ్ముతోనే ప్రభుత్వాలు నడుస్తాయి. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను అభివృద్ధికి, సేవలకు, సంక్షేమ సాధనకు నిజాయితీగా ఖర్చు చేస్తే ప్రజలకు ఆ ప్రభుత్వంపై నమ్మకం కలిగి పన్నులు ఆనందంగా చెల్లిస్తారు. ఇప్పుడు ప్రజలకు మన ప్రభుత్వాలపై నమ్మకం సన్నగిల్లింది.





అవినీతి రెండురకాలు. ఒకటి రాజకీయనాయకులు, వ్యాపారస్తులు కుమ్మక్కై జరిపే అవినీతి. ఇది పెద్ద ఎత్తున జరిగే అవినీతి. దీనిలో ప్రజాధనం పెద్ద ఎత్తున రాజకీయనాయకుల, వ్యాపారస్తుల పాలవుతుంది. చిరు అవినీతి–అంటే ప్రజలు తమ దైనందిన జీవితంలో మునిసిపాలిటీలో, రెవెన్యూ ఆఫీసులో, పోలీసు స్టేషన్‌లో చెల్లించే లంచాలు. పరిస్థితులు ఎంతగా దిగజారాయంటే సామన్యుడు లంచాన్ని ఒక అదనపు పన్నుగా ఓర్చుకుంటున్నాడు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రతి పనికి ఒక ధరను నిర్ణయించి ఆ పనులు చేస్తారన్న విషయం తెలిసిందే. ఇది ఒక దురాచారం. సంఘసంస్కర్తలు ప్రజలను చైతన్యపరచి ఎన్నో సాంఘిక దురాచారాలను రూపుమాపారు. అయితే అవినీతిని నిర్మూలించలేకపోయారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అవినీతిని అదుపు చేసేందుకు ఎన్ని కట్టుదిట్టమైన చట్టాలు తెచ్చినా ఆ మహమ్మారిని నిర్మూలించడం సాధ్యపడలేదు. క్రమేపీ అరికట్టడంతో సర్దుకుపోవాలి. పాలనలో అవినీతి వలన జరిగే నష్టాలు అతి ప్రమాదకరమైన ప్రభావం చూపుతాయని ప్రజలకు విశదీకరించాలి. ప్రజలలో అశాంతి, అలజడి, కుంగుబాటుతనం, దొంగతనాలు, అరాచకాలు, హత్యలు, అభద్రతాభావం, ఒకరిపై ఒకరికి అపనమ్మకం, ఈర్ష్యాద్వేషాలు, కపటం, కోపం పెరిగి సామాజిక పతనం సంభవిస్తున్నది.


మనం నిర్మించుకున్న వ్యవస్థలపైనే మనకు సందేహం. రాజకీయ నాయకులపై ప్రజలకు నమ్మకం లేకపోతోంది. దీనితో అవినీతి ప్రజల జీవనవిధానంలో ఒక భాగమైపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఎక్కువ శాతం మంది ఉద్యోగస్థులు అవినీతిపరులే. లంచాలకు అలవాటుపడ్డ అధికారులకు వారికి వచ్చే జీతంతో పనిలేదు. వచ్చే లంచాల ముందు వారి జీతం చాలా తక్కువ. వచ్చే లంచాలతో విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడి తాము చేయవలసిన ఉద్యోగ బాధ్యతలను, అందివ్వవలసిన ప్రజా సేవలను పూర్తిగా మరచి లేనిదానికీ కానిదానికీ ఏదో ఒక కారణం చూపించి, ప్రతిదానికీ లంచం ఇస్తే గాని పనిచేయని దౌర్భాగ్య పరిస్థితి ఉన్నది. ప్రజలు కూడ గత్యంతరం లేక లంచాలు ఇవ్వడానికి అలవాటు పడ్డారు. ఎవరైనా నిజాయితీగా మెలగాలన్నా, మెలిగే పరిస్థితి లేని సమాజం ప్రస్తుతం ఉంది. పైగా నిజాయితీగా ఉంటే బతకలేనివాడని, చేతకానివాడని సమాజమే నిర్వచిస్తుంది. అవినీతి వలన సమర్థత తగ్గి అసమర్థులు పెరుగుతున్నారు. అవినీతి నిరోధక శాఖ పనిచేస్తున్నప్పటికీ రాజకీయ నాయకుల జోక్యంతోనూ, చట్టాలను నిజాయితీగా అమలు చేయలేక పోవడంవలనా ఉద్యోగులలో మార్పు రావడం లేదు. మరొకవైపు రాజకీయ అవినీతి, అన్ని రకాల ఆర్థిక కుంభకోణాలు మనదేశాన్ని కుంగదీస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన స్వల్పకాలంలోనే స్వాతంత్ర్యం కొరకు పోరాడిన విలువలు కలిగిన నాయకులను ఈ దేశం కోల్పోయి అనుభవం లేని నాయకుల చేతుల్లోకి వెళ్ళి ఇంత పెద్ద దేశాన్ని ఒక మంచి మార్గంలో నడపడం అసాధ్యమవుతున్నది.

అవినీతిని అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నా, అవినీతికి అలవాటుపడిన ఉద్యోగస్థులు కొత్త కొత్త మార్గాలను కనిపెడుతున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అని కాకుండా రాజకీయ నాయకులందరికీ అవినీతిని నిర్మూలించాలన్న ఉద్దేశమే లేదు. అవినీతి నిరోధక శాఖ, డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు, విజిలెన్స్ కమిషన్, లోకాయుక్త వంటి సంస్థలకు పదును పెట్టాలి. ప్రతి కార్యాలయంలో సిటిజన్ చార్టర్లు తయారుచేసి ప్రతి పని ఎన్ని రోజులలో చేస్తారో తెలుపుతూ బోర్డులు పెట్టాలి. అలాగే సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శకతను జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి. ప్రజలు కూడ కొద్దో గొప్పో ఇబ్బంది కలిగినప్పటికీ లంచాలు ఇవ్వకుండా పనులు చేయించుకొనే అలవాటు నేర్చుకోవాలి. అవినీతిపరులైన ఉద్యోగుల నుంచి ఆరంభంలో ఎదురైన ప్రతిఘటన ఎక్కువ కాలం కొనసాగదని గుర్తించాలి. అవినీతికి వ్యతిరేకంగా బలమైన పోరాటం జరిగినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

○ **సోమ శ్రీనివాసరెడ్డి**
ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

(డిసెంబరు 9: అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



ఉర్జావీర్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి మనోహర్‌లాల్


సభికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఉత్సాహంగా ఉర్జావీర్

భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన నాయకులు

* ఇంధన వనరుల పొదుపుపై ఆసక్తికర ప్రసంగం
* చంద్రబాబు ప్రసంగానికి హర్షధ్వానాలు
* అంగన్వాడీలకు ఇండెక్షన్ కుక్ సెట్ల పంపిణీ

ఇంధన వనరుల పొదుపు, సమర్థవంతంగా వినియోగించే విధానాలపై పోరంకిలోని మురళీ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన ఉర్జావీర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వచ్చే ఐదేళ్లలో ఇంధన రంగంలో ప్రగతిని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా, విద్యుత్ ఆదాపై కేంద్రమంత్రి మనోహర్‌లాల్, రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్ చేసిన ప్రసంగం సభికులను ఆకట్టుకుంది.

పెనమలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలోని మురళీ కన్వెన్షన్‌లో జరిగిన ఉర్జావీర్ కార్యక్రమానికి టీడీపీ కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇచ్చిన పిలుపు మేరకు నాయకులు సైతం భారీగా తరలివచ్చారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతిలో ఇంధన వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించే విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి మనోహర్‌లాల్ మాట్లాడి అవగాహన కల్పించారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు ఆదా చేయడం కూడా ముఖ్యమని వక్తలు సూచించారు. ఇంధన పొదుపుతో జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గ్రీన్ ఎనర్జీని, సౌర, పవన విద్యుత్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నపుడు సభలో హర్షధ్వానాలు విన్పించాయి. అవసరమైతే భవిష్యత్తులో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామనడంతో అంతటా ఆనందం వ్యక్తమైంది. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు విద్యుత్‌ను ఆదాచేసే ఇండక్షన్ కుక్ సెట్లను అందజేశారు. ఉర్జావీర్ కిట్లను ఆవిష్కరించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ చీఫ్‌విప్ అనూరాధ, విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, ఇంధన శాఖ కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ బాలాజీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకర రావు, వెలగపూడి శంకరబాబు, జనసేన నియోజకవర్గ బాధ్యులు ముప్పా రాజా, నాయకులు కోయ ఆనంద్ ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర, సీహెచ్ శ్రీనివాస్, ముసునూరు శ్రీనివాసరావు, కలపాల శ్రీధర్ కార్యకర్తలను తరలించారు.



చరిత్ర చెప్పే.. చల్లపల్లి కోట

448 ఏళ్ల నాటి రాచరిక పాలనకు గుర్తు

దేవరకోట సంస్థానానికి రాజధానిగా అంతులేని ఖ్యాతి

చల్లపల్లి రాజావారి పరిపాలనకు నిలువెత్తు సాక్ష్యం

నేటికీ పర్యాటకులను ఆకర్షిస్తున్న రాజసౌధం

సండే స్పెషల్

ఎత్తయిన ద్వారం.. అంతెత్తున కోట బురుజులు.. మోతమోగించే కంచుగంట.. విశాలమైన కోట ప్రాంగణం.. సుందరమైన శిల్ప సంపద.. ఆకట్టుకునే అశోక వృక్షాలు.. చల్లపల్లి రాజావారి కోట ప్రత్యేకతలు. నాలుగున్నర శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా, రాచరికానికి చిహ్నంగా, శ్రీమంతు రాజా యార్లగడ్డ శివ రామప్రసాద్ బహదూర్ పాలనకు నిదర్శనంగా, జగజ్జనని అమ్మవారి శక్తికి నిర్వచనంగా.. నేటికీ చెక్కు చెదరకుండా నిలిచింది. పర్యాటక కేంద్రంగా, ప్రముఖ సందర్శనీయ ప్రాంతంగా నీరాజనాలు అందుకుంటోంది.

8లో



స్వరరాగ సంగమం

రెండోరోజూ కృష్ణవేణి సంగీత నీరాజనం

కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం వీక్షకులను సంగీత సాగరంలో ఓలలాడించింది. భారత సాంస్కృతిక శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం కార్యక్రమాలు జరిగాయి. ఉదయం దుర్గాఘాట్ వద్ద త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల బృందం కచేరీ నిర్వహించింది. తర్వాత కళాక్షేత్రంలో శ్రీనిధి తిరుమల శిష్యులు సాత్విక మోహన్, జేఎస్ శ్రీరామ్ శిష్యులు, మోదుమూడి సుధాకర్, ఆకురాతి కోదండరామయ్య, డాక్టర్ లాడేపల్లి లోకనాథశర్మ, హైదరాబాద్ బ్రదర్స్, చెన్నైకు చెందిన మాలచంద్రశేఖర్ కచేరీ వీనులవిందుగా సాగింది. తిరుపతి జయంతి సావిత్రి హరికథాగానం అలరించింది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్

బీఆర్టీఎస్ రోడ్డు పక్కన రూ.10 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఓ వైసీపీ నాయకుడు కబ్జా చేసేయడమే కాదు.. అధికారులను ప్రసన్నం చేసుకుని పెద్ద భవనం కూడా నిర్మించేస్తున్నాడు. ఈ కబ్జా బాగోతాన్ని జూన్ 27న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై వీఎంసీ అధికారులు విచారణకు ఆదేశించగా, అప్పటి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కబ్జాదారులతో కుమ్మక్కై, వారికి అనుకూలమైన నివేదికను అధికారులకు ఇచ్చారు. దీంతో ఇప్పుడు ఆ స్థలంలో భారీ భవన నిర్మాణం యథేచ్ఛగా సాగిపోతోంది.

బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని ఖాళీస్థలంలో అక్రమ కట్టడం



కబ్జాను దాచేసి.. అక్రమ కట్టడం

బీఆర్టీఎస్ రోడ్డులో రూ.10 కోట్ల స్థలం స్వాహా

స్థానిక వైసీపీ నాయకుడి అక్రమ వ్యవహారం • గతంలోనే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

విచారణకు ఆదేశించిన వీఎంసీ కమిషనర్ • కబ్జాదారులతో కుమ్మక్కైన వీఎంసీ సిబ్బంది

సమగ్ర విచారణ జరపకుండానే నివేదిక • అధికారుల అండతో తాజాగా భారీ నిర్మాణం


కార్పొరేషన్ స్థలం కబ్జా!

జూన్ 27న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకుడి ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న ఫుడ్ జంక్షన్ వద్ద సుమారు 500 గజాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేశారు. రోడ్డు పక్కన దుర్గాపురంలో సర్వే నెంబర్ 170సీ (పాతది), రీ సర్వే నెంబర్ 121.1లో ప్రభుత్వానికి చెందిన సుమారు 500 గజాల ఖాళీస్థలం ఉంది. ఈ స్థలానికి నకిలీ దస్తావేజులు సృష్టించి వైసీపీ నాయకుడు కబ్జా చేశారు. గతంలో ఈ స్థలంలో 13 కుటుంబాలు పాకలు వేసుకుని జీవించేవి. బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణ సమయంలో వారిని తొలగించి కొందరు ఈ స్థలాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. స్థలం అన్యాక్రాంతం కావడంపై గులాబీతోటకు చెందిన సీపీఎం నాయకుడు కొండలరావు, మరికొందరు పెద్ద ఎత్తున పోరాటం చేశారు. కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలంటూ కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఈ కేసు నీరుగారింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులైన కనపర్తి కొండ.. అప్పటి స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు అండతో ఈ స్థలాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుని దుకాణాలు ఏర్పాటు చేశారు. సీపీఎం నాయకులు ఆందోళనలకు దిగగా, వారిని కొండ తన అనుచరులతో బెదిరించినట్టు కూడా సీపీఎం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఈ ఆక్రమణలను 'ఆంధ్రజ్యోతి' కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారిని ప్రసన్నం చేసుకుని.. ఈ కబ్జా బాగోతంపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని వీఎంసీ కమిషనర్ స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డిని ఆదేశించారు. అయితే, సదరు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పూర్తి విచారణ చేయకుండా కబ్జా చేసిన

మిగతా 8లో..

బియ్యం కోసం కయ్యం

ఉమ్మడి జిల్లా రేషన్ మాఫియాలో గ్యాంగ్‌వార్

పరస్పర దాడులు.. తీవ్ర గాయాలు

కానూరులో పాత సిండికేట్‌పై కొత్త సిండికేట్ దాడి

ఎండీయూ ఆపరేటర్లకు తీవ్ర గాయాలు

సిండకేట్ల మధ్య రాజీకి ప్రయత్నాలు

రంగంలోకి దిగిన భాయ్.. ప్రతి దాడికి పన్నాగాలు

రెండు జిల్లాల్లో ఇటీవల పెరుగుతున్న రేషన్ రచ్చ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కానూరులో రేషన్ మాఫియా సిండికేట్ల మధ్య బియ్యం కొనుగోళ్ల విషయం వివాదానికి దారితీసింది. పాత సిండికేట్‌పై కొత్త సిండికేట్ దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాల్లో రెండు ప్రధాన రేషన్ మాఫియా సిండికేట్లు అక్రమంగా ఎండీయూలు, డీలర్ల నుంచి బియ్యం కొంటున్నాయి. కొద్దినెలలుగా ఈ మాఫియాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రాజకీయ అండ కలిగిన ఓ సిండికేట్.. కొద్దిరోజులుగా మూడు మండలాల్లో తమదే మార్కెట్ అని, తమకే బియ్యం అమ్మాలని ఎండీయూలకు, డీలర్లకు షరతు విధించింది. దీనిప్రకారమే ఎండీయూ ఆపరేటర్లు సదరు సిండికేట్‌కే బియ్యం విక్రయిస్తున్నారు. కానీ, ఇంకొందరు పాత సిండికేట్‌కే విక్రయాలు జరుపుతున్నారు. తమ ఆదేశాలను బేఖాతరు చేసి వేరే మాఫియాకు విక్రయించిన ఇద్దరు ఎండీయూ ఆపరేటర్లపై కొత్త సిండికేట్‌కు చెందిన కొందరు దాడి చేశారు. ఈ దాడిలో యనమలకుదురుకు చెందిన ఒక ఎండీయూ ఆపరేటర్ తల పగిలింది. అంతేకాదు.. మళ్లీ బియ్యం అమ్మితే చంపేస్తామని హెచ్చరికలు కూడా జారీ చేశారు. పాత సిండికేట్ బాస్ అనుచరుడి (దోస్త్ డ్రైవర్)పై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ వ్యవహారం పెనమలూరు పోలీసుల వద్దకు చేరింది. కేసులు పెట్టుకునే పరిస్థితి రాకుండా సిండికేట్ల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది రేషన్ డీలర్లతో కూడా పోలీసులు మాట్లాడుతూ కేసుల జోలికి వెళ్లకుండా ఉండాలని చెబుతున్నట్టు తెలుస్తోంది.

పెరుగుతున్న వివాదం

పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాల్లో పాత సిండికేట్‌కు నాయకత్వం వహిస్తున్న బాస్.. బెజవాడ 'భాయ్'కు పార్టనర్. తమ అనుచరులపై జరిగిన దాడిని పాత సిండికేట్ బాస్.. సదరు భాయ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. చెలరేగిపోయిన భాయ్ కొత్త సిండికేట్ సంగతి చూస్తానని హెచ్చరికలు కూడా జారీ చేసినట్టు సమాచారం.

రూ.కోట్ల మాయలో కొట్లాటలు

పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ దేశ సరిహద్దులు దాటిస్తున్న రేషన్ మాఫియాలో పరస్పర గొడవలు మొదలయ్యాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇలాంటి ఉదంతాలు ఇటీవల పెరిగాయి. ఎన్టీఆర్ జిల్లా జయంతి, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, గంపలగూడెంలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనాలు. అక్రమ బియ్యం వ్యాపారం రూ.కోట్లకు అధిపతిని చేస్తుండటంతో కాసుల వేటలో దాడులకు, ప్రతి దాడులకు పాల్పడుతున్నారు. కార్లతో ఢీ కొట్టించడానికి, కత్తులతో దాడులు చేయటానికి, తలలు పగలకొట్టుకోవటానికి కూడా వెనుకాడట్లేదు. ఇంత జరుగుతున్నా సిండికేట్ మాఫియాను జిల్లా అధికారులు అణచివేయలేకపోతున్నారు. ఇప్పటికైనా ఈ మాఫియాకు చెక్ పెట్టకపోతే భవిష్యత్తులో ఈ గొడవలు పెచ్చుమీరి ప్రాణాలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

• భక్తి సాహసం


సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడులో శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో అయ్యప్పస్వాములు సాహసం చేశారు. వీపునకు కొక్కేలు తగిలించుకుని వినాయకుడు, అయ్యప్ప, సుబ్రహ్మణ్యస్వామి కొలువైన రథాన్ని లాగారు. నోటికి శూలాన్ని గుచ్చుకుని భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు.

మద్యం షాపులకు ఝలక్

ఎన్టీఆర్‌లో 2, కృష్ణాలో 3 షాపులపై చర్యలు

* రూ. 5 లక్షల జరిమానాకు ప్రతిపాదనలు
* షాపుల నుంచి సరుకు బయటకు వెళ్లినందుకే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మద్యం షాపులు దక్కే వరకు సిండికేట్లుగా ఉన్నారు. షాపులు దక్కాక ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నిబంధనల ప్రకారం షాపుల్లో విక్రయించాల్సిన మద్యాన్ని బ్యాక్‌డోర్ నుంచి బయటకు పంపుతున్నారు. ఇలా వ్యవహరించిన

మిగతా 8లో..


• మాస్టర్ కలెక్టర్

విజయవాడ రూరల్ మండలం నున్న హైస్కూల్లో శనివారం జరిగిన పేరెంట్స్ మీట్‌లో విద్యార్థినులతో సరదాగా మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

8లో

ఆప్షన్-4కే ఓటు


ఆప్షన్-4 డిజైన్ ఇదే..

* సీఆర్‌డీఏ కార్యాలయ డిజైన్‌కు ఓటింగ్
* 10 డిజైన్లలో ఆప్షన్-4కే ఓకే చెప్పిన 3,354 మంది

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు బిల్డింగ్ డిజైన్లకు నిర్వహించిన పోలింగ్‌కు అనూహ్య స్పందన లభించింది. 10 డిజైన్లను ఇటీవలే వెబ్‌సైట్‌లో ఉంచి నచ్చిన డిజైన్‌ను ఎంపిక చేయాల్సిందిగా

మిగతా 8లో..

దివి పల్లెల్లో రోడ్ల పండుగ

ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కానరాక కునారిల్లిన దివి పల్లెల్లో నేడు రోడ్ల పండుగొచ్చింది. నిన్నమొన్నటి వరకు బురదకయ్యలుగా నడిచేందుకూ వీలులేని అవనిగడ్డ నియోజకవర్గంలోని పల్లెల్లో నేడు సీసీ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

* అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో శరవేగంగా నిర్మితమవుతున్న 496 సీసీ రోడ్లు
* సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు



ఘంటసాలపాలెంలో సీపీ రహదారి నిర్మాణం (నేడు)

(ఆంధ్రజ్యోతి - అవనిగడ్డ బృందం)

రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యంగా వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేయాలని తలచింది. అందులో భాగంగా పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు పేరుతో గ్రామసభలు నిర్వహించింది. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలోమీటర్ల పొడవున 496 సీసీ రహదారుల నిర్మాణానికి వెనువెంటనే పనులు ప్రారంభించింది. గ్రామసభల నిర్వహణ, పనుల ఆమోదం, అంచనాల తయారీ, నిధుల విడుదల, గ్రామాల్లో పనులు మొదలు కావటం ఒక దాని వెంట ఒకటి వెనువెంటనే జరగడంతో పల్లెల్లో ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అవనిగడ్డ మండలంలో రూ.6.25 కోట్లతో 117 రోడ్లు

అవనిగడ్డ మండలంలో రూ.5.49 కోట్లతో 9,061 మీటర్ల మేర 104 సీసీ రహదారులు నిర్మితమవుతున్నాయి. వీటికి అదనంగా రూ.76.20 లక్షలతో మరో 1270 మీటర్ల రహదారులకు నిధులు మంజూరయ్యాయి. 13 రహదారులను అదనంగా నిర్మిస్తున్నారు. అవనిగడ్డ మండలంలో మొత్తం రూ.6.25 కోట్లతో 117 సీసీ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. లంకమ్మ మాన్యం, రాజశేఖరపురం కాలనీల్లో నిన్నటి వరకు బురద రహదారులపై నడిచిన ప్రజలు ఇప్పుడు కొత్త సీసీ రహదారులను చూసి సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



ఘంటసాలపాలెంలో అధ్వానంగా ఉన్న రహదారి (నాడు)

మోపిదేవి మండలంలో రూ.5.63 కోట్లతో 86 రోడ్లు

మోపిదేవి మండలంలో రూ.4.73 కోట్లతో 79 సీసీ రహదారులు తొలుత మంజూరయ్యాయి. మరో రూ.90 లక్షలు మంజూరు కావటంతో మొత్తం రూ.5.63 కోట్లతో 8,899 మీటర్ల మేర 86 సీసీ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వెంకటాపురం బీసీ కాలనీలో సీసీ రహదారి వేయడంతో బురదలో తిరిగే బాధ తప్పిందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 36 సీసీ రహదారుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

చల్లపల్లి మండలంలో రూ.5.5 కోట్లతో 90 రోడ్లు

చల్లపల్లి మండలంలో రూ.3.96 కోట్లు తొలివిడతగా, మరో రూ.1.8 కోట్లు రెండో విడతగా మంజూరయ్యాయి. మొత్తం రూ.5.5 కోట్లతో 8,943 కిలోమీటర్ల పొడవున 90 సీసీ రహదారుల పనులు సాగుతున్నాయి. ఇప్పటివరకు 11 రహదారుల పనులు పూర్తయ్యాయి. నిన్నమొన్నటి వరకు నడిచేందుకు వీలు లేని చల్లపల్లి గౌడపాలెంలోని బండ్రేవు కోడు పక్కన రహదారిపై నేడు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నామని అక్కడి ప్రజలు సంతోషంగా చెబుతున్నారు.

కోడూరు మండలంలో రూ.4.47 కోట్లతో 68 రోడ్లు

తీర ప్రాంత మండలం కోడూరులో రెండు విడతల్లో మొత్తం రూ.4.47 కోట్లు మంజూరు కాగా, 6,861 మీటర్ల మేర 68 సీసీ రహదారుల నిర్మాణపనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 20 రోడ్ల నిర్మాణం పూర్తయింది. కోడూరు శివారు యర్రారెడ్డిపాలెంలో నిర్మించిన సీసీ రహదారి గ్రామంలో రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అక్కడి ప్రజలు ఆనందంతో చెబుతున్నారు.

నాగాయలంక మండలంలో రూ.5.11 కోట్లతో 81 రోడ్లు

తీర ప్రాంత మండలం నాగాయలంకలో రెండు విడతల్లో మొత్తం రూ.5.11 కోట్లు మంజూరు కాగా, 8361 కిలోమీటర్ల పొడవున 81 సీసీ రహదారులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 25 రోడ్ల నిర్మాణం పూర్తయింది. నాగాయలంక సంత మార్కెట్ పక్కన పల్లెపాలెం వెళ్లే రహదారి నిర్మించడంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఘంటసాల మండలంలో రూ.3.7 కోట్లతో 54 రోడ్లు

ఘంటసాల మండలంలో రెండు విడతల్లో మొత్తం రూ.3.7 కోట్లు 5,335 మీటర్ల పొడవునా 54 సీసీ రహదారుల పనులకు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 24 రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఘంటసాలపాలెంలో ఇంతకాలం తాము బురదలో తిరిగామని, నేడు సీసీ రహదారి నిర్మాణం పూర్తి కావొస్తోందని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

మొన్నటిదాకా మోకాలిలోతు నీళ్లలో తిరిగాం



రాజశేఖరపురం కాలనీకి వచ్చి పదేళ్లు దాటిపోయింది. రహదారి సౌకర్యం లేక మోకాటి లోతు నీటిలో బురదలో తిరిగాం. ఇంత లోతున ఉన్న ఈ రోడ్డు వేస్తారని అనుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మించింది. ఇప్పుడు పిల్లలు సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై తిరుగుతున్నారు. **- అర్జా లక్ష్మి, రాజశేఖరపురం**

ఐదేళ్ల తర్వాత అభివృద్ధి చూస్తున్నా



గడిచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు నేను పుట్టిన ఈ ప్రాంతానికి వచ్చాను. గ్రామాల్లో అభివృద్ధి జాడ కనిపించేది కాదు. 2014 నుంచి 2019 వరకు 33,000 కిలోమీటర్లు మేర పల్లెల్లో సీసీ రహదారులు వేశారు. ఇది దేశంలోనే అత్యధికం. మళ్లీ చంద్రబాబు వస్తేనే పల్లెలు మారతాయి అనుకున్నాం. ఆయనకు పవన్‌కల్యాణ్ తోడయ్యారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ పల్లెల్లో అభివృద్ధి చూస్తు న్నా. అవనిగడ్డ నియోజకవర్గంలో తొలివిడతగా 496 రోడ్లు మంజూరై, వాటి పనులు వేగంగా సాగడం చాలా సంతోషాన్నిస్తోంది.

-బొబ్బా గోవర్ధన్, ఎన్ఆర్ఐ



కోడూరు మండలం లింగారెడ్డిపాలెంలో అధ్వానపు రహదారి(నాడు), లింగారెడ్డిపాలెంలో సీసీరహదారి నిర్మాణం (నేడు)

మండల పరిషత్ నిధులు స్వాహా

» షాపింగ్ కాంపెక్సు అద్దెలు కైంకర్యం చేసిన అధికారి



లక్షలాది రూపాయల మండల పరిషత్ నిధులను ఒక అధికారి దుర్వినియోగం చేశాడు. మండల పరిషత్ ఆధీనంలోని షాపింగ్ కాంప్లెక్సుల అద్దెలు వసూలు చేసిన అధికారి సొమ్మును మండల పరిషత్‌కు జమ చేయకుండ స్వాహా చేశాడు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటుగా క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిన జిల్లా ఉన్నతాధికారులు కైంకర్యం చేసిన సొమ్మును జమ చేయాల్సిందిగా బతిమాలుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కంచికచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కంచికచర్ల మండల పరిషత్‌కు కాకాని వెంకటరత్నం(కేవీఆర్) పేరు తో, నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) పేరుతో రెండు షాపింగ్ కాంప్లెక్సులున్నాయి. కేవీఆర్ కాంప్లెక్సులో 20 దుకాణాలు ఉండగా, ఎన్టీఆర్ కాంప్లెక్సులో ఎనిమిది దుకాణాలు ఉన్నాయి. దుకాణాదారులు కొద్దినెలల క్రితం వరకు ప్రతినెల అద్దెను మండల పరిషత్ కార్యాలయంలో చెల్లించి, రశీదు తీసుకునే వారు. అద్దెలకు సంబంధించి దుకాణాదారుల నుంచి వసూలైన సొమ్మును మరుసటి నెలలో తప్పనిసరిగా మండల పరిషత్ సాధారణ నిధులకు జమ చేయాలి. అయితే 2023లో జూన్, జూలై, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు వసూలైన అద్దెల సొమ్ము మండల పరిషత్ సాధారణ నిధులకు జమ కాలేదు. జూన్‌లో రూ.77,301, జూలైలో రూ.77,647, సెప్టెంబరులో రూ. 77,361, అక్టోబరులో రూ.59,219 మొత్తం రూ.2,91,528 మండల పరిషత్‌కు జమ కాలేదు. ప్రతి నెలా అద్దెలు వసూలు చేసిన అధి కారి, సొమ్ములు అందినట్టుగా దుకాణాదారులకు రశీదులు ఇచ్చాడు. ఆ సొమ్మును మండల పరిషత్ సాధారణ నిధులకు జమ చేయకుండా కైం కర్యం చేశాడని ఆరోపణలున్నాయి. కొద్ది నెలల క్రితం వరకు ఆ అధికారి, మం డల పరిషత్‌లో పెత్తనం చెలాయించడంతో అద్దె సొమ్ము దుర్వినియోగం వ్యవహారం ఎవరికీ తెలియదు. దీనికితోడు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి దుకా ణదారులు బ్యాంకు చలానా ద్వారా అద్దెలు చెల్లిస్తున్నారు. ఆ తర్వాత ఈవిష యం తెలిసినప్పటికీ బయటకు పొక్కకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మండల పరిషత్ అధికారులు, జిల్లా అధికారులకు తెలియజేసినట్టుగా తెలిసింది. సాధారణ నిధులకు జమ చేయాల్సిన అద్దె సొమ్ము రూ. 2,91,528 తక్షణమే జమ చేయాలని కొద్ది రోజుల క్రితం ఆ అధికారికి ఎంపీడీవో నోటీసు ఇచ్చారు. కానీ, అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సొమ్ము జమ చేయాలని కోరడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అధికారికి నోటీసు ఇచ్చాం

షాపింగ్ కాంప్లెక్సుల దుకాణాలకు సంబంధించిన అద్దె సొమ్ము కొంత మొత్తం మండల పరిషత్ సాధారణ నిధులకు జమ కాలేదు. అద్దె సొమ్ము జమ చేయకపోవడాన్ని జిల్లా పరిషత్ సీఈవో దృష్టికి తీసుకెళ్లాం. ఇందుకు బాధ్యుడైన ఆ అధికారికి ఇప్పటికే నోటీసు ఇచ్చాం.

-బీఎం లక్ష్మీకుమారి, ఎంపీడీవో



తన కుమారుడితో పతాకనిధికి విరాళం అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

పతాకనిధికి విరివిగా విరాళాలిద్దాం

» వీరజవాన్ల కుటుంబాలకు అండగా నిలుద్దాం

» ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపు

కృష్ణలంక, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, సాయుధ దళాల పతాకనిధికి విరివిగా విరాళాలు అందించేందుకు ముందుకు రావాలని ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని(ఫ్లాగ్ డే) పురస్కరించుకుని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తన కుమారుడితో కలిసి సాయుధ దళాల పతాకనిధికి ఆయన విరాళం అందించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి నుంచి పతకాన్ని అందుకున్నారు. పతాకనిధికి అందించే విరాళాలకు 80(జీ)(5)(6) ఆఫ్ ఇన్‌కంటాక్స్ యాక్ట్ 1961 ద్వారా ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కె.కల్యాణవీణ తెలిపారు. స్వచ్ఛందంగా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చే వారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి, ఎన్టీఆర్ జిల్లా అధికారి, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నెం.62067742138, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020899 ద్వారా నేరుగా తమ విరాళాలను అందించవచ్చని ఆమె తెలిపారు. మాజీ సైనికులు, సైనిక సంక్షేమ కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి సంకల్ప యాత్రికుడు

» రతన్‌టాటా ప్రేరణతో నానో కారులో ప్రయాణం

» తాడేపల్లికి విచ్చేసిన శాంతి యాత్రికుడు ఎస్ఎన్ సంకల్ప్

తాడేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతితో ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని.. యువత, విద్యార్థులు ప్రజల్లో మార్పు కోసంగా.. రతన్‌టాటా ప్రేరణతో.. నాగపూర్‌కు చెందిన ఎస్ఎన్ సంకల్ప్ భారతయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అక్టోబర్ 17న నాగపూర్‌లో నానో కారులో సంకల్పయాత్ర ప్రారంభం కాగా శనివారం తాడేపల్లికి చేరుకుంది. కుంచనపల్లి అరవింద హైస్కూల్ విద్యార్థులతో ముఖాముఖి అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో సంకల్ప్ యాత్రపై ముచ్చటించారు.

సంకల్పమిది..

మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన నేను 2009లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. మైత్రేయి గ్లోబల్ ఆన్‌లైన్ ఆర్ట్ అకాడమీ స్థాపించి ఫైన్‌ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను. ఆర్టిస్ట్‌గా వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా ఆధ్యాత్మిక సలహాదారుగా, రచయితగా, ఫైన్‌ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ దేశంలో విద్యార్థులు, యువత, ప్రజలు శాంతితో ఉంటే దేశ అభివృద్ధి సాధ్యమనే భావనతో భారత్‌యాత్ర చేపట్టాను. పారిశ్రామిక దిగ్గజమైనా నిత్యం పేదలు, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసిన రతన్ టాటా ప్రేరణతో ఆయన ప్రవేశపెట్టిన నానో కారులో శాంతి కోసం మంచి ప్రకృతి ఉండాలనే లక్ష్యంతో యాత్ర చేస్తున్నాను. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, శాంతి, ప్రకృతి, ఆరోగ్యం అంశాలపై అవగాహన కల్పిస్తూ యాత్ర సాగిస్తున్నాను.

యాత్ర ఎందుకంటే..

ప్రతి ఒక్కరూ శాంతితో, ప్రకృతిని నాశనం చేయకుండా, చెట్లను సంరక్షించాలి. కళలు, డ్రాయింగ్ ద్వారా మానవునికి కొంత ప్రశాంతత లభిస్తుంది. ధ్యానంతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. మానసిక ప్రశాంతత ఉంటే ప్రతి ఒక్కరి అభివృద్ధి సాధ్యం. కోపం, అశాంతి అభివృద్ధి నిరోధకాలు. యువతకు పీస్ ఆఫ్ మైండ్ ఉండాలి. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి. విద్యార్థులకు ఫైన్‌ఆర్ట్స్ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. డబ్బుతో ప్రశాంతతను కొనలేము. ఈ అంశాలపై విద్యార్థులను, ప్రజలను ప్రభావితం చేయాలనే తపనతో భారత యాత్రకు శ్రీకారం చుట్టాను. యాన్ ఆర్టిస్ట్ ట్రావెలింగ్ ఆలిండియా బై నానో కార్ ఫర్ పీస్, నేచర్, ఆర్ట్ అండ్ మెడిటేషన్ ట్యాగ్‌తో ప్రయాణం చేస్తున్నాను.



నానో కారుతో సంకల్ప్

టాటా జీవితం ఆదర్శం

ప్రజల కోసం తపన పడే ఏకైక మనసున్న పారిశ్రామికవేత్త రతన్ టాటా భావాలు, వ్యక్తిత్వం, నిజాయితీతో కూడిన జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం. అందుకే ఆయన అందుబాటులోకి తెచ్చిన నానో కారులోనే దేశాన్ని చుట్టి రావాలనే ప్రేరణ కలిగింది. ప్రయాణంలో రహదారి పక్కన ఉన్న పాఠశాలలు, పీహెచ్‌సీలు, రెస్ట్ ఏరియాల్లోనే కారులో విశ్రాంతి తీసుకుంటా. కారులోనే చిన్న గ్యాస్ సిలిండర్, స్టవ్ వంటపదార్థాలు పెట్టుకుని వండుకుని భోజనం చేస్తాను. ఆరు నెలలపాటు యాత్ర సాగుతుంది, ముంబాయి చేరికతో ముగుస్తుంది. పెయింటింగ్‌ల విక్రయం, బోధనల ద్వారా వచ్చే నగదును ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాను.



ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్

ఎస్‌హెజీ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం

ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు

మొగల్రాజపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) డైరెక్టర్ తేజ్‌భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రీనగర్‌లో శనివారం ఈ-కామర్స్ సంస్థలు ఏపీటీపీసీ, ఓఎన్‌డీసీ, మై స్టోర్, హోమ్ ట్రయాంగిల్‌తో మెప్మా వర్క్‌షాపు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త రావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ పర్యవేక్షణలో స్వయం సహాయ సంఘాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో 28,77,109 మంది పేద, నిరుపేద మహిళను సమీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అత్యున్నత స్థాయిలో వ్యాపారం చేస్తున్న సొసైటీ సభ్యులను గుర్తించి అధికారుల సమన్వయంతో పరిశ్రమలు ప్రారంభించేలా చూస్తామన్నారు. ఏపీటీపీసీ ప్రతినిధి శ్రీవల్లి, ఓఎన్‌డీసీ మైస్టోర్ ప్రతినిధి బ్లెస్సీనందం, హోమ్ ట్రయాంగిల్ ప్రతినిధి భూమిక, ఎంఎస్ఎంఈ నుంచి రవి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉషాకిరణ్, రాష్ట్ర మిషన్ మేనేజర్లు శ్రీనివాసులు, సాంకేతికనిపుణులు ప్రభావతి పాల్గొన్నారు.



ఫిబ్రవరి 8న నిర్వహించే లైవ్ షో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సింగర్ శ్రీరామ్, వేగా జ్యూవెల్లర్స్ అధినేత నవీన్

సింగర్ సిద్ శ్రీరామ్ లైవ్ షో

లబ్బీపేట, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సింగర్ సిద్ శ్రీరామ్ లైవ్ పర్ఫామెన్స్ షోను ఫిబ్రవరి 8వ తేదీన విజయవాడలో వేగా జ్యూవెలర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత నవీన్ తెలిపారు. బందర్‌రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం లైవ్ షో బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లైవ్ షో కోసం సంవత్సరం నుంచి శ్రేయస్ మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. లైవ్ షోలో నగరవాసులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. తాను తమిళం అయినా తెలుగులోనే హిట్స్ ఉన్నాయని, నువ్వుంటే నా జతగా సాంగ్ తన ఫేవరేట్ అని సింగర్ శ్రీరామ్ తెలిపారు. మ్యూజిక్ తన లైఫ్ అని, రామనుజం తన గురువని, 2019లో కర్ణాటకలో లైవ్ కాన్సెప్ట్ చేశానని ఆయన తెలిపారు. రొమాంటిక్ సాంగ్స్ చాలా పాడానని జానపద పాటలు ఎక్కువగా పాడాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. లైవ్ షో ఏర్పాటు చేస్తున్న వేగా జ్యూయలర్స్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. విజయవాడతో తనకు ఎంతో అనుబంధం ఉందని అందుకే షో చేస్తున్నట్లు తెలిపారు. శ్రేయస్ లైవ్ ఈవెంట్ ప్రతినిధి విపున్ పాల్గొన్నారు.

అమరావతి రైల్వే లైన్‌కు 667.96 ఎకరాలు అవసరం

» వడివడిగా భూ సేకరణకు అడుగులు

» ఎన్టీఆర్ జిల్లాలో 334.52 ఎకరాల సేకరణ ప్రక్రియ ప్రారంభం.. గుంటూరు జిల్లాలో 3343.44 ఎకరాలకు తాజాగా నోటిఫికేషన్

» రెండు జిల్లాల్లో కంచికచర్ల, వీరులపాడు, అమరావతి మండలాలలో 11 గ్రామాలలో భూముల సేకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి నూతన రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు 667.96 ఎకరాల భూములు అవసరం అవుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు, అమరావతి నుంచి పెదకూరపాడు, సత్తెనపల్లి నుంచి నరసారావుపేట వరకు మూడు కొత్త లైన్లు విస్తరిస్తున్నారు. ఇందులో మొదటిగా ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు 28 కిలోమీటర్ల లైన్ ఉంది. ఈ ప్రాజెక్టుకు భూ సేకరణ కోసం వడివడిగా అడుగులు పడుతున్నాయి. అమరావతి నూతన రైల్వే లైను ప్రాజెక్టుకు భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో 334.52 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ వెలువరించగా.. తాజాగా గుంటూరు జిల్లాలో 333.44 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్‌ను వెలువరించారు. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, వీరులపాడు మండలంలోనూ, గుంటూరు జిల్లాలో అమరావతి మండలంలో మొత్తం 11 గ్రామాల పరిధిలో భూ సేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో 72.45 ఎకరాలు, గొట్టుముక్కల గ్రామంలో 50.49 ఎకరాలు, వీరులపాడు మండలం పరిధిలో జుజ్జూరు గ్రామంలో 28.89 ఎకరాలు, గూడెం మాధవరం గ్రామంలో 7.71 ఎకరాలు, చెన్నారావుపాలెం గ్రామంలో 26.45 ఎకరాలు, పెద్దాపురం గ్రామంలో 50.82 ఎకరాలు, అల్లూరు గ్రామంలో 43.15 ఎకరాలు, నరసింహారావుపాలెం గ్రామంలో 17.44 ఎకరాల చొప్పున సేకరించే దిశగా రెవెన్యూ యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఇక గుంటూరు జిల్లా విషయానికి వస్తే అమరావతి మండలం పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో 7.31 ఎకరాలు, కర్లపూడి గ్రామంలో 232.94 ఎకరాలు, వైకుంఠపురంలో 93.19 ఎకరాల చొప్పున సేకరించేందుకు అక్కడి రెవెన్యూ యంత్రాంగం క్షేత్ర స్థాయిలో సన్నాహాలు చేస్తోంది. మరో మూడు నెలల్లో భూ సేకరణ ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

మరోసారి హైటెన్షన్

» విద్యుత్ వైర్ల ఏర్పాటుపై రైతుల ఆందోళన

» స్తంభాలపైకెక్కి పనులు నిలుపుదల చేయాలని డిమాండ్



హైటెన్షన్ విద్యుత్ స్తంభం పైకి ఎక్కి నిరసన తెలుపుతున్న రైతు

విజయవాడ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ బైపాస్ పనుల్లో భాగంగా జక్కంపూడి పంచాయతీ పరిధిలోని భూముల్లో విద్యుత్ హైటెన్షన్ స్థంభాల ఏర్పాటుపై రైతులు శనివారం మరోసారి ఆందోళనకు దిగారు. తమ భూముల్లో జరుగుతున్న పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన చేపట్టారు. కొందరు రైతులు భూములు పోతే తమకు చావే శరణ్యమని విద్యుత్ స్తంభాలు ఎక్కి పనులు ఆపకుంటే కిందకు దూకేస్తామని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వెనక్కి తగ్గని రైతులు ఇరవై నిమిషాల పాటు ఆందోళనను కొనసాగించారు. చివరకు సీఐ కొండలరావు నచ్చజెప్పి స్తంభం ఎక్కి అందోళనకు దిగిన గొడ్డలి రాము అనే రైతుతో పాటుగా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొంతసేపటి తరువాత నలుగురిని విడిచిపెట్టారు.



గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి స్వాగతం పలుకుతున్న ఎంపీ కేశినేని చిన్ని

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ఘనస్వాగతం

గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఈఈఎస్ఎల్ సహకారంతో రాష్ట్రంలో నిర్వహించిన ఊర్జావీర్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శనివారం విమానాశ్రయానికి విచ్చేసిన ఖట్టర్‌కు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఇంధనశాఖ రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. ఎంపీ చిన్ని తిరుమల తిరుపతి ప్రసాదం, వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించా రు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి రోడ్డుమార్గాన విజయవాడ వెళ్లారు.

రూ.రెండున్నర కోట్లతో తిరుపతమ్మ

దేవస్థానంలో అభివృద్ధి పనులు

పెనుగంచిప్రోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు దేవదాయ శాఖ కమిషనర్ ఆమోదానికి పంపుతూ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం అమ్మవారి దేవస్థానం వద్ద ధర్మకర్తల మండలి ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. పలు అర్జిత సేవలు నూతనంగా ప్రవేశపెట్టేందుకు కమిషన ర్ ఆమోదానికి పంపారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీ ఎస్ కిషోర్‌కుమార్, ధర్మకర్తలమండలి సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో పట్టభద్రుల ఎమ్మెల్సీ

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు

కృష్ణలంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి లోని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను నవంబరు 23న గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలోని అన్ని పోలింగ్ కేం ద్రాల్లో ప్రచురించామని గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి తరపున షేక్ ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 6 వరకు వచ్చిన క్లయిమ్‌లను విచారించి అర్హత కలిగిన అర్జీదారులను డ్రాఫ్ట్ జాబితానందు ఓటర్లుగా చేర్చామని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి గుంటూరు, కృష్ణా, గుంటూరు నియోజకవర్గంలోని అన్ని జిల్లాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలను ఫాం 7, సవరణకు ఫాం 8, ఓటు నమోదుకు ఫాం 18తో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు డిసెంబరు 9 చివరి తేదీ అన్నారు. 2021 నవంబరు 1లోపు డిగ్రీ పొంది ఓటరు లిస్టులో నమోదవని వారు వినియోగించుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	101,109, 120
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠినమైన చర్యలు తప్పవని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర హెచ్చరించారు. కమిషనర్ 12వ డివిజన్ అయ్యప్పనగర్‌లోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ పర్యటనలో ట్రేడ్ లైసెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయగా లైసెన్స్ లేకపోవడంతో వారిని వెంటనే లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్ల పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



● ఉడ్‌పేట, మీసాల వారి వీధిలో స్ట్రీట్ లైట్ పోల్ నెంబరు 7/89/102 లైటు గత మూడు నెలల నుంచి వెలగడం లేదు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

- జికే .రాణి, మీసాలవారి వీధి, ఉడ్‌పేట

● సోమవారం మరమ్మతులు చేయిస్తాం. ఈ రోజు సిబ్బందిని పంపించి చూపించాం. దానికి కావాల్సిన విడి భాగాలు సోమవారం తీసుకొచ్చి బాగుచేయిస్తాం.

- ప్రభాకర్, ఏఈ, స్ట్రీట్ లైట్స్ విభాగం, వీఎంసీ

బాధితురాలి వైద్యచికిత్సకు రూ. లక్ష సాయం

సొంత నిధులు అందజేసిన గద్దె అనురాధ, క్రాంతికుమార్



బాధితురాలి తల్లిదండ్రులకు లక్ష రూపాయలను అందజేస్తున్న గద్దె అనురాధ, గద్దె క్రాంతికుమార్

భారతీనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి నిధులను మంజూరు చేయించి వారిని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదుకుంటారని కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు.

ఇటీవల ప్రమాదానికి గురై రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తూర్పు పరిధి 16వ డివిజన్ రామలింగేశ్వనగర్‌కు చెందిన తోట గోపి కుమార్తె హేమ హర్షితను గద్దె అనురాధ, టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమారు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా హేమహర్షిత ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. హేమహర్షిత వైద్య చికిత్స కోసం సొంత నిధుల నుంచి రూ.లక్షను తల్లిదండ్రులకు వారు అందజేశారు. గద్దె అనురాధ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే గద్దె నేనున్నానంటూ ముందుకు వచ్చి సాయం అందిస్తుంటారని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్ఫూర్తితో అసిస్టెంట్ ప్రొఫెసర్ రేఖారాణి హేమహర్షిత వైద్య ఖర్చులకు రూ.10వేలు సాయం అందించడం అభినందనీయమన్నారు. దాడి సుబ్బారావు, గద్దె రమేష్, గద్దె హేమన్స్ రామ కృష్ణ, వాణి, కవిత పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

- టీడీపీ నాయకులు బెజవాడ నజీర్

పటమట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని టీడీపీ నాయకుడు బెజవాడ నజీర్ పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ కబ్జాకు గురైన బాధితులకు న్యాయం చేకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు జనవరి 8 వరకు అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో నిర్వహిస్తారని, భూ సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ సదస్సును వినియోగించుకోవాలన్నారు.



పోలీసు శాఖ ముద్రించిన ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరు మధు తదితరులు, బీఎస్ఆర్‌కేలో మాట్లాడుతున్న డీసీపీ గౌతమీ శాలిని, తమిరి మల్లికార్జునరావు పాఠశాలలో ..

పిల్లలకు బంగారు బాటే...కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ● తూర్పులో ఉత్సాహంగా సాగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు

కృష్ణలంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల త్యాగాల ఫలితమే పిల్లల భవిష్యత్తు అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. పిల్లలకు బంగారు బాటే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని ఆయన పేర్కొన్నారు. శనివారం ఉదయం తూర్పు పరిధిలోని కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగర పాలక ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ స్కూల్, వీఎం రంగా బాలికల ఉన్నత పాఠశాల, సీకే రెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఈ ఆత్మీయ సమావేశాల్లో గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారు కావాలంటే చదువు ద్వారానే సాధ్యమన్నారు. పిల్లలను బడికి పంపడమే కాకుండా వారి నడవడికను కూడా తల్లిదండ్రులు గమనిస్తూ వుండాలని తెలిపారు. పిల్లలు పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపాలనే ఉద్దేశ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని, యూనిఫాం, పుస్తకాలను ప్రభుత్వమే అందజేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి మధుసూదనరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం ఈ చదువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కృష్ణలంక ఉన్నత పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు గురించి ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే గద్దె దృష్టికి తీసుకొస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తారని వల్లూరి మధు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలని మధు కోరారు. అనంతరం పోలీసు శాఖ ముద్రించిన 'మేమంతా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వుంటాం' అనే ప్లకార్డులను పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, రామారావు, ఏసీపీ ఉడతా బంగార్రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, శేఖర్, రేషమ్మ, అమరావతి వాకర్ల క్లబ్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక, టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



డీవీజీకేఏఎంసీ నగర పాలక సంస్థ పాఠశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు



మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే పాఠశాలలో విద్యార్థుల విన్యాసాలు

బీఎస్ఆర్‌కే పాఠశాలలో ...

మొగల్రాజపురం: మొగల్రాజపురం బోయపాటి శివరామకృష్ణయ్య ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ ఈవెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ గౌతమి శాలిని సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, వాటి నుంచి ఎలా రక్షణ పొందాలనే అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో 400మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా పేరెంట్స్‌కు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి విద్యార్థుల ప్రగతిని వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ నల్లూరి ఉషారాణి , ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఎస్. శైలజ, సంతోష్‌బాబు, ఈస్ట్ ఎంఈవో ఎం.రాజశేఖర్, పాఠశాలలను దత్తత తీసుకున్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు (అమ్మ) గారపాటి సతీష్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, వడ్లమూడి వెంకటేశ్వర రావు, ప్రధానోపాధ్యాయులు కె. నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి: మాచవరంలోని తమిరి మల్లికార్జునరావు చంద్రమతి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థుల సామర్థ్యం కార్డులను అందించారు. నేరపరిశోధన అధికారిణి దుర్గా భవాని డ్రగ్స్ నిషేధంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం కుమార్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ జి.సుకన్య, పాల్గొన్నారు.

భారతీనగర్: గుణదల ఈఎస్ఐ రోడ్డులోని దాసరి వెంకట గిరిధరకుమార్, అవంతి నగర పాలక సంస్థ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి సమక్షంలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, కమిషనర్ ధ్యానచంద్ర, ఎమ్మెల్యే గద్దె, తదితరులు

క్రీడా ప్రాంగణాలను అభివృద్ధిపరచండి

ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి పరచాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ విజయవాడ మునిసిపల్ అధికారులకు సూచించారు. శనివారం విజయవాడ నగపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆయన తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, నగర కమిషనర్ ధ్యానచంద్ర, ముఖ్య అధికారులతో కలిసి తూర్పు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నగరంలోని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధిపరచి, ప్రతి నియోజకవర్గంలో కనీసం రెండు ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. నగర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కొండ ప్రాంతంలో ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. కృష్ణలంక కరకట్ట, వీధి వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేలు సూచించిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబూ శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మంత్రి మనోహర్ లాల్‌ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పి.నారాయణ

మర్యాదపూర్వక కలయిక

భారతీనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈఈ ఎస్ఎల్ సహకారంతో రాష్ట్రంలో నిర్వహించిన ఊర్జావీర్ కార్యక్రమం ప్రారంభించేందుకు నగరానికి వచ్చిన కేంద్ర ఇంధన, గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్‌ఖట్టర్‌ను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన భారతీనగర్‌లోని నోవాటెల్‌లో మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను వివరించారు.

కళావేదికపై భక్తి సంగీత విభావరి

వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ కళాపీఠం ఆధ్వర్యంలో మధిర రోజా ప్రసన్నత ఆధ్వర్యంలోని 11 మంది శిష్య బృందం భక్తి సంగీత విభావరిని ప్రదర్శించారు. దాదాపు 21 కీర్తనలు ఆలపించి హర్షధ్వానాలు అందుకున్నారు. రత్నకుమారి, విజయలక్ష్మి, మాధవి, రమణి, మధిర సుధా ప్రశాంతి, సాయి ప్రసన్నలు గాత్ర సహకారం అందించారు. ప్రసన్నత విజిల్ సింగర్‌గా, వీరభద్రరావు కీ బోర్డు వాయిద్యకారుడుగా, చిట్టిబాబు తబలా వాద్యకారుడిగా, శ్రీనివాస్ ట్రాక్స్ ద్వారా సహకారం అందించారు. ఈఓ కె.ఎస్.రామరావు కళాకారులను అభినందించి, ప్రశంసా పత్రాలు అందచేశారు. చెరువు ఆదినారాయణ వేదిక పై యాంకర్‌గా వ్యవహరించారు.

తుమ్మల సత్య మృతి విచారకరం: సీఎం

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐ-టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, పార్టీ వీరాభిమాని తుమ్మల సత్య మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు.

తూర్పు నియోజకవర్గానికి చెందిన సత్య పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని గుర్తు చేశారు. సోషల్ మీడియాలో సత్య యాక్టీవ్‌గా ఉండేవారని పేర్కొన్నారు. సత్య కుటుంబసభ్యులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సండే స్పెషల్

చరిత్రకు సజీవసాక్ష్యం

చల్లపల్లి కోట

చల్లపల్లి.. ఈ పేరు చెబితే గుర్తుకొచ్చేది చల్లపల్లి రాజావారి కోట. నాలుగున్నర శతాబ్దాల చరిత్రకు సజీవసాక్ష్యంగా రాజా వారి రాచరికానికి చిహ్నంగా నిలుస్తోంది. చల్లపల్లి వచ్చిన వారెవరైనా కోట చూసి వెళ్లాల్సిందే. చల్లపల్లి రాజాగా పేరొందిన శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ రాచరిక ప్రభువుగానే కాకుండా, ప్రజాప్రతినిధిగానూ ప్రజలకు సేవలందించారు. పర్యాటకులకు ఎంతగానో ఆకట్టుకునే చల్లపల్లి రాజా వారి కోట, వారి చరిత్రపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి - చల్లపల్లి

● దేవరకోట సంస్థానానికి రాజధానిగా చల్లపల్లి ● పర్యాటకులను ఆకర్షించే రాజసౌధం
● జడ్పీ చైర్మన్‌గా, రాష్ట్రమంత్రిగా చల్లపల్లి రాజా ● నేటికీ కోటలో మోగే కంచు గంట

పర్యాటక ఆకర్షణ

చల్లపల్లి కోటకు మూడున్నర శతాబ్దాల చరిత్ర ఉన్నట్టు చెబుతారు. ఈ కోట పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. సుదూర ప్రాంతాలు, దివి ప్రాంతంలోని పుణ్యక్షేత్రాలను చూసేందుకు వచ్చినవారు చల్లపల్లి వచ్చి కోటను చూసి వెళుతుంటారు. సుమారు 20 ఎకరాల్లో ఉండే కోట, కోట బురుజులు, పచ్చదనానికి, ప్రశాంతతకు చిహ్నంగా ఉండే అశోక వృక్షాలు, విశాలమైన ఆవరణ, పూర్వకాలం నాటి జాడీలు, నాటి శిల్పసంపద, ఎత్తైన ప్రధాన ద్వారం సందర్శకులకు ఆకర్షిస్తుంది. చల్లపల్లి రాజా మనుమడు యార్లగడ్డ రామేశ్వరప్రసాద్ (అంకినీడు ప్రసాద్ కుమారుడు) కోటను గతంలో అభివృద్ధి చేశారు. కోట పైఅంతస్తులో దూలాలు దెబ్బతినటం, ఆర్చ్‌లు పాడవటంతో వాటికి మరమ్మతులు చేయించి సుందర రూపు తీసుకొచ్చారు. ప్రస్తుతం కోటకు ఇంకా మరమ్మతులు చేయాల్సి ఉంది. కోటను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే దివిసీమ పర్యాటకంగా అభివృద్ధి చెంది మరింతగా సందర్శకులు పెరిగే అవకాశం ఉంది.


చల్లపల్లి రాజా కోట ప్రవేశ ద్వారం

కృష్ణా మండలంలోని జమిందారీ సంస్థానాల్లో అతిపురాతనమైన వాటిలో దేవరకోట ఒకటి. చల్లపల్లి రాజధానిగా జమిందార్లు పరిపాలన చేపట్టారు. 190 చదరపు మైళ్ల జమీ వైశాల్యంతో ఉన్న చల్లపల్లి సంస్థానానికి 448ఏళ్ల చరిత్ర ఉంది. దీని పరిధిలో 66 గ్రామాలు, రెండు అగ్రహారాలు, పాలేలు, శివార్లు కలుపుకుని సుమారు 100 గ్రామాలకు పైనే ఉండేవి.


రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న చల్లపల్లి రాజా శ్రీమంతు యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహదూర్ (పాతచిత్రం)

రాచరికానికి 'ప్రజాప్రతినిధి'

చల్లపల్లి రాజాగా పేరొందిన శ్రీమంతు యార్లగడ్డ శివరామప్రసాద్ బహదూర్ రాచరికంలోనే కాక ప్రజాస్వామ్యంలోనూ రాణించారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలందించి చిరస్థాయిగా నిలిచారు. కృష్ణాజిల్లా పరిషత్‌కు తొలి చైర్మన్‌గా వ్యవహరించారు. అవనిగడ్డ ద్విశాసనసభకు ఎన్నికైన చల్లపల్లి రాజా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. చల్లపల్లి రాజాకు ముగ్గురు కుమారులు మల్లికార్జున ప్రసాద్, అంకినీడుప్రసాద్, పద్మనాభప్రసాద్, ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో కుమారుడు అంకినీడు ప్రసాద్ పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారు. దేవరకోట సంస్థానంలో చిట్టచివరగా పట్టాభిషిక్తుడైన రాజు శివరామప్రసాద్ బహదూర్ మాత్రమే.

చల్లపల్లి రాజా పేరిట స్థాపించిన శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ జూనియర్ కళాశాల ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దింది. దివిసీమలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గా నాగేశ్వర క్షేత్రం, శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయాలకు చల్లపల్లి రాజా వంశీయులు వంశపారంపర్య ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. మచిలీపట్నంలో శివగంగ అమ్మవారి ఆలయానికి చల్లపల్లి రాజా వంశీయులే ధర్మకర్తలు. వీటితోపాటు యార్లగడ్డలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయం సైతం ఎస్టేట్ ఆలయాల పరిధిలో ఉంది. చల్లపల్లి రాజా వంశీయులు సంగీత, సాహిత్యాభివృద్ధికి విశేష కృషిచేశారు. ప్రముఖ సంగీత విద్వాంసులు పారుపల్లి రామకృష్ణయ్య చల్లపల్లి ఆస్థాన పండితుడిగా ఉండేవారు. చల్లపల్లి రాజా వంశీయులు జగజ్జనని అమ్మవారిని పూజిస్తారు. కోటలో నేటికీ అమ్మవారికి నిత్యపూజలు జరుగుతుంటాయి. గతంలో పర్వదినాల్లో ప్రజలు అమ్మవారిని దర్శించేవారు. దీపావళి, దసరా సమయాల్లో కోటలో అమ్మవారికి పూజలు చేస్తుంటారు. ఆ ప్రదేశంలో ప్రతిరోజూ ముగ్గువేసి ఖాళీగా ఉంచుతారు. విజయదశమికి ఆయుధపూజ చేయటం నేటికీ ఆనవాయితీగా వస్తోంది.


చల్లపల్లి వంశీయుల వంశవృక్షం


సుందరంగా కోట లోపలి భాగం



ప్రతి గంటా మోగంగా..

చల్లపల్లి కోటలో కంచు గంట ప్రతి గంటకూ మోగుతూనే ఉంటుంది. పూర్వకాలంలో ప్రజలకు సమయాన్ని తెలిపేందుకు కంచుతో తయారుచేసిన గంటలను ఏర్పాటుచేశారు. గడియారాలు అందుబాటులో లేని కాలంలో కోటలో గంటల సమయం ఆధారంగా ప్రతి నిత్యం దినచర్య ప్రారంభమయ్యేదని చెబుతుంటారు. పూర్వం కోటలో 4 గంటలు మోగుతుండేవి. కోటలో ఒకచోట, కోట ఆవరణ కింద భాగంలో, ఉత్తర, దక్షిణ దర్వాజాల వద్ద గంటలు మోగిస్తూ ఉండేవారు. తొలుత కోటలో గంట మోగించిన తర్వాత మిగిలిన చోట్ల గంటలు మోగించేవారు. శబ్దకాలుష్యం తక్కువగా ఉన్న ఆ రోజుల్లో కోట గంట చుట్టు పక్కల గ్రామాలకు సైతం వినిపించేదని చెబుతారు. కోట గంట ద్వారా సమయం తెలుసుకోవాల్సిన అవసరం లేకున్నా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటికీ 2 చోట్ల గంట మోగిస్తూనే ఉన్నారు. కోట ఆవరణలో ఒకచోట, దక్షిణంవైపు ప్రధాన ప్రవేశద్వారం వద్ద మరో గంట మోగిస్తున్నారు.

టెండర్ల రద్దు వెనుక
గూడుపుఠాణి

● నచ్చిన కాంట్రాక్టర్లు దొరకలేదా? ● ఎమ్మెల్యేల ఒత్తిడా?
● కొన్ని తెరిచి, పూర్తిగా రద్దు చేసిన డ్రైనేజీ అధికారులు

ఆంధ్రజ్యోతి - గుడివాడ: డివిజన్ పరిధిలోని 4 సెక్షన్లలో రూ.5.74 కోట్ల వ్యయంతో 29 పనులను చేపట్టేందుకు గత నవంబరు 11న టెండర్లు పిలిచి 25న తెరిచేందుకు సన్నాహాలు చేపట్టారు. టెక్నిక ల్ సమస్య కారణంగా డిసెంబరు 2 వరకు టెండరు దాఖలకు సమయాన్ని పొడిగించారు. ఐదేళ్ల తరువాత భారీగా రూ.కోట్ల పనులు చేపడుతుండటంతో కూటమి నేతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఒక్కో పనికి సుమారుగా 10 వరకు టెండర్లు దాఖలైనట్లు సమాచారం. ఈ క్ర మంలో 4న సాయంత్రం అధికారులు హడావుడిగా కొన్ని టెండర్లు తెరిచారు. ముందస్తు సమాచారం లేకుండానే శనివారం టెండర్లన్నీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో టెండరుదారులు అవాక్కయ్యారు.

డ్రైనేజీ శాఖలో కోట్లాది రూపాయల వ్యయంతో పనులు చేపట్టడంతో కూటమి నేతల కన్నుపడింది. తమకు అనుకూలమైన వారికి టెండర్లు దక్కేందుకే ఈ ప్రక్రియను రద్దు చేస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్లను రద్దు చేయించారనే వదంతి వినపిస్తోంది.

టెక్నికల్ సమస్యతో వాయిదా వేశాం: డ్రైనేజీ ఈఈ గోపీనాథ్

టెండర్ల ప్రక్రియలో టెక్నికల్ సమస్య కారణంగా రద్దు చేయలేదని, కేవలం వాయిదా వేశామని డ్రైనేజీ ఈఈ గోపీనాథ్ తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆప్షన్-4కే ఓటు

(5వ పేజీ తరువాయి)

సీఆర్‌డీఏ అధికారులు ప్రజాభిప్రాయాన్ని కోరిన సంగతి తెలిసిందే. దీనికి వారం గడువు నిర్దేశించారు. గడువు పూర్తి కావటంతో ప్రజాభిప్రాయాన్ని సీఆర్‌డీఏ అధికారులు శనివారం వెల్లడించారు. మొత్తం 9,756 మంది డిజైన్ల ఎంపికలో పాల్గొన్నారు. ఆప్షన్-4 డిజైన్‌కే అత్యధికంగా 3,354 మంది ఓటు వేశారు. పోలైన మొత్తం ఓట్లలో 34.36 శాతం మేర ఆప్షన్-4కే వచ్చాయి. ఆప్షన్-10 డిజైన్ రెండో స్థానంలో నిలిచింది. ఈ డిజైన్‌కు 3,279 ఓట్లు.. అంటే 33.61 శాతం ఓట్లు వచ్చాయి. ఇక ఆప్షన్-8కు 1,669 ఓట్లు రాగా, మూడో స్థానంలో నిలిచింది.

కబ్జాను దాచేసి.. అక్రమ కట్టడం

(5వ పేజీ తరువాయి)

వారి వద్ద ఉన్న పత్రాలను మాత్రమే పరిశీలించి వారి స్థలమేనంటూ నివేదిక ఇచ్చారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించడం కానీ, వీఎంసీ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించడం కానీ చేయలేదు. అధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ప్రస్తుతం ఆ స్థలంలో భారీ నిర్మాణాలు జరుగుతున్నాయి. బీఆర్టీఎస్ రోడ్డు పక్కనే ఉన్న ఈ స్థలానికి మూడువైపులా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. ఇక్కడ చదరపు గజం సుమారు రూ.2 లక్షలపైనే ఉంటుంది.

ఆ స్థలం ప్రభుత్వానిదే..

ఫుడ్ జంక్షన్ సమీపంలో కబ్జాకు గురైన 500 గజాల స్థలం ప్రభుత్వానిదే. ఆ స్థలాన్ని పేదలకు పంచాలని సీపీఎం తరపున కొన్నేళ్లుగా కోరుతున్నాం. కానీ, కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని కబ్జాచేసి, నకిలీ పత్రాలు సృష్టించి క్రయవిక్రయాలు జరిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సుమారు రూ.10 కోట్ల విలువైన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాం.

- కొండలరావు, సీపీఎం నాయకుడు

మద్యం షాపులకు ఝలక్

(5వ పేజీ తరువాయి)

ఐదు షాపుల యజమానులపై చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

బయటి వ్యక్తుల చేతుల్లోకి సరుకు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం షాపుల కేటాయింపు పూర్తయ్యాక ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు మొదలుపెట్టారు. ఇందులో 5 మద్యం షాపులపై కేసులు నమోదు చేశారు. వీటిలో ఎన్టీఆర్ జిల్లాలో 2, కృష్ణాజిల్లాలో 3 షాపులున్నాయి. వీటి నుంచి మద్యం సరుకు వెనుక ద్వారం నుంచి రహస్యంగా బయటకు వెళ్తున్నట్టు గుర్తించారు. దీన్ని రహస్య ప్రదేశాల్లో విక్రయిస్తుండగా, సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఆ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వాటిపై ఉన్న హోలోగ్రామ్‌లను పరిశీలించగా, అసలు విషయం బయటపడింది. విజయవాడలో ఓ షాపు, నందిగామలో మరో షాపు నుంచి మద్యం సరుకును బయటి వ్యక్తులకు పంపించినట్టు తెలిసింది. అలాగే, గన్నవరం మండలంలో ఒక షాపు, మచిలీపట్నంలో రెండు షాపుల్లోనూ ఇలాగే జరిగిందని గుర్తించారు. బెల్టు షాపులు నిర్వహించినా, మద్యం దుకాణాల్లో సరుకును బయట వ్యక్తులకు విక్రయించినా రూ.5 లక్షలు జరిమానా విధించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. మొదటిసారి పట్టుబడితేనే ఈ జరిమానా విధిస్తారు. రెండోసారి అయితే షాపు లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ చర్యలను ఎక్సైజ్ శాఖ కమిషనర్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఐదు షాపులపై చర్యలు తీసుకోవాలని సిద్ధం చేసిన ప్రతిపాదనలను త్వరలో కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.

అక్రమార్కులకు అధికారుల అండ!

● అసోసియేషన్ కార్యాలయానికి వేసిన సీల్ తొలగింపు ● ఎంపీ సూచనల మేరకే తొలగించామన్న వీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్



కార్పొరేషన్ అధికారులు వేసిన సీలును తొలగించిన భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం, తాళం తీసి ఉన్న భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం

విద్యాధరపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలు రోడ్డు పక్కన పది గజాల స్థలం ఆక్రమించుకుంటే నానా హడావుడి చేసే అధికారులు రూ.కోట్లాది విలువైన కార్పొరేషన్ స్థలంలో అనధికారికంగా అసోసియేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి అనధికారికంగా రుసుము వసూలు చేస్తున్న వారికి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు కొమ్ముకాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమదారులను అడ్డుకోవాల్సిన కార్పొరేషన్ అధికారులే వారికి అండగా ఉంటూ కార్పొరేషన్ ఆదాయాన్ని కొల్లగొడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవానీపురం లారీస్టాండ్ ప్రాంగణంలో వైసీపీకి చెందిన కొందరు నేతలు అనధికారికంగా భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో అయిదేళ్ల క్రితం కార్యాలయం ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా వాహనాలు నిలిపినందుకు భారీ ఎత్తున రుసుము వసూలు చేస్తున్నారు. ఎస్టేట్ అధికారులు.. ఆక్రమణదారులతో లాలూచీ పడి వారి నుంచి ముడుపులు దండుకుంటూ పట్టించుకోవటం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో భవానీపురం లారీస్టాండ్‌లో అక్రమ వసూళ్ల దందా పేరుతో కథనం ప్రచురణ అయింది. దీనిపై స్పందించిన మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు అసోసియేషన్ కార్యాలయానికి తాళం వేసి సీలు వేశారు. దీంతో ఆక్రమణదారులు మళ్లీ కార్యాలయాన్ని తీయాలని గట్టి ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎంపీ కేశినేని శివనాథ్, పలువురు ఎన్డీయే నేతలను కలిసి మంతనాలు చేశారు. వారు కూడా ఆక్రమణదారులను మందలించి కార్పొరేషన్‌కు రుసుం కట్టాలంటూ తేల్చిచెప్పడంతో పాటు వేరేచోట స్థలం చూసుకోమని చెప్పారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలకు పెద్దమొత్తంలో ముడుపులు ఆశ చూపించినా ఫలించలేదు. మరోసారి వారు ఎంపీని కలిసి వేడుకోవడంతో పూర్తి వివరాలు తెలుసుకున్న ఎంపీ తాత్కాలికంగా కార్యాలయం తీసినప్పటికీ కార్పొరేషన్ నిర్ణయించిన రుసుం చెల్లించాలని, అలాగే వేరే ప్రాంతానికి తరలించేందుకు స్థలాలు చూసుకోవాలని తేల్చిచెప్పారు. కాగా వీఎంసీ కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన ఎంపీని మళ్లీ పలువురు ఆక్రమణదారులు కలిసి అసోసియేషన్ కార్యాలయాన్ని ఓపెన్ చేయించాలని వేడుకున్నారు. దీంతో ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి అసోసియేషన్ కార్యాలయానికి వేసిన సీలును తొలగించమని ఎస్టేట్ విభాగం అధికారి శ్రీనివాస్‌కు సూచించినట్టు తెలిసింది. దీంతో కార్యాలయానికి వేసిన సీలును తొలగించారు.

ఎంపీ సూచనల మేరకే సీలు తొలగించాం
శ్రీనివాసరావు, వీఎంసీ ఎస్టేట్ విభాగం అధికారి

లారీ స్టాండ్ ప్రాంగణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి వేసిన సీలును విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) సూచనల మేరకే తొలగించాం. కార్యాలయాన్ని పూర్తిగా తొలగించాలని ఎంపీని కోరాం.

విజయమ్మకు వైసీపీ పగ్గాలివ్వమని విజయసాయి సలహా ఇవ్వాలి: వాసిరెడ్డి

వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిని మార్చాలని సలహా ఇస్తున్న విజయసాయి రెడ్డి ముందు తన పార్టీని చక్కదిద్దుకోవటానికి విజయమ్మకు వైసీపీ పగ్గాలు అప్పగించాలంటూ జగన్‌కు సలహా ఇవ్వాలని వాసిరెడ్డి పద్మ అన్నారు. శనివారం నగరంలో విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో విజయసాయిరెడ్డి చిల్లర రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. ఇతర పార్టీలకు సలహా ఇచ్చే ముందు ప్రజా నమ్మకం కోల్పోయిన జగన్ పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని విజయమ్మకు పార్టీ పగ్గాలు అప్పచెప్పాలని విజయసాయిరెడ్డి జగన్‌కు సలహా ఇస్తే బాగుంటుందన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి స్కీమ్ వెనుక పెద్ద స్కామ్ నడిపినట్లు ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. వీటిపై మాట్లాడే శక్తి లేని విజయసాయిరెడ్డి ముఖ్యమంత్రి పదవిని వివాదం చేయటానికి అత్యుత్సాహం చూపుతున్నాడన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్





వేర్వేరు సదస్సుల్లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

పటమట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలబెడతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు స్థాయి పెంచేలా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, అందుకోసమే తన సొంత నిధులతో ఎన్టీఆర్ జిల్లాలో 147 ప్రభుత్వ పాఠశాలలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 8 క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్లను త్వరలోనే అందజేయనున్నట్టు వివరించారు. క్రీడా ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నవారు పాఠశాలల అభివృద్ధికి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. డీఈవో సుబ్బారావు, హెచ్‌ఎం మురళీకృష్ణ, జిల్లా వైద్యాధికారి సుహాసిని, పాఠశాల సెక్రటరీ రాజ్యలక్ష్మితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రభుత్వ బడుల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు: కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ రూరల్: ప్రభుత్వ బడుల్లో ఉన్నతస్థాయి ప్రమాణాలతో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, ఇకపై ప్రభుత్వ బడుల విద్యార్థులు అద్భుతాలు సాధిస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ హైస్కూల్‌లో శనివారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యాబోధనలో మౌలిక సదుపాయాలు, భోజన పథకం గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల రెడ్డి, రూరల్ మండల తహసీల్దార్ బి. సుగుణ పాల్గొన్నారు.


షష్టి సందర్భంగా దుర్గగుడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణంలో స్వామివారికి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

దుర్గగుడిలో వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్య కల్యాణం

వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ షష్టి తిథిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంగా శనివారం దుర్గగుడిలో వల్లీ-దేవసేన-సుబ్రహ్మణ్యం కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా, వేదవిహితంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో ఉపాలయంగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని ఉత్సవ మూర్తులను పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెలుగా అలంకరించి తరువాత వేదికపై వివిధ ఉపచారాలు నిర్వహించి, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ ప్రక్రియను అర్చకులు నిర్వహించారు. భక్తులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈవో రామారావు, ఇంకా పలువురు పాల్గొన్నారు.


కృష్ణవేణి సంగీత నీరాజనంలో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

వీనుల విందుగా పంచరత్న కీర్తనలు

● దుర్గాఘాట్‌లో కృష్ణవేణి సంగీత నీరాజనం

వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి సంగీత నీరాజనం ఉత్సవం శనివారం దుర్గాఘాట్‌లో ప్రారంభమైంది. సీనియర్ సంగీతజ్ఞులు మల్లాది సూరిబాబు, మల్లాది శ్రీరాంప్రసాద్, మల్లాది రవికుమార్, మోదుమూడి సుధాకర్, కోపూరి గౌరినాథ్, కోపూరి గాయత్రి, విష్ణుబొట్ల కృష్ణవేణి, మొల్లాది కార్తీక త్రివేణి, నరసమ్మ, తదితర బృందం, మృదంగ విద్వాంసులు, వయోలిన్ విద్వాంసులు పాల్గొన్నారు. తమ అద్భుత గాత్రంతో పంచరత్న కీర్తనలను హృద్యంగా ఆలపించారు. వారి గాత్ర మధురిమలతో కృష్ణాతీరం ఆనంద సాగరంలో తేలియాడింది. అక్కడ గానామృత సహిత సుగంధ కలువలు విరబూశాయి. సుమారు 25మందికి పైగా త్యాగరాజ పంచరత్న కీర్తనలను తమదైన శైలిలో పాడి అలరించారు. కర్ణాటక సంగీత గానామృతం వివిధ రాగాల్లో, పల్లవుల్లో ప్రవహించింది. దుర్గగుడి ఈవో రామారావు పరిచయ వ్యాఖ్యలు చేస్తూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. చక్కని వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం అందరి హృదయాలను హత్తుకుంటుందన్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు తొలుత దుర్గగుడికి వెళ్లి అక్కడ దేవీ కృతులను ఆలపించి, దుర్గాదేవికి గాన నీరాజనం సమర్పించి, మళ్లీ మహోత్సవంలో భాగంగా కీర్తనలను ఆలపించనున్నారు. ఈ కృష్ణవేణి సంగీత నీరాజన ఉత్సవం భారతదేశ వైవిధ్య సాంస్కృతిక వారసత్వానికి ఘనమైన వేదికని సంప్రదాయ కళల అభివృద్ధికి దోహదం చేస్తుందని పర్యాటక మంత్రిత్వ శాఖ తెలిపింది.

అమరావతి ఐఆర్ఆర్ ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్
ఆర్ఎఫ్‌పీ గడువు పొడిగింపు

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)కు సంబంధించి ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ మంచి మోడల్‌ను ఇచ్చేందుకు వీలుగా ఆర్ఎఫ్‌పీ విడుదల చేసిన సీఆర్‌డీఏ అధికారులు మరోమారు గడువును పెంచారు. బిడ్డర్ల నుంచి సాంకేతికపరమైన అంశాలపై సందేహాలు వ్యక్తమైన నేపథ్యంలో గడువును డిసెంబరు 20 వరకు పొడిగించారు.

రేపు ఎన్టీఆర్ వర్సిటీ అథ్లెట్స్ టీమ్‌ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో పురుషుల, మహిళా అథ్లెట్ టీమ్‌ల ఎంపికలను ఈ నెల 9న ఉదయం 9 గంటలకు చినకాకానీ ఎన్ఆర్ఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగే ఆలిండియా వర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. మెడికల్ కళాశాలలు, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని కాలేజీలు, బీఎన్‌వైఎ, ఫిజియోథెరపీ వంటి అనుబంధ కాలేజీలు ఎన్టీఆర్ వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్‌కు ఆ రోజు ఎన్ఆర్ఐ కళాశాలలో రిపోర్టు చేయాలని త్రిమూర్తి పేర్కొన్నారు.

తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్‌గా దిల్ రాజు



ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు(వెంకట రమణారెడ్డి)కి ప్రభుత్వ కీలక పదవి లభించింది. తెలంగాణా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన్ని ప్రభుత్వం నియమించింది. దిల్ రాజు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. శనివారం దిల్‌రాజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.



హీరోయిన్‌తో దర్శకుడి పెళ్లి

'కలర్‌ఫొటో' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రాజ్, అదే సినిమాలో నటించిన నటి చాందినీరావు వివాహం తిరుమలలో వైభవంగా జరిగింది. కొద్దిరోజులుగా ప్రేమికులుగా ఉన్న వీరు శనివారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. తిరుమలలోని ఓ మఠంలో శనివారం ఉదయం జరిగిన ఈ వివాహానికి 'కలర్‌ఫొటో' హీరో సుహాస్ దంపతులు, హాస్య నటుడు వైవా హర్ష తదితరులు పాల్గొని సందడి చేశారు.

- తిరుమల (ఆంధ్రజ్యోతి)



ఈ క్రెడిట్ అంతా సుకుమార్‌దే

అల్లు అర్జున్

అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప 2'. వై.రవి శంకర్, నవీన్ యెర్నేని నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బ్లాక్‌బస్టర్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నవీన్ మాట్లాడుతూ "ఈ సినిమాను ఎంతగానో ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ థాంక్స్. ఫాస్టెస్ట్ రూ.500 కోట్లు వసూలు చేసిన సినిమాగా రికార్డు సృష్టించింది. మరింత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. "సినిమాని అమితంగా ప్రేమించే ఇద్దరు కలసి పని చేస్తే ఎలా ఉంటుందో అదే 'పుష్ప 2'" అని నిర్మాత రవిశంకర్ చెప్పారు. "ఈ సినిమా విషయంలో రాజమౌళి ఎంతో సపోర్ట్ చేశారు. ఫహాద్ ఫాజిల్ లాంటి గొప్ప నటుడితో పని చేయడం నా అదృష్టం. ఈ విజయానికి కారణం చిత్రబృందం పడిన శ్రమ. సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో నా టీమ్ ముందుగానే లెక్కలతో సహా చెప్పేశారు" అని దర్శకుడు సుకుమార్ అన్నారు. "దేశ నలుమూలల నుంచి మాకు సపోర్ట్ చేసిన అందరికీ ధన్యవాదాలు. ఈ సక్సెస్ క్రెడిట్ అంతా సుకుమార్‌దే. ఆయనకి రుణపడి ఉంటాను. అలాగే మాకు ఎంతో సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. అనుకోకుండా సంధ్య థియేటర్లో జరిగిన సంఘటన మమ్మల్ని ఎంతగానో కదిలించింది. 20 ఏళ్లుగా ఇలాగే ఆ థియేటర్లో అభిమానులతో సినిమా చూడ్డానికి వచ్చేవాడ్ని. కానీ ఇంటికి వచ్చిన తరువాత ఆ రోజు జరిగిన సంఘటన తెలిసి చాలా బాధ కలిగింది. ఆ కుటుంబం కోసం రూ.25 లక్షలు కేవలం ఒక సాయంగా ఇచ్చినా.. మనిషి లేని లోటును ఎవరూ తీర్చలేం. అందుకు ఎంతో విచారిస్తున్నాను. అంతా కుదుటపడిన తరువాత వ్యక్తిగతంగా వెళ్లి ఆ కుటుంబాన్ని కలుస్తాను" అని తెలిపారు.

70 అవార్డులు వచ్చాయి కానీ...



హీరోయిన్ వేదిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఫియర్'. డా.హరిత గోగినేని దర్శకత్వంలో డా.వంకి పెంచలయ్య, ఏఆర్.అభి నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకురాలు హరిత మీడియాతో ముచ్చటించారు. "మూడేళ్ల క్రితం మొదలైన ఆలోచన ఇది. ఈ సినిమాకు వేదిక యాప్ట్ అని ఆమె నటించిన 'ముని', 'కాంచన 3' సినిమాలు చూశాక నిర్ణయించుకున్నా. మొదట ఈ సినిమాకు 'భయం' అనే టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ అది క్యాచీగా లేదని 'ఫియర్' ఫైనలైజ్ చేశాం. సస్పెన్స్ థ్రిల్లర్‌లలో ఉండే యూనివర్సల్ అప్పీల్ వల్ల అందరికీ నచ్చుతాయి. ఈ సినిమా ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులు గెలుచుకుంది. ఆ అవార్డ్స్ ఇచ్చిన సంతోషం కంటే సినిమా తెలుగు ప్రేక్షకులకు రీచ్ అయితే వచ్చే సంతోషం ఎక్కువ. ఇది రెగ్యులర్ సినిమా కాదు.. సరికొత్త అనుభూతిని ఇచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది" అని చెప్పారు.

మూర్ఖత్వం బోర్డర్ దాటేసిన పాత్ర



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'బచ్చలమల్లి'. 'సోలో బతుకే సో బెటరు' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుబ్బు మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా కథ విన్న వెంటనే నరేశ్ అంగీకరించారు. ఇది క్యారెక్టర్ బేస్డ్ మూవీ. ఇందులో నరేశ్ పాత్ర చాలా రఫ్‌గా ఉంటుంది. మూర్ఖత్వం బోర్డర్ దాటేసిన పాత్ర ఇది. 90ల్లో జరిగే ఈ సినిమాలో కమర్షియల్ అంశాలతో పాటు మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. ఇందులో ఫాదర్ ఎమోషన్ కీలకం. ప్రతీ ఒక్కరూ తప్పులు చేస్తారు. కానీ అవి సరిదిద్దుకోలేని విధంగా ఉంటే.. ఎంత నష్టపోతామో ఇందులో చూపించాం. చాలా నిజాయితీగా తీసిన సినిమా ఇది. ఇంతవరకూ ఇలాంటి క్యారెక్టర్‌ను నరేశ్ పోషించలేదు. ఈ సినిమా స్క్రీన్‌ప్లే నాన్ లీనియర్‌గా ఉంటుంది. సంభాషణలు చాలా సహజంగా ఉంటాయి. విశాల్ చంద్రశేఖర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్నీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.



ప్రేక్షకులు మెచ్చేలా

ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ, రాస్ర ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం 'ఏ రోజైతే చూశానో నిన్ను'. రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రం ద్వారా భరత్ రామ్ హీరోగా, కన్నడ నటి ఐశ్వర్య గౌడ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. షూటింగ్ ఈనెలలోనే ప్రారంభం కానుంది. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రం ఉంటుందని చిత్ర బృందం తెలపింది.

భోజనం మానేయమన్నారు



సంజయ్‌లీలా భన్సాలీ తీర్చిదిద్దిన వెబ్‌సిరీస్ 'హీరామండీ:ద డైమండ్ బజార్'లో బిబ్బోజాన్ పాత్రలో మెప్పించారు నటి అదితీరావు హైదరీ. భోజనం మానేసి షూటింగ్‌లో పాల్గొన్నారట. ఈ విషయాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అదితి వెల్లడించారు. 'సెట్లో కొన్ని సార్లు భావోద్వేగ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చేయమంటే నేనే వాటిని రొమాంటిక్‌గా చేశాను. ఎంత ప్రయత్నించినా అవి సహజంగా రాలేదు. ఆకలితో చేస్తే భావోద్వేగ సన్నివేశాలు మెరుగ్గా వస్తాయని భోజనం మానేయమని సలహా ఇచ్చారు దర్శకుడు. ఇది నాకు చాలా ఉపయోగపడింది. సిరీస్ షూటింగ్ పూర్తయ్యే వరకూ ఆ సలహానే పాటించాను' అని ఆమె చెప్పుకొచ్చారు.

8న జగదీశ్ గుప్తా సంస్మరణ సభ

ఆదిత్య మ్యూజిక్ కంపెనీ ఉమేశ్ గుప్తా సోదరుడు జగదీశ్ గుప్తా ఇటీవల మరణించారు. ఆయన సంస్మరణ సభను ఈనెల 8న హఫీజ్‌పేట్‌లో నిర్వహించనున్నారు. సంగీత్ సాగర్ మ్యూజిక్ స్టోర్‌తో జగదీశ్ గుప్తా తన ప్రస్థానాన్ని ఆరంభించారు. ఇది అంచెలంచెలుగా ఎదిగి ఆదిత్య మ్యూజిక్ గ్రూప్‌గా రూపాంతరం చెందింది.

కొత్తగా..

యథార్ధ సంఘటన ఆధారం



సతీశ్ మాలెంపాటి దర్శకత్వంలో కన్నడ హీరో శశికుమార్ తనయుడు ఆదిత్య శశికుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సమిధ'. చాందిని తమిళరసన్, లావణ్య సాహుకార హీరోయిన్లు. అరుణ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. రాజస్థాన్‌లో జరిగిన యదార్ధ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సతీశ్ మాలెంపాటి మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ట్విస్ట్‌లు, టర్న్‌లతో పాటు చేజింగులు, యాక్షన్ సీన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది అన్నారు.

అందరికీ నచ్చే థ్రిల్లర్



అమిత్ రావు హీరోగా నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'జిన్'. చిన్మయ్ రాయ్ దర్శకత్వంలో నిఖిల్ ఎమ్.గౌడ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇవ్వగా.. గీత రచయిత రామజోగయ్యశాస్త్రి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు చిన్మయ్ మాట్లాడుతూ "మంచి కథతో తెరకెక్కుతోన్న చిత్రమిది. అందరికీ నచ్చే థ్రిల్లర్ ఇది" అని చెప్పారు. "ఈ సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉంటుందని ఆశిస్తున్నాం" అని నిర్మాత నిఖిల్ అన్నారు.

హారర్ కామెడీ



కొండా వెంకట రాజేంద్ర, అనాల సుస్మిత, మనిషా జష్నాని, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మీ గణేశ్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మించిన హారర్ బేస్డ్ కామెడీ మూవీ 'లోపలికి రా చెప్తా'. కొండా వెంకట రాజేంద్ర స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రంలోని మొదటి గీతాన్ని డెలివరీ బాయ్ జాఫర్‌తో శనివారం రిలీజ్ చేయించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకట రాజేంద్ర మాట్లాడుతూ 'మా చిత్రంలో హీరో క్యారెక్టర్ డెలివరీ బాయ్. అందుకే మొదటి సాంగ్‌ను ఓ డెలివరీ బాయ్‌తో విడుదల చేయించాం. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

మదర్ సెంటిమెంట్‌తో..



సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహించి ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'ఎర్రచీర-ది బిగినింగ్'. ఈ సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ మనవరాలు తేజస్విని నటించింది. ఎన్.వి.వి.సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మాతలు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ సెంటిమెంట్‌తో తెరకెక్కింది. ఈనెల 27న సినిమా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ 'సెంటిమెంట్ ఉన్న హారర్ సినిమాలు తప్పకుండా సక్సెస్ అవుతాయి. అలాంటి మంచి కంటెంట్ ఈ సినిమాలో కనిపిస్తోంది' అని అన్నారు. చిత్ర దర్శకనిర్మాత, నటుడు సుమన్ బాబు మాట్లాడుతూ' బేబి సాయి తేజస్విని చాలా అద్భుతంగా నటించింది. సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ మాట్లాడుతూ 'సుమన్ బాబు శ్రమ ట్రైలర్‌లో ఉన్న క్వాలిటీతో తెలుస్తోంది' అని అన్నారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

నెట్‌ఫ్లిక్స్‌లో




జిగ్రా

విదేశీ జైలులో ఉన్న తన తమ్ముడిని రక్షించటానికి ఒక అక్క చేసిన ప్రయత్నమే జిగ్రా! దీనిలో ఆలియాభట్ ప్రధాన పాత్ర పోషించారు. కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినా ఆలియాభట్ నటనకు మాత్రం మంచి ప్రశంసలు లభించాయి.



అమరన్

మేజర్ మార్కండేయ వరదరాజన్ జీవితం ఆధారంగా తీసిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివకార్తికేయన్, సాయిపల్లవి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలలో నటించారు.



చర్చిల్ ఎట్ వార్

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ఎలాంటి పాత్ర పోషించారనే విషయంపై రూపొందించిన డాక్యుమెంటరీ సిరీస్ ఇది. చరిత్రపై ఆసక్తి ఉన్నవారు తప్పనిసరిగా చూడాల్సిన సిరీస్ ఇది.

ప్రైమ్ వీడియో



కంగువా

ఒక తెగ నాయకుడు తన ప్రజలను రక్షించుకోవటానికి చేసే ప్రయత్నమే కంగువా! సూర్య హీరోగా భారీ బడ్జెట్‌తో తీసిన ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. బాబీ డియోల్, దిషా పఠానీ నటించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది.

విక్కీ విద్యాకా వో వాలీ వీడియో



రాజ్‌కుమార్ రావు, తృప్తి డిమ్రీ నటించిన ఈ చిత్రాన్ని 1990ల నేపథ్యంలో తీసారు. విక్కీ, విద్యలకు కొత్త పెళ్లి అవుతుంది. వారు తమ కోసం తీసుకున్న ఒక వ్యక్తిగతమైన వీడియో మాయమవుతుంది. ఆ తర్వాత జరిగే అనేక సరదా సంఘటనల సమాహారమే ఈ సినిమా.



కస్తూరి...

తెలుగు సినిమాలు, సీరియల్స్ చూసేవారికి సుపరిచితమైన పేరు. తెలుగువారిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారనే అభియోగంపై ఆమెను హైదరాబాద్‌లో తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేయటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వృత్తిరీత్యా మళ్లీ హైదరాబాద్‌కు వచ్చిన కస్తూరిని 'నవ్య' పలకరించింది.

అంతా మంచే జరిగింది...

మళ్లీ హైదరాబాద్ వచ్చారు... ఎలా అనిపిస్తోంది?

గత రెండు వారాలు చెన్నైలో హడావిడిగా గడిచిపోయింది. ఇక్కడకు వస్తే భద్రంగా ఉన్నట్లు అనిపిస్తోంది. 'ఇది నా ఇల్లు. ఇది సొంత ఊరు కదా! నేను అరెస్ట్ అయిన తర్వాత- తెలుగు ప్రేక్షకులు ఏమనుకుంటున్నారో?' అనే బెంగ ఉండేది. 'నన్ను అపార్థం చేసుకున్నారా?' అనే అనుమానం కూడా తలెత్తింది. కానీ ఆ అనుమానాలన్నీ పటాపంచలయిపోయాయి.

మీరు అరెస్ట్ అవుతారని ఎప్పుడైనా ఊహించారా?

నేరం చేస్తే ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తాం. నేరం చేయకపోతే ఆ ఆలోచనే రాదు కదా! నన్ను పోలీసులు అరెస్ట్ చేస్తారనే ఆలోచన నాకు రాలేదు. టాస్క్ ఫోర్స్ పోలీసులు మా ఇంటికి వస్తే షాక్ అయిపోయాను. వాస్తవానికి ఈ విషయం ఇంత సీరియస్ అవుతుందని నేను అనుకోలేదు. ఈ వివాదం చెలరేగినప్పుడు - తమిళనాడు బీజేపీ నేత అన్నామలైకి ఫోన్ చేశాను. ఆయన నన్ను తెలుగు వారికి క్షమాపణ చెబుతూ ప్రెస్‌నోట్ ఇవ్వమన్నారు. నేను చేయని తప్పుకు ఎందుకు క్షమాపణ అడగాలని ఆయనతో వాదన వేసుకున్నా. తప్పు చేసినా, చేయకపోయినా.. సమస్యలు జటిలం కాకుండా ఉండటానికి క్షమాపణ చెప్పాల్సి వస్తుందని ఆయన నచ్చచెప్పారు. అప్పుడు తెలుగు ప్రజలకు వివరణ ఇచ్చాను. ఆ తర్వాత అంతా ప్రశాంతంగా ఉందనుకున్నా. నన్ను అరెస్ట్ చేస్తారనే వార్తలు వస్తూనే ఉన్నాయి. వాటిని నేను పట్టించుకోలేదు.

> నా అరెస్ట్‌కు దారి తీసిన ఘటనలు ఈనాటివి కాదు. రెండేళ్ల క్రితమే నన్ను ఒక లక్ష్యంగా ఎంచుకున్నారు. సనాతన ధర్మాన్ని, 'వసుధైవ కుటుంబకం' అనే సూత్రాన్ని నేను గాఢంగా నమ్ముతాను. ఏ మతానికి, కులానికి వ్యతిరేకిని కాదు. కానీ డీఎంకే విధానాలను మాత్రం వ్యతిరేకిస్తా. రెండేళ్ల క్రితం ఉదయనిధి మారన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను నేను తీవ్రంగా విమర్శించా. అప్పుడు నన్ను అరెస్ట్ చేయటానికి ఆ ప్రభుత్వం వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. అందువల్ల అప్పుడు నన్ను వదిలేశారు. కానీ ఎప్పుడో అప్పుడు కస్తూరికి గుణపాఠం నేర్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో నామీద అనేకసార్లు దాడులు జరిగాయి. కానీ నేను భయపడలేదు. నన్ను తెలుగు రాష్ట్రాల్లో అరెస్ట్ చేస్తే నాకు వ్యక్తిగతంగా నష్టం జరుగుతుందని వారికి తెలుసు. అందుకే హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు.

మీ నిర్మాతలు ఎలా స్పందించారు?

నా నిర్మాతలు ఆందోళన చెందారు. అది సాధారణమైన విషయమే! ఎందుకంటే నేను ఒకసారి జైలుకు వెళ్లిన తర్వాత ఎప్పుడు వస్తానో వారికి తెలియదు కదా! ఇదే విధంగా మళ్లీ జైలుకు వెళ్తానేమో కూడా తెలియదు కదా! అందువల్ల అందరికీ భయంగానే ఉంది. అంతేకాదు, సాధారణంగా సినీ రంగంలోని వారు ఎటువంటి వివాదాల జోలికి వెళ్లరు. ప్రస్తుతం నేను తెలుగులో 'ఝాన్సీ' అనే సీరియల్‌లో నటిస్తున్నా. ఆ నిర్మాణ సంస్థ వాళ్లు 'ఇప్పుడు ఏం చేయాలా?' అని ఆలోచిస్తున్నారు. వాళ్ల ఆందోళన నాకు అర్థమవుతోంది. నా తమిళ సినిమా షూటింగ్ మాత్రం సోమవారం నుంచి తిరిగి ప్రారంభమవుతుంది.

మూడు రోజుల జైలు జీవితం ఎలా ఉంది..?

ఆదివారం అరెస్ట్ చేశారు. బుధవారం బయటకు వచ్చేసా. నేను జైలు లోపలికి వెళ్లక ముందే అక్కడున్న వారందరికీ నేను వస్తున్నానని తెలిసిపోయింది. "స్టాలిన్ ఈమెను లోపలికి పంపాడట" అని వాళ్లు అనుకుంటూ ఉంటే విన్నా. అక్కడ నాకు ఒక స్పెషల్ సెల్ ఇచ్చారు. తొలిసారి వచ్చిన ఖైదీలందరూ దానిలోనే ఉంటారట. నాకు కొత్త పళ్లెం, కొత్త లోటా ఇచ్చారు. జైలు సిబ్బంది బాగా చూసుకున్నారు. ఇక్కడో విషయం చెప్పాలి. జైలు జీవితం సినిమాలో చూపించినట్లు ఉండదు. నేను అనేక సినిమాల్లో, సీరియల్స్‌లో జైలు సీన్లు చేశాను. కానీ నిజమైన జైలు వేరుగా ఉంటుంది. మరో విషయం ఏమిటంటే... తమిళ 'బిగ్‌బాస్'లోకి నేను ఒకసారి స్పెషల్ ఎంట్రీగా వెళ్లాను. ఆ సమయంలో 'బిగ్‌బాస్ జైలు'లో ఉండాల్సి వచ్చింది. వాస్తవానికి అక్కడ కన్నా నిజమైన జైలులోనే బాగుంది. అక్కడ ప్రమాదకరమైన వారు ఉంటారు. అమాయకులు కూడా ఉంటారు. భర్తలు చేసిన నేరాలకు జైలుకు వచ్చిన భార్యలు కూడా ఉన్నారు. జైలుకు వెళ్తున్నప్పుడు మొదట్లో నాకు అవమానంగా అనిపించింది. కానీ స్నేహితులు... "నువ్వు నేరం చేసి జైలుకు వెళ్లలేదు.. ఒక సిద్ధాంతం కోసం వెళ్తున్నావు." అన్నారు. ఇక్కడొక విషయం చెప్పాలి. నేను జైలుకు వెళ్లకపోతే నా తెలుగు కుటుంబ సభ్యులు ఏమనుకుంటున్నారో తెలిసేది కాదు. ఆ విధంగా చూస్తే నాకు మంచే జరిగింది.



మీ కుటుంబ సభ్యుల స్పందనేమిటి?

వాళ్లకు నేను ఎలాంటి తప్పు చేయలేదని తెలుసు. అయితే వాళ్లను ఇబ్బంది పెట్టాననే భావన నన్ను ఇబ్బంది పెడుతోంది. హఠాత్తుగా నన్ను అరెస్ట్ చేయటంతో- నా దగ్గర ఉన్న ఖరీదైన కొన్ని వస్తువులు మా పక్కింటి వాళ్లకు ఇచ్చి దాచమన్నాను. మా అబ్బాయిని స్నేహితుల ఇంట్లో ఉంచాల్సి వచ్చింది. వాడు నన్ను- "నువ్వు ఏం చేయకపోతే నిన్ను పోలీసులు ఎందుకు తీసుకువెళ్లారు?" అని అడిగాడు. "కొన్ని విషయాల్లో అలా కూడా జరుగుతుంది" అని సమాధానం చెప్పాను. కానీ జైలులో ఉన్న సమయంలో నా కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారనే ఆలోచనలు మనసులో తిరుగుతూనే ఉండేవి. వచ్చిన తర్వాత మా అబ్బాయి స్కూలుకి వెళ్తే అక్కడ వాళ్లు నా వ్యాఖ్యల గురించి అడిగారు. వాళ్లకు వివరణ ఇచ్చాను. ఇక్కడ ఒక విషయం మాత్రం కచ్చితంగా చెప్పాలి. మా కుటుంబ సభ్యులను మీడియా మాత్రం వేధించలేదు. కేవలం నా గురించి వార్తలు ప్రచురించారంతే!

• సివిఎల్ఎన్ ప్రసాద్

నెయ్యితో అనారోగ్యం దూరం

చలికాలంలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను నివారించడంలో నెయ్యి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆయుర్వేద మందుల్లో కూడా నెయ్యిని విరివిగానే ఉపయోగిస్తుంటారు. శీతాకాలంలో తరచూ జలుబు, దగ్గు, పొడిచర్మం, కీళ్ల నొప్పులు బాధిస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొందడానికి నెయ్యితో అనుసరించే ఇంటి చిట్కాల గురించి తెలుసుకుందాం!

దగ్గుకి: ఒక చిన్న గిన్నెలో రెండు చెంచాల నెయ్యి వేసి వేడి చేయండి. ఇందులో చిటికెడు మిరియాల పొడి లేదా చిటికెడు పసుపు వేసి బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని రోజుకి రెండు సార్లు తినడం వల్ల గొంతు గరగర, దగ్గు లాంటివి తగ్గుతాయి.

మంచి నిద్రకి: రాత్రి పడుకునేముందు పాదాలను, అరికాళ్లను గోరువెచ్చని నెయ్యితో మర్దన చేయండి. దీనివల్ల మెదడు నుంచి పాదాల వరకు రక్త ప్రసరణ జరిగి మంచి నిద్ర పడుతుంది. అలాగే ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక చెంచా నెయ్యి, చిటికెడు జాజికాయ పొడి కలుపుకుని తాగినా మంచి ఫలితం కనిపిస్తుంది. అలసట తీరి శరీరం విశ్రాంతి పొందుతుంది. కాలేయం కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

పొడి చర్మానికి: ఒక గిన్నెలో అయిదు చెంచాల నెయ్యి వేసి కొద్దిగా వేడి చేయండి ఈ మిశ్రమాన్ని ముఖానికి చేతులకు పట్టించండి. నెయ్యిలో ఉండే తేమ, పోషకాలు అంది చర్మం మృదువుగా మారుతుంది. మంచి ఛాయతో మెరుస్తుంది కూడా.

పంటి చిగుళ్లకు: నెయ్యిలో అధికంగా బ్యుటిరిక్ యాసిడ్ అనే ఫ్యాటీ యాసిడ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి పంటి చిగుళ్ల, దవడల లోపలి భాగాల్లో చేరే వ్యాధి కారక క్రిములతో పోరాడుతాయి. ప్రతి రోజూ భోజనంలో రెండు చెంచాల నెయ్యిని చేర్చుకోవడం వల్ల చిగుళ్ల వాపు, ఇతర నోటి సమస్యలు తగ్గుతాయి.

రోగనిరోధక శక్తికి: నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో జీవక్రియలను వేగవంతం చేసి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరం వేడిని కోల్పోకుండా చేస్తాయి. నిస్సత్తువ, అలసట, నీరసాన్ని తగ్గిస్తాయి. ప్రతి రోజూ ఉదయం కాఫీ లేదా టీలో కొద్దిగా నెయ్యి కలుపుకుని తాగితే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అల్పాహారంలో కూడా ఒక చెంచా నెయ్యిని చేర్చుకుంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవు.



కీళ్ల నొప్పులకు: నెయ్యిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఒక చెంచా నెయ్యిని కొద్దిగా వేడిచేసి అందులో చిటికెడు శొంఠి లేదా వాము పొడి కలిపి తింటూ ఉంటే కీళ్ల నొప్పులు, కండరాల వాపు తగ్గుతాయి. వీపు నొప్పి, నడుము నొప్పి, మోకాళ్ల సమస్యలు తీరతాయి. వెన్నెముక కూడా దృఢంగా మారుతుంది.

ముక్కు సమస్యలకు: జలుబు కారణంగా ముక్కు రంధ్రాలు మూసుకుపోతుంటాయి. శ్వాస కూడా ఆడదు. ఇటువంటి సమయాల్లో చూపుడు వేలిని నెయ్యిలో ముంచి దానిని ముక్కు రంధ్రాల్లోకి జొప్పించి గుండ్రంగా తిప్పుతూ మర్దన చేయాలి. దీనివల్ల ముక్కు రంధ్రాలు తెరచుకుని శ్వాస ఆడుతుంది. తలనొప్పి తగ్గుతుంది. ఏకాగ్రత కుదురుతుంది.

ఆందోళనకు: రాత్రి పడుకునేముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా త్రిఫల చూర్ణం, ఒక చెంచా నెయ్యి కలుపుకుని తాగితే వెంటనే నిద్ర పడుతుంది. దీనివల్ల ఆందోళన, మానసిక వ్యాకులత తగ్గుతాయి. మెదడు కూడా విశ్రాంతి పొందుతుంది. పేగు కదలికలు సజావుగా జరిగి జీర్ణాశయం, మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి.

బరువు పెరగాలంటే..!

బరువు తగ్గడం కంటే బరువు పెరగడం సులభం అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. ఇష్టమైన ఆహారపదార్థాలన్నీ తినేస్తే లావు అయిపోవచ్చు అనుకుంటారు. కానీ ఇది సరైన విధానం కాదు. కొంతమంది ఎంత తిన్నా బరువు పెరగరు. బరువు పెరగాలంటే జీవక్రియలు నియంత్రణలో ఉండాలి. సహజంగా ఆరోగ్య రీతిలో బొద్దుగా మారాలంటే ఏం తినాలో తెలుసుకుందాం.

గింజలు: సాయంత్రం టీ లేదా కాఫీ తాగేముందు, రాత్రి పడుకునేముందు కొన్ని గింజలు తినడం అలవాటు చేసుకోండి. బాదాం, జీడిపప్పు, వాల్‌నట్స్, గుమ్మడి గింజల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి జీర్ణక్రియ నెమ్మదిగా జరిగేలా చేస్తాయి. శరీరంలో జీవక్రియల వేగాన్ని తగ్గించి హార్మోన్ల పనితీరును నియంత్రిస్తాయి. దీనివల్ల క్రమంగా బరువు పెరిగే అవకాశం ఉంటుంది.

స్మూతీలు: ఎక్కువ క్యాలరీలు ఉండే స్మూతీలు తీసుకోవడం వల్ల బరువు పెరగవచ్చు. చిక్కని పాలు, అరటి పండ్లు, వేరుశనగ వెన్న, ఓట్స్ తదితరాలతో తయారు చేసిన స్మూతీలు తరచుగా తీసుకోవాలి. ఇవి కడుపులో తేలికగా ఉన్న భావనను కలిగిస్తాయి. కానీ అధిక మొత్తంలో క్యాలరీలు, పోషకాలు, కొవ్వులు, ప్రోటీన్లు శరీరానికి అందుతాయి. ఇవి జీవక్రియలను తటస్థంగా ఉంచుతాయి. ఎక్కువ పరిమాణంలో ఆహార పదార్థాలు తినలేనివారికి ఈ స్మూతీలు ఉపయుక్తంగా ఉంటాయి. వీటిలో ప్రోటీన్ పొడి కలుపుకుని తీసుకుంటే వెంటనే ఫలితం కనిపిస్తుంది.

ఆలివ్ నూనె: రోజూ తినే సలాడ్స్, తాగే సూప్‌లలో ఆలివ్ ఆయిల్ చేర్చుకోవడం వల్ల శరీరానికి అదనపు క్యాలరీలు అందుతాయి. ఇవి ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి శరీరం పోషకాలను గ్రహించేలా చేస్తాయి. దీనివల్ల సులభంగా బరువు పెరగవచ్చు

సమతుల ఆహారం: ప్రతి మూడు గంటలకు ఒకసారి విటమిన్లు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ ఉండాలి. దీంతో శరీరంలో క్యాలరీలు తగ్గకుండా జీవక్రియ తటస్థంగా ఉంటుంది. శరీరానికి విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా అందుతాయి కాబట్టి ఆరోగ్యకరంగా బరువు పెరగవచ్చు.

నెమ్మదిగా తినాలి: ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినడం వల్ల జీర్ణక్రియ పూర్తిగా జరిగి శరీరం పోషకాలను గ్రహిస్తుంది. ఆకలిని పెంచే హార్మోన్‌లు ఉత్తేజితమవుతాయి. ఆకలి అనిపించినపుడల్లా ఏదో ఒకటి తినడం వల్ల సహజంగా ఆరోగ్యకరమైన విధానంలో శరీరం బరువు పెరుగుతుంది.

వ్యాయామం: కండరాల శక్తిని, ఉత్పత్తిని పెంచే ప్రత్యేక వ్యాయామాలు చేయాలి. వివిధ రకాల ఆటలు ఆడడం, బరువులు ఎత్తడం, ఏరోబిక్ వ్యాయామాలు చేయడం వల్ల ఎముకల్లో సాంద్రత, కండరాల బరువు పెరుగుతాయి. శరీరానికి అందే శక్తి అంతా బరువు పెరిగేందుకు తోడ్పడుతుంది.



ముచ్చటగా మూడు గంటలు

ఇటీవల విడుదలైన పుష్ప-2 సినిమా నిడివి 3 గంటల 20 నిమిషాలు. 'అమ్మో...! ఇంత నిడివా' అంటూ సామాజిక మాధ్యమాల్లో రకరకాలుగా చర్చించుకుంటున్నారు. అక్కడ ఎవరికి తోచిన వ్యాఖ్యలు వారు చేస్తున్నారు. మూడు గంటలు దాటితేనేం... సినిమా విజయవంతంగా నడుస్తోంది. ఆ మేరకు వసూళ్లు కూడా 'తగ్గేదేలే' అంటున్నాయి. వాస్తవానికి ఇంతటి రన్ టైమ్ టాలీవుడ్‌కి కొత్తేమీ కాదు. నాటి 'దాన వీర శూర కర్ణ' మొదలు నేటి 'పుష్ప' వరకు... 3 గంటలు, అంతకంటే ఎక్కువ నిడివితో వచ్చి... ఘన విజయం సాధించాయి.

'లవకుశ' 3 గంటల 28 నిమిషాలు. పాతాళభైరవి 3 గంటల 15 నిమిషాలు, మిస్సమ్మ 3 గంటల 10 నిమిషాల నిడివి ఉన్న సినిమాలే. ఆ తర్వాత పాండవ వనవాసం 3 గంటల 18 నిమిషాలు, అల్లూరి సీతారామరాజు 3 గంటల 7 నిమిషాలు, నిజం 3 గంటల 7 నిమిషాలు, ఆర్ఆర్ఆర్ 3 గంటల 7 నిమిషాలు, అర్జున్ రెడ్డి 3 గంటల 6 నిమిషాలు. ఇప్పుడు 'పుష్ప-2' 3 గంటల 20 నిమిషాలతో విడులైంది.



ఒకప్పుడు సినిమా నిడివి ఎక్కువైతే నిర్మాతలు భయపడేవారు. సినిమాపై ప్రతికూల ప్రభావం చూపుతుందని భావించేవారు. అందుకే తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా కొన్ని సీన్లను కట్ చేసి రిలీజ్ చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఈ మధ్యకాలంలో మూడు గంటల నిడివి కంటే ఎక్కువ ఉన్న సినిమాలు ఎన్నో వచ్చాయి. సూపర్ హిట్ అయ్యాయి. మరికొన్ని వస్తున్నాయి.

సాధారణంగా సినిమా నిడివి రెండున్నర నుంచి మూడు గంటలు ఉండటం ఎప్పటి నుంచో చూస్తున్నాం. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దాన వీర శూర కర్ణ' 3 గంటల 46 నిమిషాలు.

తెలుగు చిత్రాలు

తెలుగులో రంగస్థలం, మహానటి, అర్జున్‌రెడ్డి, ఆదిపురుష్ నుంచి ఇటీవల విడుదలైన పుష్ప-2 సినిమాలు రెండున్నర గంటల నిడివిని దాటాయి. నిడివి పెరిగినంత మాత్రాన ప్రేక్షకులు ఆస్వాదించలేరనే వాదన సరైంది కాదని ఈ సినిమాలు నిరూపించాయి.

అర్జున్‌రెడ్డి

2017లో విడుదలైన ఈ మూవీ నిడివి 3 గంటల 2 నిమిషాలు. విజయ్ దేవరకొండ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రమిది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించారు.

గద్దలకొండ గణేశ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఈ మూవీ 2019లో విడుదలైంది. హరీశ్ శంకర్ డైరెక్షన్‌లో 2.52 నిమిషాలతో తెరకెక్కింది.

రంగస్థలం

రామ్ చరణ్‌కు మంచి గుర్తింపు తీసుకొచ్చిన సినిమా 'రంగస్థలం'. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2018లో విడుదలైంది. 2 గంటల 54 నిమిషాల నిడివితో బ్లాక్‌బస్టర్ అయ్యింది.

ఆర్ఆర్ఆర్

రామ్‌చరణ్, ఎన్టీయార్ హీరోలుగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కించారు. 3 గంటల 6 నిమిషాల నిడివిగల ఈ సినిమా 2022లో విడుదలైంది.

ఆదిపురుష్

ప్రభాస్ నటించిన ఈ సినిమా 2023లో విడుదలైంది. దీని నిడివి 2 గంటల 59 నిమిషాలు. ఓం రౌత్ దర్శకత్వం వహించారు.

పుష్ప

అల్లు అర్జున్ హీరోగా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన పాన్ ఇండియా సినిమా. 2021లో విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రం నిడివి 2 గంటల 59 నిమిషాలు.

బాలీవుడ్‌లోనూ...

హిందీలో సైతం ఎక్కువ నిడివితో విడుదలై విజయం సాధించిన సినిమాలు ఉన్నాయి. వాటిలో మేరానామ్ జోకర్ ఒకటి. ఈ సినిమా రన్‌టైం 4 గంటల 15 నిమిషాలు. అప్పట్లో ఈ సినిమాకు రెండు ఇంటర్వెల్స్ ఇచ్చారు. కార్గిల్ యుద్ధం నేపథ్యంగా తీసిన 'ఎల్ఓసీ- కార్గిల్' నాలుగు గంటల నిడివిని దాటింది. అదేవిధంగా అమీర్‌ఖాన్ నటించిన 'లగాన్' మూవీ రన్‌టైమ్ 3 గంటల 44 నిమిషాల నిడివితో బాక్సాఫీసు వద్ద కలెక్షన్లను కొల్లగొట్టింది. ప్రేక్షకులు బోర్‌గా ఫీలవకుండా చేయగలిగితే చాలు..నిడివి ఎంతున్నా వారు పట్టించుకోరు అని ఈ చిత్రాలు నిరూపించాయి. ఆ తరవాత కారణాలు ఏమైతేనేమీ సినిమాల నిడివి సాధారణ స్థాయికి చేరుకున్నాయి.

తెలుగులో రంగస్థలం, మహానటి, అర్జున్ రెడ్డి, ఆదిపురుష్ వంటి సినిమాలతో మళ్లీ మూడు గంటల నిడివి గల చిత్రాలు విడుదలవసాగాయి. ఈ చిత్రాలన్నింటిలో చక్కటి విజువలైజేషన్, ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ గ్రాఫిక్ ఎఫెక్ట్స్‌ని హాలీవుడ్ స్థాయిలో వినియోగించారు. తద్వారా ఆడియన్స్‌కు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించగలిగారు. అందువల్ల ఈ సినిమాల నిడివి కాస్త ఎక్కువగానే ఉంటోందని దర్శకనిర్మాతలు అంటున్నారు. నేటి ట్రెండింగ్‌కు తగ్గట్టు క్వాలిటీలో గానీ, క్వాంటిటీలో గానీ ఎక్కడా రాజీ పడకుండా తీసిన సినిమాలకే ఇటు థియేటర్లలో, అటు ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లలో డిమాండ్ ఉంటుందని వారు చెబుతున్నారు.

ఓటీటీల రాకతో...

ఓటీటీల రాకతో చలన చిత్ర నిర్మాణ స్వరూపం పూర్తిగా మారిపోయింది. గ్లోబల్ కంటెంట్ లోకల్ అయ్యింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఎన్నో చిత్రాలు ప్రేక్షకుడి అరచేతిలో ఆవిష్కృతమవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ మధ్యకాలంలో సినిమాల కంటే వెబ్‌సిరీస్‌లే ఎక్కువగా బ్లాక్‌బస్టర్ అవుతున్నాయి. ఫ్యామిలీ మ్యాన్, మీర్జాపూర్, స్కామ్ 1992 నుంచి మొదలుకుని రీసెంట్‌గా రిలీజైన సిటాడెల్ వరకు చెప్పుకుంటూ పోవచ్చు.

ఈ వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకుల అభిరుచుల్లోనూ మార్పులొచ్చాయి. సినిమా నిడివి పెరిగినా సరే..తమకు కావాల్సిన అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటేనే ఆదరిస్తున్నారు. స్టార్ పవర్ కంటే కంటెంట్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కంటెంట్ బాగుండి, తెరపై కథను ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉంటే మూడు గంటలైనా సరే.. ప్రేక్షకులు ముచ్చపడి చూస్తారని చాలా సందర్భాల్లో రుజువైంది. అలా ప్రేక్షకుడిని థియేటర్‌లో మూడు గంటలు ముచ్చటగా కూర్చుండగలిగేలా చేయడం దర్శకుడి శైలి, అతని విజన్‌పై ఆధారపడి ఉంటుంది.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన పీటీఎం కార్యక్రమంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

పండగలా..!

ఉత్సాహంగా పేరెంట్-టీచర్ మీటింగ్

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సందడి వాతావరణం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు గులాబీ ఇచ్చి ఆహ్వానం. ఆహ్వానితులకు పూలు చల్లి వందనం. తల్లులకు ముగ్గుల పోటీలు. తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీ. విద్యార్థుల తల్లిదండ్రులతో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారుల మమేకం. పిల్లలతో కలిసి అంతా సహపంక్తి భోజనాలు. ఇవీ మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ సందర్భంగా పాఠశాలల్లో కనిపించిన దృశ్యాలు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఉత్సాహంగా.. పండుగ వాతావరణంలో జరిగాయి.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ సందర్భంగా శనివారం ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించారు. తరగతుల వారీగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు, పూర్వ విద్యార్థులు, దాతలు మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొని విద్యార్థులతోనూ, తల్లిదండ్రులతోనూ మమేకమయ్యారు. పాఠశాలల్లో వసతులు, విద్యాప్రమాణాలు, మధ్యాహ్న బోజనాలు తదితర అంశాలపై చర్చించారు. బాపట్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, కడపలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

పీటీజీ విశేషాలు ఇవీ..

- విశాఖ జిల్లా చంద్రంపాలెం జడ్పీ హైస్కూల్‌లో 4,000 మంది విద్యార్థులు ఉండగా, సుమారు వెయ్యిమంది తల్లిదండ్రులు పేరెంట్-టీచర్ మీటింగ్‌కు హాజరయ్యారు.
- విజయనగరం జిల్లా కేంద్రంలో మలిచర్ల(సుంకరిపేట) జడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రులపై పూలు చల్లుతూ, గులాబీలు అందించి సమావేశానికి ఆహ్వానించారు.
- కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల పాఠశాలకు ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగారు.
- కర్నూలులోని ఏ.క్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ హైస్కూల్‌లో డ్రగ్స్ నివారణపై అవగాహన పోస్టర్లను మంత్రి టీజీ భరత్ ఆవిష్కరించారు.
- అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం జడ్పీ హైస్కూల్‌లో హోంమంత్రి అనిత తన పక్కన కూర్చున్న తారా అనే విద్యార్థినికి అన్నం తినిపించి ఆత్మీయతను పంచారు.
- నంద్యాల జిల్లా ఇల్లూరుకొత్తపేట జడ్పీ హైస్కూల్లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.
- పల్నాడు జిల్లాలోని 1,586 పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో 1,53,229 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, గుంటూరు జిల్లాలోని 1,061 పాఠశాలల్లో 55వేల మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నప్పుడు ఇక్కడే చదివా: ఫరూక్



నంద్యాల పట్టణంలోని కాదరబాద్ నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ భావోద్వేగానికి గురయ్యారు. ఇదే పాఠశాలలో చదివిన ఆయన చిన్నప్పుడు చేసిన అల్లరిని గుర్తుచేసుకుంటూ.. స్నేహితులతో సరదాగా గడిపారు.

తల్లిదండ్రులూ.. పిల్లల్ని గమనిస్తుండండి: అనిత



విద్యార్థుల తల్లిదండ్రులు గంజాయి విషయంలో అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం జడ్పీ హైస్కూల్‌లో మెగా పీటీఎంలో ఆమె పాల్గొన్నారు. ఏడేళ్ల వయసున్న కుమారుడి స్కూల్ బ్యాగ్‌లో గంజాయి ఉందని ఓ తల్లి తనకు చెప్పారని, గంజాయిని చాక్లెట్ రూపంలోనూ అమ్ముతున్నారని తెలిపారు.

చక్కదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు వైపు.. బడి వైపు ఒక అడుగు' పేరిట శనివారం బాపట్ల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన పీటీఎం కార్యక్రమంలో మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఒకేసారి 44,303 స్కూళ్లలో 1.20కోట్ల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం అపురూపమనీ, ఓ రకంగా ఇది గిన్నిస్ రికార్డుగా కూడా మిగిలిపోతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇందుకు లోకేశ్, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను అభినందిస్తున్నానని తెలిపారు. ఎస్‌పీటీపీ (స్టూడెంట్-పేరెంట్-టీచర్-ప్రభుత్వం) ఒప్పందంతో విద్యార్థి భవిష్యత్‌కు హామీ లభిస్తుందని చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "భారతీయ కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పది. బిడ్డలను అంటిపెట్టుకుని ఉండేది తల్లే. నేను లోకేశ్‌కు సమయం కేటాయించలేక పోయినా తల్లి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ వరకు తీసుకెళ్లింది. పిల్లల భవిష్యత్తు బంగారుమయం కావాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకం. ఇందులో తల్లి పాత్ర మరింత ఎక్కువ. చిన్నప్పుడు నాకు చదువు చెప్పిన టీచర్‌ను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. ఇదే మన సంస్కృతి గొప్పదనం"

వాట్సాప్‌కే పిల్లల మార్కులు..

"ఈ మీటింగ్ వేర్వేరు తేదీల్లో జరిగి ఉంటే ఇంత స్పందన వచ్చేది కాదేమో. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పెద్దఎత్తున చదువుల పండుగలాగా జరగడంతో విద్యావ్యవస్థలో ఉన్న లోటుపాట్లతో పాటు చేయాల్సిన సంస్కరణలు చర్చకు వచ్చాయి. ఇక నుంచి పిల్లల హాజరు వివరాల నుంచి సబ్జెక్టుల వారీగా మార్కుల వరకు తల్లిదండ్రుల వాట్సాప్‌కే పంపిస్తాం. స్కూల్‌కు రాకపోయినా ఆ విద్యార్థి తల్లిదండ్రులను టీచర్ సంప్రదించడం, మెసేజ్ పెట్టడం చేస్తారు. సంవత్సరానికి మూడుసార్లు విద్యార్థి చదువు మీద మూల్యాంకనం చేసేలా చూడాలని ఆదేశాలిచ్చాను. విద్యార్థులు చదువుతోపాటు ప్రవర్తన, క్రమశిక్షణ కలిగి ఉండాలి. డీఎస్సీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తాం. వచ్చే జూన్ కల్లా కొత్త టీచర్లు విధుల్లో ఉంటారు. వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉండేలా చూస్తాం. రాబోయే రోజుల్లో స్కూళ్లకు రేటింగ్ ఇస్తాం. దీనికి సంబంధించి 18 అంశాల్లో ప్రోగ్రెస్ రిపోర్టును తయారుచేసి విద్యార్థుల పురోగతితో పాటు స్కూళ్లకు గ్రేడింగ్ ఇచ్చి వెనకబడి ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు 43 శాతం మాత్రమే గ్రేడింగ్ వచ్చింది. దానిని వచ్చే ఏడాదికి 90 శాతానికి తీసుకెళతాం. ప్రతి ఏడాది ఇదే రోజు(డిసెంబరు 7) మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ జరుగుతుంది"

జనాభా పెరుగుదలపై దృష్టి పెట్టాలి..

"పాపులేషన్ మేనేజ్‌మెంట్ జరగాలి. జనాభా పెరగాల్సి ఉంది. ప్రతి ఆడబిడ్డ ఇద్దరు పిల్లలను కనాలి. రాష్ట్రంలో పిల్లల శాతం 1.75 ఉంటే, ఇది బాపట్లలో మరీ తీసికట్టుగా 1.45గా ఉంది" అని చంద్రబాబు అన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ముద్రించిన 'మన బడి' మాస పత్రికను చంద్రబాబు ఆవిష్కరించారు.

అనునిత్యం నేను విద్యార్థినే..

"ఇప్పటికీ నేను అనునిత్యం నేర్చుకుంటూనే ఉంటాను. కొత్తగా నేర్చుకున్న విషయాలను ప్రజల మేలు కోసం అమలు చేయడం సంతృప్తిని ఇస్తోంది. స్వర్ణాంధ్ర-2047ను సాకారం చేసి చూపిస్తాను. నాది ఒక్కటే లక్ష్యం. ప్రతి పేద విద్యార్థీ చదువులో ముందుండాలి. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి. ఇందులో భాగస్వాములుగా ప్రభుత్వంతో పాటు టీచర్స్, తల్లిదండ్రులు తమ బాధ్యత నిర్వహించాలి. ఇదే నాకల. దీనిని సాకారం చేసి తీరుతాను. ప్రతి ఒక్క విద్యార్థికీ మంచి భవిష్యత్‌ను అందిస్తాను" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



కడపలో నిర్వహించిన పీటీఎంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఈ శతాబ్దం.. విద్యార్థులదే!

విలువలతో కూడిన విద్యను అభ్యసించండి

కడప పీటీఎంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కడప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ శతాబ్దం విద్యార్థులదే అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని వారికి సూచించారు. శనివారం కడప మున్సిపల్ ఉన్నత పాఠశాల (మెయిన్స్)లో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయలసీమ అంటేనే చదువుల నేల అని, ఇలాంటి ప్రాంతానికి రావడం తన అదృష్టమని అన్నారు. రాయలసీమ అత్యధికంగా లైబ్రరీలు ఉన్న ప్రాంతమని, పుస్తక నిధి అధికంగా ఉండటంతో ఇక్కడి ప్రజల్లో విజ్ఞాన సంపద కూడా అధికంగానే ఉంటుందని చెప్పారు. చదువు అనేది ఉద్యోగం, ఆర్థిక స్థోమతను పెంపొందించుకోవడానికి మాత్రమే కాదు, జ్ఞానం పెంపొందించుకోవడానికి కూడా అని తెలిపారు. 'మొల్ల, అన్నమయ్య, వేమన, నారాయణచార్యులు, నాగిరెడ్డి, బళ్లారి రాఘవ, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు లాంటి ఎందరో మహానుభావులు ఇక్కడినుంచి వచ్చారు. అలాంటి సీమకు పునర్వైభవం రావాలి. సీమ వెనుకబడిన ప్రాంతం కాదు. అవకాశాలకు ముందున్న ప్రాంతం అనిపించాలి' అని పవన్ పేర్కొన్నారు. 'విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి. ఆ బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆడబిడ్డల భద్రత కీలకం. ప్రతి స్కూల్‌లో సీసీ కెమెరాలు ఉండేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోబోతున్నారు' అని పవన్ పేర్కొన్నారు. 'రాష్ట్రంలో ఈ స్థాయిలో డ్రగ్స్ ఉండటం దారుణమైన విషయం. సైబర్ క్రైం కూడా ఎక్కువ అవుతోంది. ఇంట్లో ఒకరిద్దరిని చూసుకోవాలంటేనే తల్లిదండ్రులు ఎంతో ఇబ్బందిపడతారు. అలాంటిది తరగతి గదిలో 30 మందిని చూసుకోవాలంటే టీచర్లపై ఎలాంటి ఒత్తిడి ఉంటుందో ఒకసారి ఆలోచించాలి. ఈ దేశ గతిని మార్చే శక్తి టీచర్లకు ఉంటుంది. హీరోలు సినిమాల్లో కాదు... తల్లిదండ్రుల్లో, ఉపాధ్యాయుల్లో, ఆర్మీలో ఉంటారు. విలువలతో కూడిన వ్యక్తిని ఆదర్శంగా తీసుకోండి' అని విద్యార్థులకు సూచించారు. పాఠశాలల విలీనంతో ఆడపిల్లలు దూరప్రాంతంలోని పాఠశాలలకు వెళ్లడం లేదని, దీనికి పరిష్కారంగా అన్ని గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ బస్సు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. అనంతరం 6, 8, 9, 10 తరగతుల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో పవన్ సెల్ఫీ దిగారు.

విద్యార్థుల్లో ఉప్పొంగిన ఉత్సాహం

తమ అభిమాన హీరో పవన్‌కల్యాణ్‌ను చూడగానే విద్యార్థుల్లో ఒక్కసారిగా ఆనందం ఉప్పొంగింది. ఈలలు, కేకలతో ఘనంగా స్వాగతం పలికారు. తరగతి గదుల్లోకి వచ్చిన పవన్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకునేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. ఎంతో ఓపికగా అందరికీ ఆటోగ్రాఫ్ ఇచ్చిన పవన్‌కల్యాణ్.. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. 'సార్.. విమ్మల్ని తెరపై చూసి ఆనందించేవాళ్లం. అలాంటి విమ్మల్ని ఇక్కడ చూడడంతో మా జన్మ ధన్యమైంది' అంటూ 8వ తరగతి విద్యార్థులు తమ తరగతి గదిలోకి వచ్చిన పవన్‌తో ముచ్చటించారు. ఆటోగ్రాఫ్‌లు తీసుకుని ఇది తమకు చిరకాలం గుర్తుండిపోయే మధుర స్మృతి అంటూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతి గదిలోకి వెళ్లగానే పవర్‌స్టార్ అంటూ కేరింతలు కొట్టారు. ఎలా చదువుతున్నారంటూ వారిని పవన్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లులు వేసిన ముగ్గులను పవన్ పరిశీలించి వారితో ఫొటోలు దిగారు. తల్లి గర్భం నుంచి బిడ్డ ఏర్పడే విధానాన్ని ముగ్గు రూపంలో వేసిన మహిళకు ఆయన వందనాలు చేశారు. టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారిలో ఉత్సాహం నింపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కాగా, 'ప్రతిరోజు తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తాం. ఈరోజు మా ఆరాధ్యదైవం పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌తో కలిసి భోజనం చేయడం మరపురానిది' అంటూ విద్యార్థులు ఆనందంగా చెప్పారు.

ఆస్తులు కబ్జా చేస్తే గూండా యాక్ట్

ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తే గూండా యాక్ట్ పెడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు. కొన్ని పాఠశాలలు, జడ్పీ ఆస్తులను కొంత మంది తమ సొంతానికి వాడుకుంటున్నారని తెలిసిందని, దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కడప జిల్లా కలెక్టర్‌కు సూచించారు. కడపలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు వచ్చారని, ఇక్క సమస్యలు ఉండవనుకున్నానని అన్నారు. ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారన్నది కాదు.. ఎంత చేశారన్నదే ముఖ్యమని చెప్పారు. ఏదైనా సమస్య వచ్చినపుడు బలంగా రోడ్లపైకి రండి చాలు.. మిగతాది తాను చూసుకుంటానని చెప్పారు. తమ ప్రభుత్వానికి నిధులు తక్కువైనా మనసు చాలా పెద్దదన్నారు. పారిశుధ్య కార్మికులు చాలా గొప్పవారని, వారికి గౌరవం ఇవ్వాలని విద్యార్థులకు పవన్ సూచించారు.



స్కూల్ విద్యార్థులకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న పవన్‌కల్యాణ్



బాపట్ల మునిసిపల్ స్కూల్‌లో టగ్ ఆఫ్ వార్ పోటీలో తాడు లాగుతున్న మంత్రి నారా లోకేశ్

విద్యావ్యవస్థ సమూల ప్రక్షాళన

- ప్రభుత్వ బడుల్లో స్టాన్‌ఫర్డ్ ప్రమాణాలు
- ఆరు నెలల్లో మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీ
- సంక్రాంతి ముందే వచ్చినట్లుంది
- మెగా పీటీఎం కార్యక్రమంలో మంత్రి లోకేశ్

బాపట్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సమూలంగా విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తుందని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్నారు. శనివారం బాపట్లలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం (పీటీఎం)లో పాల్గొన్నారు. 'ఇక్కడి వాతావరణం నాకు చిన్నప్పటి రోజులను గుర్తుకుతెస్తోంది. చిన్నప్పుడు ఇలాంటి సమావేశాలకు అమ్మే వచ్చేవారు. నాన్న అప్పటికే సీఎం కాబట్టి ఆయనకు సమయం ఉండేది కాదు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే సంక్రాంతి పండగ ముందే వచ్చినట్లు అనిపిస్తోంది. మనందరి మధ్య బలమైన బంధాన్ని పీటీఎం ఏర్పరిచింది. అది విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలను తీసుకురానుంది" అని మంత్రి అన్నారు. పిల్లల్లో తనకు దేవుడు కనబడతాడని, అందరూ తన కుమారుడు దేవాన్ష్ లాగే కనబడతారని వ్యాఖ్యానించారు. మెగా పీటీఎం తొలి అడుగు మాత్రమేనని, ఏ రాష్ట్రంలో జరగనివిధంగా ఒకేసారి 71 లక్షల మంది తల్లిదండ్రులు, 1,88,266 మంది ఉపాధ్యాయులు, 50 వేలకు పైగా ప్రజాప్రతినిధులు పాల్గొనడం ఓ చరిత్రగా నిలిచిపోతుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా రిపోర్టు కార్డు కూడా తయారు చేసి 5 స్టార్ రేటింగ్‌లో స్కూల్ ఏ స్థానంలో ఉందో తెలుసుకోవడంతోపాటు విద్యార్థి ప్రోగ్రెస్ రిపోర్టును కూడా ఎసెస్ చేసే విధంగా చూస్తున్నామని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ బడుల్లో స్టాన్‌ఫర్డ్ స్థాయి ప్రమాణాలను తీసుకొస్తామన్నారు.

ఆడ, మగ సమానమే..

"ఇంట్లో ఎవరన్నా ఏడుస్తుంటే...అమ్మాయిలాగా ఏడవొద్దు అంటారు. ఇది తప్పు. ఆడ, మగ ఇద్దరూ సమానమే. మార్పు మన ఇంట్లో నుంచే మొదలవ్వాలి. ఏ నిర్ణయమైనా అందరితో కలిసి చర్చించిన తర్వాతే తీసుకుంటాం. గత ప్రభుత్వంలో లాగా అర్ధరాత్రి నిర్ణయాలు ఉండవు. డ్రగ్స్, గంజాయికి బానిస అవ్వడం వల్ల ఓ తరం నాశనమయ్యే ప్రమాదం ఉంది. అందుకే డ్రగ్స్‌పై యుద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తాను" -నారా లోకేశ్



బాపట్ల స్కూల్‌లో భోజనం చేసిన తర్వాత తన తండ్రి, సీఎం చంద్రబాబు ప్లేట్‌ను, తన ప్లేట్‌ను తీస్తున్న లోకేశ్

బాపట్ల పేరెంట్-టీచర్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు

ఇంటి పెద్దలా.. సొంత మనిషిలా..!

బాపట్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం సందర్భంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు వచ్చిన సీఎం చంద్రబాబు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మమేకం అయ్యారు. ఇక్కడ ఆయన వ్యవహరించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంటి పెద్దలా, సొంత మనిషిలా తమ దగ్గరకు వచ్చి ఇబ్బందులు విన్నారని తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. హైస్కూల్ పదో తరగతి గదిలోకి విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. అక్కడ కూర్చుని.. పదో తరగతి విద్యార్థిని మీనాక్షి, ఆమె తండ్రితో మాట్లాడారు. నీ లక్ష్యం ఏమంటని సీఎం ప్రశ్నకు నేచురల్ ఫార్మింగ్ తన గోల్ అని మీనాక్షి సమాధానమివ్వడంతో ఆమెను మెచ్చుకున్నారు.

అమ్మ కొడుతుందని భయమా?

మీ పిల్లల భవిష్యత్తు గురించి కలిసి కూర్చుని మాట్లాడుకోవాలని తల్లితండ్రులకు సీఎం చెప్పారు. మీ మార్కుల రిపోర్టును ఇంటికి పంపిస్తా.. పంపాలా వద్దా అని పిల్లలను చంద్రబాబు అడగగా విద్యార్థుల చాలా మంది వద్దన్నారు. ఎందుకు ఇంటికి మెసేజ్ వస్తే మీ అమ్మ కొడుతుందనా? అని సీఎం అడగడంతో పిల్లలంతా అవునంటూ సమాధానం ఇచ్చారు. విచ్చలవిడిగా సెల్‌ఫోన్ వాడొద్దని, డ్రగ్స్ జోలికెళ్లొద్దని పిల్లలకు సీఎం సూచించారు. తల్లిదండ్రులు టీచర్లు కూడా పిల్లల అలవాట్లను డేగకన్నుతో గమనిస్తూ ఉండాలని గట్టిగా చెప్పారు. ఈ సందర్భంగా తాడు లాగుడు (టగ్ ఆఫ్ వార్) పోటీల్లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పోటీపడ్డారు. దీనిలో చంద్రబాబు జట్టు విజయం సాధించింది. మరో పక్క విద్యార్థుల తల్లుల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సమీపం నుంచి నమాజ్ వినిపించిన సమయంలో సీఎం నిశ్శబ్దం పాటించారు.

సహపంక్తిగా భోజనం

సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో కలిసి నేల మీదే కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. చివర్లో తన తండ్రి భోజనం తిన్న ప్లేటును లోకేశ్ తీయడం అందర్నీ ఆకట్టుకుంది. కాగా, మంత్రి లోకేశ్ మూడు గంటల ముందే ఇక్కడికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎంకు ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో సమస్యల పరిష్కారానికి రూ. 1000 కోట్లు విడుదలకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

'ఉర్జావీర్'తో మరింత ఆదాయం!

- నెలకు 5 నుంచి 15 వేల సంపాదన
- పవర్ జనరేషన్ డెమోక్రటైజేషన్ తెస్తాం
- జగన్ హయాంలో పాలన గందరగోళం
- రెవెన్యూ సదస్సులు పూర్తయ్యేసరికి లక్షల్లో భూకబ్జా పిటిషన్లు వచ్చే చాన్స్
- 2047 నాటికి ప్రపంచంలో తెలుగువారు నంబర్ వన్ కావడమే నా సంకల్పం
- ఉర్జావీర్ సదస్సులో సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించడమే ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించుకున్నారని, 2047 స్వర్ణాంధ్ర డాక్యుమెంట్‌లో భాగంగా ప్రపంచంలోని తెలుగువారంతా నెంబర్ 1గా నిలిచేలా చేస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. తాను ఎప్పటి నుంచో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానంలో ఇంటి నుంచే డబ్బులు సంపాదించవచ్చని చెబుతున్నానని.. 'ఉర్జావీర్' వ్యవస్థతో అది సాధ్యమైందని తెలిపారు. వర్క్‌ఫ్రమ్ హోమ విధానం కూడా విస్తరించి.. మరింత సరళతరంగా.. 'వర్క్ విత్ ఫ్లెక్సిబుల్‌'గా మారిందన్నారు. సెల్ ఫోన్ చేతిలో ఉంటే.. ఆన్‌లైన్ విధానంలో పనులు చేస్తూ డబ్బులు సంపాదించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విజయవాడ సమీపంలోని పోరంకిలో శనివారం కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కలసి.. కేంద్ర ఇంధన శాఖ, రాష్ట్ర ఇంధన శాఖ సంయుక్తంగా ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెట్(ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో చేపట్టిన 'ఉర్జావీర్' సదస్సులో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్తు పొదుపు చేసే గృహోపకరణాలను తక్కువ ధరలకే ఆన్‌లైన్‌లో బుక్ చేసి వినియోగదారులకు చేరవేయడం ద్వారా ఉర్జావీర్‌లు డబ్బులు సంపాదించేందుకు వీలుందని తెలిపారు. నెలకు రూ.5000 నుంచి రూ.15000 దాకా అదనంగా వస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు డిమోక్రటైజేషన్‌ను తీసుకువస్తామని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి ఇంట్లోనూ సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసి వాడుకుని, మిగిలిన విద్యుత్తును డిస్కమ్‌లకు విక్రయించే విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. రైతుల పంప్‌సెట్‌కు రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ ఇస్తుందన్నారు. కృత్రిమ మేథ ఉపయోగించి సకాలంలో పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రపంచంలో తెలుగువారు 2047 నాటికి నెంబరు 1గా నిలవాలన్నది తన సంకల్పమని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి అనువైన కృత్రిమ మేథ(ఏఐ)తో సహా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

వైసీపీ పాలన గందరగోళం

గత ఐదేళ్లలో జగన్ రాష్ట్ర పాలనను గందరగోళంలో పడేశారని సీఎం చంద్రబాబు అన్నారు. వ్యవస్థలను ఇష్టారీతిన నిర్వీర్యం చేశారని, ఇప్పుడు వాటిని ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. వైసీపీ పాలనలో టెక్నాలజీని ఉపయోగించి భూములు కొట్టేశారన్నారు. రాష్ట్రమంతా భూకబ్జాలు పెరిగిపోయాయని, అందుకే రెవెన్యూ సదస్సులను పెట్టినట్టు తెలిపారు. ఈ సదస్సుల్లో ఒక్క రోజే భూకబ్జాలపై 12,000 ఫిర్యాదులు వచ్చాయన్నారు. నెలరోజుల్లో ఎన్ని లక్షల ఫిర్యాదులు వస్తాయోనని వ్యాఖ్యానించారు. జగన్ పాలనలో ఇంధన రంగం సంక్షోభంలో పడిందని విమర్శించారు. రాష్ట్రంలోని పరిపాలనా యంత్రాంగంలో ఎంత సంక్లిష్టత ఉందో.. ఇంకెంత గందరగోళం ఉందో చూస్తున్నామని చంద్రబాబు చెప్పారు. గతంలోని జగన్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జగన్ హయాంలో భూకబ్జాలు పెద్దఎత్తున జరిగాయని, ఒక్కరోజులోనే 12,000 ఫిర్యాదులు వచ్చాయన్నారు. పీపీఏలు రద్దుచేశారని, డిస్కమ్‌లను రూ.1,29,503 కోట్ల నష్టాల్లోకి జగన్ నెట్టారని తెలిపారు. తొమ్మిదిసార్లు రూ.33,000 కోట్ల మేర విద్యుత్తు చార్జీల భారాన్ని మోపారని తెలిపారు. సమర్థమంతమైన విధానాన్ని అమలు చేస్తూ చార్జీల భారం పడకుండా చేసే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

రాష్ట్రాన్ని ఆదుకోండి

విద్యుత్తు, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి రంగాల్లో రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. రాష్ట్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం, ఇంధన రంగాల్లో సాయం చేయాలన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా..: ఖట్టర్

ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ఇంధనశాఖ తీసుకువచ్చిన ఉర్జావీర్ విధానంతో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. లక్ష మంది ఉర్జావీర్‌లను నియమిస్తామని తెలిపారు.

రేషన్ మాఫియాపై సిట్ సరే.. సోలార్ అవినీతిపై విచారణ ఏదీ?

- సెకీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయండి: వైఎస్ షర్మిల



అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'రేషన్ బియ్యం మాఫియాపై పెట్టిన శ్రద్ధ... సోలార్ అవినీతిపై లేదెందుకు? అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన నివేదికలకు విలువ లేదా? మాజీ సీఎం స్వయంగా లంచాలు తీసుకున్నారని నివేదిక ఇస్తే, నిజాలు నిగ్గు తేల్చే బాధ్యత మీది కాదా?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మి ల నిలదీశారు. శనివారం ఎక్స్‌లో సీఎం చంద్రబాబుకు పలు ప్రశ్నలు సంధించారు. రేషన్ బియ్యం అక్రమాలపై విచారణకు సిట్‌ను వేయడాన్ని స్వాగతించిన ఆమె.. సోలార్ ఒప్పందాల్లో జరిగిన రూ.1,750 కోట్ల ముడుపులపై విచారణ ఏదని నిలదీశారు. 'తీగలాగితే మాజీ సీఎంతో పాటు అదానీని కూడా అరెస్టు చేయాల్సి వస్తుందని భయపడుతున్నారా? విచారణ చేయకుండా మౌనంగా ఉండేందుకు అదానీ మీకెంత లంచాలు ఆఫర్ చేశారు? ప్రతిపక్షంలో ఉండగా సెకీతో చేసుకొన్న ఒప్పందాల్లో భారీ అవినీతి జరిగిందన్నారు. టెండర్లు లేకుండా అదానీకి కట్టబెట్టడం అంటే పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చాక నిజాలు నిగ్గు తేలుస్తామంటూ గొప్ప మాటలు చెప్పారు. మరి ఇప్పుడేమైంది చంద్రబాబూ? అంటే ఆనాడు అదానీకి జగన్ అమ్ముడు పోతే.. ఇప్పుడు మీరు అమ్ముడు పోయారనేగా అర్థం? అదానీ మిమ్మల్ని కొనకపోతే, తక్షణమే పంజరంలోంచి ఏసీబీని విడుదల చేయండి. ఫాస్ట్ ట్రాక్ విచారణ జరిపించండి. సోలార్ పవర్ ఒప్పందాన్ని రద్దు చేయండి' అని చంద్రబాబును షర్మిల డిమాండ్ చేశారు.

టీడీపీలో చల్లబడ్డ రాజ్యసభ ఆశావహులు

- అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయన్న సంకేతాలిస్తున్న చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సీట్లను ఆశిస్తూ పలు ప్రయత్నాలు చేస్తున్న టీడీపీ నేతలు తాజా పరిణామాలతో చల్లబడ్డారు. పార్టీకి సంబంధించి అభ్యర్థిత్వాలు ఇప్పటికే ఖరారయ్యాయని అధినేత చంద్రబాబు సంకేతాలు ఇస్తుండటంతో ప్రయత్నాలు విరమించుకొన్నారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన 3 రాజ్యసభ సీట్ల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ అయింది. వీటికి నామినేషన్ల దాఖలుకు 10వ తేదీ చివరి రోజు. బీదా మస్తాన్ రావును టీడీపీ, ఆర్. కృష్ణయ్యను బీజేపీ నిలబెడుతున్నట్లు సమాచారం. మోపిదేవి వెంకటరమణ ఖాళీ చేసిన స్థానంలో కాకినాడ జిల్లాకు చెందినసానా సతీశ్‌ను నిలపాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది.

వివేకా పీఏ కృష్ణారెడ్డి ప్రైవేటు కేసులో డీఎస్పీ విచారణ

- 10 మంది సాక్షులకు 160 నోటీసులు జారీ
- వైఎస్‌ఆర్‌ఏఎఫ్‌యూ మాజీ రిజిస్ట్రార్ సహా ఆరుగురు హాజరు



వివేకా పీఏ కృష్ణారెడ్డి — మాజీ రిజిస్ట్రార్ సురేంద్రనాథ్‌రెడ్డి

పులివెందుల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి వేసిన ప్రైవేటు ఫిర్యాదు కేసులో ఆరుగురు సాక్షులను డీఎస్పీ మురళీ నాయక్ శనివారం ఉదయం విచారించారు. వారం రోజుల క్రితం పది మంది సాక్షులకు సీఆర్పీసీ 160 నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న న్యాయవాది ఓబులరెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, డాక్టర్ రఘునాథరెడ్డి, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఈసీ సురేంద్రనాథరెడ్డి, మూలి రాజేష్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో మహేశ్వర్‌రెడ్డి శనివారం విచారణకు హాజరయ్యారు. నోటీసులు అందుకున్న మరో నలుగురు... వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రభావతమ్మ విచారణకు హాజరు కాలేదు. హాజరయిన ఆరుగురినీ డీఎస్పీ దాదాపు గంటపాటు విచారించారు. 'విచారణ సందర్భంగా పోలీసులు పలు వీడియోలు చూపించి, ఆడియోలు వినిపించి ప్రశ్నలు అడిగారు. వాటన్నింటికీ సమాధానాలు చెప్పాం. విచారణకు పూర్తిగా సహకరించాం' అని డీఎస్పీ విచారణకు హాజరైన వారు మీడియాకు తెలిపారు.

మా ముందు వ్యక్తిగతంగా హాజరుకండి

- ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్‌హెచ్‌ఆర్సీ సమన్లు
- బాలికల అదృశ్యంపై నివేదిక ఇవ్వకపోవడమే కారణం

న్యూఢిల్లీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 3 వేల మంది బాలికలు అదృశ్యమయ్యారని అందిన ఫిర్యాదు అంశంలో తమ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) షరతులతో కూడిన సమన్లు జారీ చేసింది. అవసరమైన నివేదికలు పంపాలని పలుమార్లు రిమైండర్లు ఇచ్చినా స్పందించకపోవడంతో, ఇప్పుడు అవసరమైన సమాచారం, డాక్యుమెంట్లతో వచ్చే జనవరి 20వ తేదీ లోపు తమ ముందు వ్యక్తిగతంగా హాజరుకావాలని కమిషన్ ఆదేశించింది. ఒక వేళ వచ్చే నెల 14వ తేదీ లోగా సంబంధిత సమాచారం, డాక్యుమెంట్లు అందితే వ్యక్తిగత హాజరును రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఏపీలో 3 వేలకు పైగా బాలికలు కనిపించకుండాపోయారని ఒక ఆంగ్లవార్త పత్రికలో ప్రచురితమైన వార్తకథనం ఆధారంగా న్యాయవాది, సామాజిక కార్యకర్త వై.బాలచందర్‌రెడ్డి గత జనవరిలో కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

అనంతపురం పోలీసుల కస్టడీకి బోరుగడ్డ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. న్యాయస్థానం అనుమతితో శనివారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం చేరుకున్న అనంతపురం ఫోర్త్‌టౌన్ పోలీసులు.. ఉదయం 10:30 గంటల సమయంలో జైలు నుంచి అదుపులోకి తీసుకుని ఎస్కార్ట్ వాహనంలో రోడ్డుమార్గం గుండా అనంతపురానికి తరలించారు.

భూకబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

- టీడీపీ ప్రజావేదికకు బాధితుల క్యూ


అమరావతి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాదారుల అక్రమాలపై అనేక మంది బాధితులు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. అర్జీదారుల నుంచి వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి ఫిర్యాదులు స్వీకరించారు.

తమ గ్రామంలోని చెరువులో 42 అడుగుల లోతున అక్రమంగా మట్టి తవ్వకాలు సాగించిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా మొసలిపాడుకు చెందిన పలువురు రైతులు కోరారు.

- తమకు గతంలో ఇచ్చిన స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించిన కబ్జాదారులు వైసీపీ నేతలను అడ్డుపెట్టుకుని స్థలాన్ని ఖాళీ చేయడం లేదని బాపట్ల జిల్లా చుండూరు మండలానికి చెందిన జి. వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.
- 1986లో ప్రభుత్వం తమకు ఇచ్చిన 7.96 ఎకరాల డీపట్టా భూమిని సాగు చేసుకుంటున్నామని, అనారోగ్యంతో తాము స్వగ్రామం వెళ్లినప్పుడు అదే గ్రామానికి చెందిన వారు కబ్జా చేశారని అనంతపురం జిల్లా వెళమద్ది గ్రామానికి చెందిన సీఎస్ హరినాథ్‌రెడ్డి, పి. ఓబిరెడ్డి ఫిర్యాదు చేశారు.
- తన ఇంటి ముందు స్థలంలో ఒక ఏఈ మట్టి తోలుకెళ్లి, ఇంటికి దారి లేకుండా అడ్డంగా గోడ కడుతున్నాడని అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు చెందిన షేక్ వహీద ఫిర్యాదు చేశారు. ఏఈపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- 30 ఏళ్లుగా తన స్వాధీనంలోని పొలాన్ని నరసింహులు అనే వ్యక్తి కబ్జా చేశాడని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని శ్రీ సత్యసాయి జిల్లా నడింపల్లి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కె. అప్పిరెడ్డి వాపోయారు.
- తాను కిడ్నీ సమస్యతో బాధపడుతున్నానని, ఏ పనీ చేయలేకపోతున్నానని, ప్రభుత్వ సాయం చేయాలని ప్రకాశం జిల్లా అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన జి. యోగిరాజు విజ్ఞప్తి చేశారు.

'రేషన్'లో భారీ కుంభకోణం

- కాకినాడ పోర్టు నుంచి మూడేళ్లలో13.10 లక్షల క్వింటాళ్ల బియ్యం అక్రమ రవాణా :మంత్రి మనోహర్



బొబ్బిలి, పార్వతీపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు గత మూడేళ్లలో 1.31 లక్షల మెట్రిక్ టన్నుల (13.10 లక్షల క్వింటాళ్లు) రేషన్ బియ్యం అక్రమ రవాణా జరిగినట్లు గుర్తించాం. దీనిపై సిట్ దర్యాప్తునకు సీఎం ఆదేశించారు. అన్ని విషయాలు బయటకు వస్తాయి' అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం ఆయన విజయనగరం జిల్లా బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడారు. 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 60-40 శాతం వాటాలతో బియ్యాన్ని పేదలకు అతి తక్కువ ధరకు అందజేస్తున్నాయి. దీనిలో పెద్దఎత్తున కుంభకోణం జరిగింది. ఆహార భద్రత చట్టం కింద పేదలందరికీ బియ్యం అందివ్వాలన్న లక్ష్యాన్ని నీరుగార్చారు. అందుకే బటన్ నొక్కుడుతో కాకుండా నేరుగా బియ్యాన్ని పారదర్శకంగా పేదలకు అందజేస్తున్నాం. పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడం చట్టవ్యతిరేక చర్య. నిందితులపై పీడీ చట్టాన్ని ప్రయోగిస్తాం. నౌకను సీజ్ చేసే విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయనే ప్రచారంలో నిజం లేదు. రాష్ట్ర పోలీసులకు అన్ని రకాల అధికారాలు ఉన్నాయి. అక్రమాలను అడ్డుకోవడమే వారి కర్తవ్యం. పోర్టు అప్పగింత తదితర అక్రమాలన్నింటిపైనా ఆరా తీస్తాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తనిఖీలు నిర్వహించినప్పుడు అనేక దుర్మార్గాలు వెలుగులోకి వచ్చాయి' అనిఅని తెలిపారు. కాగా, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం మండలం పెద్దబొండపల్లిలో పంట పొలాలను మంత్రి పరిశీలించారు. అనంతరం నర్సిపురం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 'పీటీఎం'కు అని హాజరయ్యారు.

'రీసర్వే' లోపాల పుట్ట!

(మొదటి పేజీ తరువాయి)

రీసర్వే పైలట్ సక్సెస్ సభ నిర్వహించిన జగన్ సొంత భజన చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ప్రారంభించిన తొలి రోజే మొత్తం బండారం బట్టబయలైంది. ఈ గ్రామంలో భూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రైవేటు భూములను దేవదాయ శాఖ ఖాతాలో వేయడంతో పాటు ఆ మొత్తం సర్వే నంబరును నిషేధ భూముల జాబితాలో చేర్చారంటూ బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో జరిగిన సదస్సుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా హాజరయ్యారు. రీసర్వే పేరిట జరిగిన గందరగోళాన్ని రైతులు, స్థానికులు ఆయనకు విడమర్చి చెప్పారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నవన్నీ తప్పుడు లెక్కలని తేల్చిచెప్పారు.

లాక్‌డౌన్‌లో హడావుడి

ఉమ్మడి కృష్ణాజిల్లా జగయ్యపేట మండలంలోని తక్కెళ్లపాడు జనాభా దాదాపు 3 వేలు. ఈ గ్రామంలో 1,600 ఎకరాల భూమి ఉంది. చిన్న గ్రామం, భూముల విస్తీర్ణం కూడా తక్కువగానే ఉండటంతో రీసర్వేకు అనువుగా ఉంటుందని దీన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆరెంజ్ జోన్‌లో ఉన్న గ్రామంలో జగన్ సర్కారు హడావుడిగా ఈ ప్రాజెక్టు చేపట్టింది. భూముల కొలతలు వేయడంలో రైతులను భాగస్వామ్యం చేయలేదు. సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం రైతులకు నోటీసులు ఇవ్వకుండానే అధికారులే సొంతగా సర్వేలు చేసి రికార్డులు రూపొందించి మమ అనిపించారు. లోపాల పుట్టగా మారిన ఆ రికార్డులతో ఇప్పుడు రైతులు నానాఅవస్థలూ పడుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో కోత

బ్రిటిషర్ల పాలనలో 1932లో సర్వే చేసినప్పుడు తక్కెళ్లపాడులో భూముల విస్తీర్ణం 1,539 ఎకరాలు. పైలట్‌లో రీసర్వే చేసినప్పుడు తేలిన విస్తీర్ణం 1,533.56 ఎకరాలు. ఇక్కడ మొత్తం 150 సర్వే నంబర్లు ఉంటే, రీసర్వే తర్వాత వాటిని 631కి పెంచారు. అంతకుముందు గ్రామంలో ప్రభుత్వ భూమి 272.52 ఎకరాలు ఉండగా, సర్వే తర్వాత 272.23 ఎకరాలుగా తేల్చారు. అంటే, ఉన్నదాని కంటే కొంత తగ్గింది. రీసర్వే అనంతరం 71 సర్వే నంబర్లలోని భూముల విస్తీర్ణంలో భారీగా తేడాలొచ్చాయి. రెండు నుంచి ఐదు ఎకరాల విస్తీర్ణంలో తేడాలు వచ్చిన సర్వే నంబర్లు 117 వరకూ ఉండగా, పదెకరాలకు పైగా తేడాలున్న సర్వే నంబర్లు ఏకంగా 173 ఉన్నాయి. అత్యధికంగా 3.73 సెంట్ల చొప్పున భూ విస్తీర్ణంలో తేడాలు బయటపడ్డాయి. వాస్తవాలు ఇలా ఉంటే, భూమి విస్తీర్ణంలో తేడాలపై తమకు కేవలం రెండు ఫిర్యాదులే వచ్చాయని, వాటిని కూడా పరిష్కరించామని నాటి అధికారులు సర్కారుకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

బయటపడ్డ పాత తప్పులు

తక్కెళ్లపాడులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్.పి. సిసోడియాతో పాటు కలెక్టర్ లక్ష్మీషా, ఎమ్మెల్యే తాతయ్య ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామంలో రీసర్వేతో భూమి రికార్డుల్లో తప్పులు వచ్చాయని 17 మంది రైతులు ఫిర్యాదు చేశారు. జగన్ పేరిట ఇచ్చిన పాస్ పుస్తకాల్లో ఉన్న విస్తీర్ణం, టీడీపీ హయాంలో ఇచ్చిన పట్టాలో ఉన్నదానికి చాలా తేడాలు ఉన్నాయని సిసోడియా దృష్టికి తీసుకెళ్లారు. ఓ సర్వే నంబరులో ప్రైవేటు, దేవదాయ శాఖ భూములు ఉన్నాయి. అయితే, రెవెన్యూ అధికారులు ఆ భూమిని మొత్తం దేవదాయ శాఖదిగా నమోదు చేశారు. అనంతరం దాన్ని నిషేధ జాబితా 22(ఏ)లో చేర్చారు. దీంతో 42 ఎకరాల మేర భూములున్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమకు పంట రుణాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దీన్ని పరిష్కరించాలని స్పెషల్ సీఎస్‌ను కోరారు. అయితే ఈ సమస్యను పరిష్కరించాలంటే గ్రామంలో మరోసారి భూముల సర్వే చేయాలని, లేకుంటే రీసర్వే రికార్డులను సవరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి దేవదాయ భూములకు సబ్‌డివిజన్ నంబర్లు కేటాయించి వాటిని మాత్రమే 22(ఏ)లో కొనసాగిస్తే సరిపోతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ సదస్సులు పూర్తయిన 45 రోజుల్లో ఈ సమస్యలను పరిష్కరిస్తామని సిసోడియా తెలిపారు.

రేషన్ బియ్యంతో నాకు సంబంధం లేదు: ద్వారంపూడి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, రేషన్ బియ్యంతో తనకు, తన కుటుంబానికీ ఎలాంటి సంబంధమూ లేదని కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. 'మా తమ్ముడు బియ్యం ఎగుమతి చేస్తాడు తప్ప, రాజకీయాలతో అతడికి ఎలాంటి సంబంధమూ లేదు. నా మీద నిందలు వేసి లేనిపోని ఆరోపణలు చేస్తున్న సిటీ ఎమ్మెల్యే కొండబాబు రేషన్ బియ్యం సప్లయి చేసే వాళ్ల దగ్గర రూ.5లక్షలు తీసుకుంటున్నాడు. అందుకే పవన్‌కల్యాణ్ మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా రేషన్ బియ్యం అక్రమ తరలింపును ఎందుకు కంట్రోల్ చేయలేకపోయారు. ఎగుమతిదారులకూ, రేషన్ బియ్యానికీ సంబంధం ఉండదు.ప్రభుత్వం దానిమీద దృష్టిపెట్టాలి. ఇష్టం వచ్చినట్లు వాగుతున్నారు. రోజులన్నీ ఒకేలా ఉండవు. ఇటువంటి కక్షసాధింపు చర్యలు మానుకోవాలి. ఎమ్మెల్యే కొండబాబు అక్రమాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖల ద్వారా తెలియజేస్తా'నన్నారు.

ప్రేమించలేదని ఉన్మాది దాడి



వేముల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రేమించలేదన్న అక్కసుతో ఓ యువతిపై ఉన్మాది కత్తితో దాడి చేశాడు. ఇంట్లో చొరబడి విచక్షణారహితంగా 13సార్లు కత్తితో పొడిచాడు. చుట్టుపక్కలవారు యువతిని ఆసుపత్రికి తరలించారు. కడప జిల్లా వేముల మండలం వి.కొత్తపల్లెలో ఈ దారుణం చోటుచేసుకుంది. వి.కొత్తపల్లె వీఆర్‌ఏ భాస్కర్ కుమార్తె షర్మిల(18) ఇంటర్ చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన కుళాయప్ప (25) ప్రేమించాలంటూ కొంతకాలంగా ఆ యువతిని వేధిస్తున్నాడు. శనివారం ఆ యువతి ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఆమె ఇంట్లోకి చొరబడ్డాడు. ప్రేమించాలంటూ ఒత్తిడి చేసి, ఒప్పుకోకపోవడంతో కత్తితో దాడిచేశాడు.



'ఒంగోలు' ఎద్దు @ 19 లక్షలు

నాదెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జాతి వృషభం రికార్డు స్థాయిలో రూ.19 లక్షల 1,116ల ధర పలికింది. పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన దేవాబత్తుని భద్రయ్య కుమారులు నరేంద్రబాబు, శేఖర్ నుంచి అనంతపురం జిల్లా ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా ఈ మొత్తం చెల్లించి కొనుగోలు చేశారు. సుమారు ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన ఈ వృషభం జూనియర్ సైజ్ విభాగంలో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పలుమార్లు బహుమతులను సాధించి గ్రామానికి పేరుతెచ్చిందని భద్రయ్య కుమారులు తెలిపారు.



తొడగొట్టారు...

ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నటుడు మురళీమోహన్ తొడగొట్టారు. ఈ సరదా సన్నివేశానికి సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి స్మారక 71వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు వేదికయ్యింది. శనివారం రాత్రి ప్రారంభమైన ఈ పోటీలకు 25 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్ నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, ఉగ్రనరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్.దామోదర్, జేసీ గోపాలకృష్ణ, రాష్ట్ర, క్రీడల నిర్వాహకులు క్రిష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నారాయణచౌదరి పాల్గొన్నారు.

కాకినాడ పోర్టులో 52 రికార్డులు సీజ్

- ఇటీవల రాజమహేంద్రిలో సీఐడీ తనిఖీ
- రాజధానిలోని ఆఫీసుకు చేరిన రికార్డులు
- బియ్యం అక్రమార్కుల గుండెల్లో రైళ్లు



రాజమహేంద్రవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టు అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రేషన్ బియ్యం విదేశాలకు అక్రమంగా ఎగుమతి, సీపోర్టులో రూ.3 వేల కోట్ల ఆస్తిని కాజేయడానికి మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు సాగించిన దందాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల రాజమహేంద్రవరం రీజినల్ సీఐడీ అధికారి అస్మా ఫర్హీన్ ఆధ్వర్యంలో కాకినాడ పోర్టులో తనిఖీలు చేశారు. ఈ సమయంలో 52 రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. వైసీపీ పాలన మొదలైన 2019 నుంచి ఇప్పటి వరకు పోర్టులో జరిగిన లావాదేవీలకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ స్వాధీనం చేసు కున్నారు. వాటిని అమరావతిలోని సీఐడీ కేంద్ర కార్యాలయానికి పంపించారు. ఈ రికార్డులను రాష్ట్రస్థాయి అధికారులు క్షుణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. 2019 నుంచి కాకినాడ పోర్టులో బియ్యం, ఇతర సరుకుల రవాణా ఎలా జరిగింది? పోర్టులో జరిగిన లావాదేవీలు ఎన్ని? అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. యాంకరేజ్ పోర్టు నుంచే బియ్యం రవాణా అవుతుంటాయి. రోజూ కనీసం 30 నుంచి 40 వేల లారీల బియ్యం ఎగుమతి అవుతుంది. సుమారు 7 గేట్లు దాటి సరుకు ఓడల వద్దకు చేరుతుంది. ప్రస్తుతం మూడు గేట్ల వద్ద చెక్‌పోస్టులు పెట్టి తనిఖీ చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యాన్ని పట్టేస్తున్నారు

విదేశాలకు తరలిస్తున్న పీడీఎస్ బియాన్ని అధికారులు సులభంగా గుర్తించగలుతున్నారు. ఇటీవల రేషన్ బియ్యంలో ప్రొటీన్లు వంటి బలవర్ధక పదార్థాలు ఉండే కార్నల్స్ అనే పదార్థం కలుపుతున్నారు. అది కూడా బియ్యం మాదిరిగానే ఉండి, కొద్దిగా సాగినట్టు ఉంటుంది. 100 కేజీల బియ్యంలో ఒక కేజీ కార్నల్స్ కలుపుతారు. వీటిని ప్రభుత్వమే జిల్లాల వారీ సరఫరా చేస్తుంది. పౌర సరఫరాల జిల్లా మేనేజర్(డీఎం)లకు వస్తుంది. ఆయా కస్టమ్ రైస్(సీఎంఆర్) మిల్లులకు రైసు మోతాదును బట్టి పంపిస్తారు. మిల్లుల్లోని ఆటోమేటిక్ మిషన్‌లో 100 కేజీలకు ఒక కేజీ కార్నల్‌ను వేస్తారు. అదే బియ్యం రేషన్ ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తారు. ఈ బియ్యం ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, కాకినాడకు చెందిన రైస్ మాఫియా విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఈ బియ్యాన్ని పట్టుకోవడంలో 'కార్నల్స్' బాగా ఉపయోగపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అవి లేకపోతే రేషన్ బియ్యం గుర్తించడం కష్టమనే అభిప్రాయం ఉంది. మరోవైపు విల్లుల్లో రేషన్ బియ్యాన్ని దాచేసే ప్రయత్నాలు కూడా జరిగి ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. పోర్టు ద్వారా బాయిల్డ్ రైసు, రా రైసు ఎగుమతి అవుతుంది. రా రైసులో రేషన్ బియ్యం కల్తీ ఎక్కువగా ఉంటుంది. కొన్ని దేశాలకు నేరుగా రేషన్ బియ్యాన్నే రవాణా చేస్తుండడం గమనార్హం.

సార్టెక్స్ బియ్యంతో మోసాలు

గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చేముందు పేదలందరికీ రేషన్ ద్వారా సన్నబియ్యం ఇస్తానని ప్రచారం చేసింది. కానీ, వైసీపీ ప్రభుత్వం రేషన్ షాపులకు సార్టెక్స్ బియ్యం ఇవ్వకుండా, వాటిని బయటి మార్కెట్‌లోకి డంపింగ్ చేసింది. మిల్లర్లు, బియ్యం వ్యాపారులు కుమ్మక్కై ఈ సార్టెక్స్ బియ్యాన్ని గిద్దమసూరి, సోనామసూరి వంటి సన్న రకాలుగా పేర్కొంటూ మార్కెట్‌లో విక్రయించారు. 2019కి ముందు 25 కేజీల గిద్దమసూరి బస్తా రూ.600 నుంచి 900 వరకు ఉండగా తర్వాత రూ.1600 నుంచి రూ.3 వేలకు పైగా దాటేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక.. మార్కెట్‌లో కొంత మార్పు వచ్చింది. రైస్ మోసాలు తగ్గాయి. ధరలు కూడా కొంత మేరకు దిగొచ్చాయి.

వైసీపీ హయాంలో విచ్చలవిడి!

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పీడీఎస్ బియ్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగింది. రాజమండ్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి స్నేహిత కథనం ప్రకారం.. 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.27 కోట్ల విలువైన 2,075.41 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 247 కేసులు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. కోనసీమ జిల్లాలో రూ.10.63 కోట్ల విలువైన 852.79 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకుని 82 కేసులు పెట్టారు. తూర్పుగోదావరి జిల్లాలో రూ.6.33 కోట్ల విలువైన 643.84 టన్నుల బియ్యం పట్టుకుని 79 మంది మీద కేసులు పెట్టారు. కాకినాడ జిల్లాలో రూ.11.11 కోట్ల విలువైన 663.78 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకుని 85 కేసులు నమోదు చేశారు.

ఉద్యోగాలు కల్పించేలా పాఠ్యాంశాలు

- పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరం తగ్గిస్తాం
- ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో లోకేశ్



ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. వేదికపై ఆదినారాయణరావు, గ్రంథి మల్లికార్జునరావు, పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠ్యాంశాలకు రూపకల్పన చేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విశాఖలో శనివారం సాయంత్రం జరిగిన ఆంధ్రా విశ్వవిద్యాలయం(ఏయూ) పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ, ప్రస్తుత విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ ప్రసంగించారు. ఉన్నత విద్యా శాఖ తీసుకోవద్దని తనకు చాలామంది చెప్పారని, అయితే సవాళ్లను ఎదుర్కోవడం తనకు ఇష్టమని, అందుకే ఈ శాఖ బాధ్యతలను తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఒక్క యూనివర్సిటీనైనా అంతర్జాతీయ స్థాయిలో నెంబర్ 1గా నిలపాలని సీఎం చంద్రబాబు తనకు లక్ష్యంగా నిర్దేశించినట్టు తెలిపారు. ప్రస్తుతం ఏయూ ఎన్ఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉందని, మూడో స్థానానికి తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో మెరుగైన ఎకో సిస్టమ్‌ను నిర్మించేందుకు పూర్వ విద్యార్థుల సహకారం తీసుకుంటామన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కృషిచేస్తామని తెలిపారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మౌలిక వసతుల కల్పన, పాఠ్యాంశాల ఆధునికీకరణ, అత్యుత్తమ ప్రతిభను ఆకర్షించేందుకు ఖాళీల భర్తీ ప్రక్రియ వంటివి చేపడతామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థ సమూల ప్రక్షాళనకు కట్టుబడి ఉన్నట్టు వెల్లడించారు. ఉన్నత విద్యా వ్యవస్థలోని లోపాల వల్ల కోర్సులు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగాలు దొరకడం లేదని మంత్రి తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు లభించేలా చూస్తామన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'స్కిల్ సెన్సెస్'(నైపుణ్య గణన)ను చేపట్టిందని తెలిపారు. 'ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' తెచ్చే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. 'ఇండస్ట్రీ కనెక్ట్ ప్రోగ్రామ్'ను ఉన్నత విద్యా సంస్థల్లో అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆధునిక టెక్నాలజీతో వస్తున్న మార్పుల అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ అండ్ ఎండీ సుబ్రహ్మణ్యన్ పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్, జీఎంఆర్ అధినేత మల్లికార్జునరావు మాట్లాడుతూ.. గత కొన్నాళ్లుగా భారత్‌లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.